'నటరాజు'

# కుప్పిలి వెంకటేశ్వరరావు

## శతజయంతి ఉత్సవ సంస్మరణ సంచిక




ఆహ్వానము
పొన్నూరు కళాపరిషత్
రి.నెం. 464/2004
నిడుబ్రోలు - పొన్నూరు.
4-7-6ఎ, విద్యానగర్, నిడుబ్రోలు - పొన్నూరు.
గుంటూరు జిల్లా, సెల్ : 98481 44268, 94908 47261
www.ponnurkalaparishat.org
ప్రముఖ రంగస్థల నటుడు "నటరాజు" కుప్పిలి వెంకటేశ్వరరావు గారి
శత జయంతి సందర్భముగా
23 వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి
ఆహ్వాన నాటికల పోటీలు
2024 జూన్ 8, 9, 10 తేదీలు
జూన్ 10 వ తేదీన పరిషత్ వేదికపై
ఈ సంచిక ఆవిష్కరణ జరిగినది
వేదిక : డా॥ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళా వేదిక
జిల్లా పరిషత్ హైస్కూల్ - నిడుబ్రోలు.

నాటకం నా ఊపిరి
జీవితం తదుపరి



"నటరాజు"

# కుప్పిలి వెంకటేశ్వరరావు

# శతజయంతి ఉత్సవ సంస్మరణ సంచిక


సంపాదకులు :

ఆకురాతి మురళీకృష్ణ, పొన్నూరు, 81212 25046

ఉప సంపాదకులు :

డా॥ కొల్లి మోహనరావు, ఏలూరు, 98482 10331

వెంపటి రాధాకృష్ణ, హైదరాబాద్, 99498 13372

సూరినేని ఆంజనేయులు నాయుడు, పొన్నూరు, 98481 44268



'పద్మశ్రీ' నాజర్ కళాక్షేత్రం ప్రచురణ

(కల్చరల్ ట్రస్ట్ నం.115/2005)

కుప్పిలి వెంకటేశ్వరరావు
శతజయంతి ఉత్సవ సంస్మరణ సంచిక

Publication : June 2024

Copies : 500

Price : No Cost

Printers :
Kalimisri Graphics, Vijayawada-2

For Copies :
**Akurathi Muralikrishna**
Railpet, Nidubrolu,
PONNUR-522 524, Guntur Dist, AP
Cell No : + 91 81212, 25046, 63056 82159

ప్రచురణ
పద్మశ్రీ నాజర్ కళాక్షేత్రం




నాకు స్వయంగా పరిచయం లేకపోయినా, అనుమతి తీసుకోకపోయినా తమ అమూల్యమైన అభిప్రాయాలను ప్రచురించడం ద్వారా ఈ సంచికను పరిపుష్టం చేయడానికి కారణభూతులైన కె.వి.ఆర్ గారి శిష్యులు, జర్నలిస్టులు, అభిమానులు అందరికీ కృతజ్ఞతలతో ...

- సంపాదకులు







# అంకితం

స్కూల్ దశలోనే నాటకరంగంలో రెహార్సల్ రూంలో
క్రమశిక్షణ నేర్పిన చింతక్రింద జానకిరామయ్య
(రైలుపేట, పొన్నూరు)...

యూనివర్సిటీ దశలో కుప్పిలి వెంకటేశ్వరరావు...
(విశాఖపట్నం)

ఉద్యోగకాలంలో KST శాయి (బాపట్ల)

& వివాహం ఐనప్పటినుంచి నన్నూ
మా నాటక బృందానికీ అండదండలుగా నిలుస్తున్న
నా సహధర్మచారిణి
శ్రీమతి ఆకురాతి మల్లేశ్వరి గార్లకు



**ఈ సంచిక అంకితం**



## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ........ | ...7 |
| జీవిత విశేషాలు | ........ | ...9 |
| Founding father of the samakhya | ........ | ...16 |
| నేనూ నా సమాఖ్య | కుప్పిలి వెంకటేశ్వరరావు | ...18 |
| శ్రీవారికి ప్రేమలేఖ | కుప్పిలి శారద | ...20 |
| ప్రియమైన నాన్నగారు | బి.లక్ష్మీకుమారి | ...24 |
| మరణంలేని మాష్టారు | బి.ఎస్.గణేష్ పాత్రో | ...25 |
| తండ్రి, గురువు, గైడ్, ఫిలాసఫర్ | కె.వి.ఎస్.డి.ప్రసాద్ | ...27 |
| పొన్నూరు కళాపరిషత్ | ఎస్.ఆంజనేయులు నాయుడు | ...29 |
| చంద్రునికో నూలుపోగు | ఆకురాతి మురళీకృష్ణ | ...30 |
| నేను చూసిన నటరాజు కె.వెంకటేశ్వరావు | ఎన్.తారక రామారావు | ...36 |
| కుప్పిలి వెంకటేశ్వరరావు | మల్లేశ్వరరావు ఆకుల | ...38 |
| గురుభ్యోన్నమః | యస్.కె.మిశ్రో | ...48 |
| గురుదేవులు | కె.విజయలక్ష్మి | ...53 |
| నా నాటకరంగ ప్రస్థానానికి తొలి గురువు | డా॥ మోహనరావు కొల్లి | ...54 |
| సాంఘిక నాటకరంగంలో అతనిదో శకం | యం.సి.దాస్ | ...58 |
| "చరితార్థులు" మా వెంకటేశ్వరరావు | ఎ.బి.ఆనంద్ | ...60 |
| కె.వి.ఆర్. గారితో నాకున్న అనుబంధం..... | శ్రీపాద కుమార శర్మ | ...65 |
| స్ఫూర్తిదాత...కె.వి.ఆర్. | గోపరాజు సీతారామారావు | ...72 |
| కళావేదిక రారాజు | తులసి బాలకృష్ణ | ...73 |
| చిర యశస్వి - నటరాజ్ కె.వి. | బి.వి.అప్పారావు | ...75 |
| అభినందన మందారాలు | డి.విరజానంద్, జి.హరగోపాల్ | ...77 |
| జ్ఞాపకమ్ | డా॥ పాతూరి సుబ్రహ్మణ్య కవి | ...78 |


ఈ సంచికలో ప్రచురించిన కొన్ని వ్యాసాలు ... నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు నట జీవన చిత్రణం మరియు బహురూప నట సమాఖ్య, విశాఖపట్నం 18 వ వార్షిక సంచిక ... నుండి సేకరింపబడినవి

## సంపాదకీయం....

దేశవిదేశాల్లోని తెలుగు ప్రజలు గర్వించదగ్గ తెలుగు రంగస్థల కళాకారుడు కుప్పిలి వెంకటేశ్వరరావు గారు. వారిని గూర్చి ఎంత చెప్పుకున్నా తక్కువే, అది చంద్రునికో నూలుపోగు మాత్రమే.

**"నాటకం నా ఊపిరి, తర్వాతనే జీవితం"** అని గర్వంగా నిరూపించుకున్న క్రియాశీలుడు కే. వెంకటేశ్వరరావు గారు. ఒక్కముక్కలో చెప్పాలంటే, వారిని గురించి చెప్పగల అర్హత గలవారు తెలుగునాట బహుకొద్దిమంది మాత్రమే. అంతరించి పోతున్న తెలుగు నాటక రంగానికి జవసత్వాలు, నూతన ఒరవడి కల్పించి, దిశానిర్దేశం చేసిన మహోన్నత నటుడు, ప్రయోక్త, దర్శకుడు. వారి ప్రదర్శనలు చూసి తన్మయత్వం చెందని ప్రేక్షకులు ఉండరని చెప్పడం అతిశయోక్తి కాదు. 'నాతో మాట్లాడ్డమే ఒక ఎడ్యుకేషనోయ్' అన్నట్లు, ఆయన నాటకం చూడ్డమే ఒక కళాకారుడుగా తయారుకావడం. వారి గురించి రాయడానికి చేతులు సహకరించని 'ఏకలవ్య శిష్యుల'మైన నాలాంటి వారికి ఈ తొలిపలుకుల సంపాదకీయం రాయడం కత్తిమీద సాము లాంటిదే.

చివరిగా....

వారు దివంగతులయి యాభై సంవత్సరాలు పూర్తయినా, సినిమాలకన్నా మిన్నగా వారి ప్రదర్శనలు చూసి ఇంకా గుర్తు చేసుకునే తెలుగు ప్రేక్షకులు వున్నారనడం వాస్తవం. తెలుగు నాటకరంగంలో గర్వపడే కళాకారులు ఉండకూడదు కానీ, గర్వించదగ్గ కళాకారుడు "నటరాజు" కుప్పిలి వెంకటేశ్వరరావు మాత్రమే. ఈ సంచిక లోని ప్రముఖుల వ్యాసాలు చదివిన కళాకారులు మరింత స్ఫూర్తితో తెలుగు నాటక రంగానికి మరింత శోభ తెస్తారనే ఆశ ఈ సంచిక ప్రచురణకు ప్రేరణ.

అన్నట్లు...

మా గురుదేవులు వెంకటేశ్వరరావు గారి స్మృతికి చిహ్నంగా, "కుప్పిలి కళాంజలి, పొన్నూరు (1972 నుంచి )" సంస్థ ద్వారా నాటక ప్రదర్శనలు ఇస్తున్న మాసంస్థ సభ్యులకు కళాంజాలులు.

వెంకటేశ్వరరావు గారి శత జయంతి సందర్భంగా (20-11-2023) ఆవిష్కరించలేక పోయిన ఈ "శతజయంతి స్మారక సంచిక"ను 10-6-2024న (23వ పొన్నూరు కళా పరిషత్ నాటిక పోటీల కళా వేదికపై ) ఆవిష్కరణ చేస్తున్నామని తెలుపుకుంటున్నాము)

ఈ సంచిక ప్రింటుచేసి కళాకారులు అందరకూ అందుబాటులోకి తీసుకురావడానికి ముఖ్య కారకులు, వెంకటేశ్వరరావు గారి దగ్గర నేరుగా శిష్యరికం చేసిన కళాకారులు, దర్శకులు, పరిషత్తుల జడ్జీలు డా॥కొల్లి మోహన్‌రావు, రమణమూర్తి గార్లు (ఉప సంపాదకులు).

వారు ఇందులోని వ్యాసాలు సేకరించి అందజేయకపోతే ఈ సంచిక మీ చేతుల్లో ఉండేది కాదు. దీని కీర్తి మొత్తం వారిదే. వారికి వినయపూర్వక ధన్యవాదాలతో...

**-ఆకురాతి మురళీకృష్ణ,**

*నటుడు, దర్శకుడు : కుప్పిలి కళాంజలి*

*063045 82159 & 093913 25046*

జీవిత
విశేషాలు

మహా నటుడు, నటరాజు, కళాతపస్వి

## కుప్పిలి వెంకటేశ్వరరావు

(1923-1973)



నటుడు, దర్శకుడు, అధ్యాపకుడు, గుణనిర్ణేత, సినీ నటుడు

---

**జయంతి**

20-11-1923

**వైజయంతి**

25-05-1973

**జన్మభూమి**

చాగల్లు గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా

**తల్లి**

శ్రీమతి సీతయ్యమ్మ (గృహిణి)

**తండ్రి**

శ్రీ కుప్పిలి ప్రకాశరావు (రైల్వేలో చిరు ఉద్యోగి)

**భార్య**

శ్రీమతి శారదమ్మ (వివాహం 1945)

**కూతురు**

శ్రీమతి లక్ష్మీకుమారి

**అల్లుడు**

శ్రీ గణేష్ పాత్రో

(ప్రముఖ నాటక రచయిత, సినీ రచయిత)

**కొడుకు**

శ్రీ కె.వి.యస్.డి.ప్రసాద్ (నాటక రచయిత, నటుడు)

**చదువు**

హైస్కూలు చదువు పూర్తి చేశారు.

రాజమండ్రిలో గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదివారు.

(కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల వలన పూర్తి చేయలేకపోయారు)

**ఆరోగ్యం**

చిన్నతనంలో "ఆస్మా" వల్ల సరిగ్గా మాటలు పలకలేక పోయేవారు. 8 ఏళ్ళకు బాగా పలికారు. "ఆస్మా" వ్యాధి వారిని ఆక్రమించుకొని, ఆశ్రయించి, జీవితాంతము బాధించింది.

## ఉద్యోగం

1945లో దక్షిణ మధ్య రైల్వేలో శ్రీకాళహస్తి స్టేషన్‌లో చిన్న ఉద్యోగం (గుమాస్తా)లో చేరారు. 1946 విజయవాడ రైల్వే డివిజన్ ఆఫీస్ లోకి బదిలీ అయి, 1960 వరకు అక్కడే ఉండిపోయారు. మద్రాసులో ఉన్నప్పుడు ప్రఖ్యాత దర్శక, నిర్మాతలు శ్రీ బి.యన్. రెడ్డి మరియు శ్రీ చక్రపాణిగార్ల అభిమానం పొందివున్నారు. శ్రీ బి.యన్ రెడ్డిగారే శ్రీ కూర్మా వేణు గోపాలస్వామి నాయుడుగారికి, యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌కు వీరిని స్టేజ్ డైరెక్టర్‌గా తీసుకోమని సూచించారు. 1961లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో రంగస్థల విభాగంలో దర్శకునిగా చేరారు.

## వ్యక్తిత్వం

సన్నగా పల్చగా ఉంటారు. మనసులో మాటను నిర్మొహమాటంగా మాట్లాడతారు. కాలేజీలో టెన్నిస్ ఆడేవారు.

## నాటక రంగం

అనేక నాటకాలలో నటించారు. అనేక నాటకాలను దర్శకత్వం చేశారు.

| | |
|---|---|
| విషపాత్ర 1945 - | ...సహదేవ సూర్యప్రకాశరావు |
| కరణీకం 1954 (పాపయ్య శాస్త్రి)- | ...పింగళి వెంకటరామయ్య |
| కన్యాశుల్కం (గిరీశం)- | ...గురజాడ వెంకట అప్పారావు |
| కీర్తిశేషులు (మురారి)- | ...భమిడిపాటి రాధాకృష్ణ |
| దొంగవీరడు (రామబ్రహ్మం)- | ...కొడాలి గోపాలరావు |
| మావూరు (బడిపంతులు)- | ...అనిశెట్టి సుబ్బారావు |
| గాలిమేడలు - | ...అనిశెట్టి సుబ్బారావు |
| కప్పలు (నౌకరు)- | ...ఆచార్య ఆత్రేయ |
| విశ్వశాంతి (సైనికుడు అమరయ్య)- | ...ఆచార్య ఆత్రేయ |
| విషాదం - | ...రాచకొండ విశ్వనాథ శాస్త్రి |
| నిజం - | ...రాచకొండ విశ్వనాథ శాస్త్రి |
| దెయ్యం (ప్రెస్ రిపోర్టర్)- | ...ప్రఖ్య శ్రీరామమూర్తి |
| ఫణి (రఘుపతి) - | ...ప్రఖ్య శ్రీరామమూర్తి |
| కాళరాత్రి - | ...ప్రఖ్య శ్రీరామమూర్తి |
| మాస్టర్జీ (మాస్టరీ)- | ...బెల్లంకొండ రామదాసు |
| ఆకాశరామన్న (జయశంకర్ గోపీనాథ్)- | ...బెల్లంకొండ రామదాసు |
| తుఫాను (రాఘవరెడ్డి)- | ...పులిగుండ్ల రామకృష్ణయ్య |
| రాగరాగిణి (రఘు)- | ...గొల్లపూడి మారుతీరావు |
| కళ్ళు - | ...గొల్లపూడి మారుతీరావు |
| ఎర్రగన్నేరు (రవీంద్ర నాటకం)- | ...అబ్బూరి రామకృష్ణారావు |

| | |
|---|---|
| నా బాబు (శ్రీనివాసరావు)- | ....కొర్లపాటి గంగాధరరావు |
| పెళ్ళి చూపులు- | ....కొర్లపాటి గంగాధరరావు |
| రాజీవం - | ... కె.వి.రమణారెడ్డి, వేణు |
| ఎంతెంత దూరం - | ...ఆదివిష్ణు |
| కనక పుష్యరాగం - | ...రాఘవ |
| కొడుకు పుట్టాల (శరభయ్య దద్ది) - | ....గణేష్ పాత్రో |
| పావలా - | ....గణేష్ పాత్రో |
| త్రివేణి- | ....గణేష్ పాత్రో |
| అసుర సంధ్య - | ...గణేష్ పాత్రో |
| బెత్తం మనిషి (మూకాభినయ నాటిక) - | ...గణేష్ పాత్రో |
| వాపస్ - | ...డి.వి.నరసరాజు |
| నాటకం - | ...డి.వి.నరసరాజు |
| మాట తప్పకు- | ...ఆర్.వి.చలం |
| కళోపాసన - | ...ముద్దుకృష్ణ |
| టీ కప్పులో తుఫాను 1948 - | ...ముద్దుకృష్ణ |
| మూడంతస్తుల మేడ - | ...పురాణం సుబ్రహ్మణ్య శర్మ |
| దైవశాసనం (భుజంగం) - | ...రావి కొండలరావు మొదలగునవి.. |

**తొలి నాటకం**

1945లో కాలేజీ వార్షికోత్సవాల్లో నటుడిగా గుర్తించి రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీ లో ఫిజిక్స్ లెక్చరర్ గా పని చేసిన శ్రీ పింగళి వెంకటరామయ్యగారు రచించిన -కరణీకం" నాటకంలో వీరికి "పాపయ్యశాస్త్రి" పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు. వేసిన మొట్టమొదటి నాటకంలోనే ఉత్తమ నటనకు ప్రథమ బహుమతి అందుకొన్నారు.

**విశేషాలు**

1945లో శ్రీ వి.కృష్ణార్జునరావుతో కలసి "ట్వంటీయెత్ సెంచరీ స్వాన్ క్లబ్" స్థాపించారు. శ్రీ సహదేవ సూర్యప్రకాశరావు రచించిన "విషపాత్ర" నాటకం ప్రదర్శించారు. ఇందులో వీరితో పాటు శ్రీ వై.వెంకటేశ్వరరావు, శ్రీ శ్రీపాద పట్టాభి.

శ్రీ యం.వి.యల్.యన్. ఆచారి, శ్రీ దేవర, శ్రీమతి కస్తూరి నటించారు.

1948లో విజయవాడలో రైల్వే ఉద్యోగంలో స్థిరపడ్డాక మనసా, వాచా, కర్మణా నాటకరంగానికి అంకితమై పోయారు. ఎన్నో నాటికలు, నాటకాలు, ప్రదర్శించారు. మరెన్నో బహుమతులు, బిరుదులను అందుకొన్నారు. వాటితో తృప్తిపడక దర్శకత్వం వహించి, నాటకాలను మథించి, నటనలో ప్రదర్శనలో అపూర్వమైన నూతన పోకడలు సృష్టించారు. నాటకాన్ని కట్టుదిట్టంగా రిహార్సల్సు చేయడం... ధరించే పాత్రను పూర్తిగా అర్థం చేసుకొని, ఆ పాత్రను ఆత్మ

విమర్శ దృష్టితో పరిశీలించడం. అనుకున్న సమయానికి నాటకం ప్రారంభం చేయటం. అన్నిటి కంటే ముందు క్రమశిక్షణకు మొదటి స్థానాన్ని కల్పించటం ఇవన్నీ వీరిని శిఖరాగ్ర స్థాయికి చేర్చాయి.

"రక్తకన్నీరు" శ్రీ సిహెచ్. నాగభూషణం వీరి సహోద్యోగి కావటం చేత కలసి నాటకాలు ఆడారు. 1948లో "నవ్య కళామండలి" నాటక సంస్థను స్థాపించి, శ్రీ ముద్దుకృష్ణ రచించిన "టీ కప్పులో తుఫాను". "కళోపాసన" నాటికలను చాలాసార్లు ప్రదర్శించారు.

23వ ఏట రాజమండ్రిలో రైల్వేలో పని చేసినప్పుడు "ఆంధ్ర ఆర్ట్స్ థియేటర్" నాటకాలు చూచి ప్రభావితులయ్యారు. శ్రీ కర్నాటి లక్ష్మీనరసయ్య నటశిక్షణలో 'తుఫాను' నాటకంలో 'రాఘవరెడ్డి' పాత్ర ధరించి, నటించి, మంచిపేరు తెచ్చుకున్నారు.

సుమారుగా మూడు దశాబ్దాలు విజయవాడ రైల్వే కళామండలి (విజయవాడ),
ఆంధ్ర ఆర్ట్స్ థియేటర్ (విజయవాడ),
ర. స. న. సమాఖ్య (విజయవాడ, కాకినాడ, మద్రాసు, విశాఖపట్టణం),
నవ్య కళామండలి (విజయవాడ),
ఢిల్లీ దక్షిణ భారత నటీ నట సమాఖ్య, విశాఖపట్టణం,
క. మ. ల. (కనక మహాలక్ష్మి) సమాఖ్య, బహురూప నట సమాఖ్య (విశాఖపట్టణం),
తెలుగు లిటిల్ థియేటర్ (విశాఖపట్టణం),
పురుహూతిక నాటక పరిషత్ (పిఠాపురం)
మొదలగు అనేక సంస్థలలో ప్రముఖ పాత్రలు ధరించారు.

1950-60 ప్రాంతంలో ఆంధ్రదేశంలో అనేక నాటక పోటీలలో పాల్గొని ప్రతిచోటా ఉత్తమ నటుడుగా బహుమతులు అందుకొన్నారు.

శ్రీ కొడాలి గంగాధరరావు "నా బాబు" (తండ్రి పాత్ర) నాటికను 1954లో ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీలలో ప్రదర్శించి, ఉత్తమ నటుడు బహుమతి అందుకున్నారు. "శ్రీనివాసం" పాత్రలో అద్వితీయంగా నటించి "తండ్రి- కొడుకుల అనుబంధానికి చక్కటి భాష్యం చెప్పారు. ఈ నాటికను చూసిన తరువాత శ్రీ డి.వి. సుబ్బారావుగారు ఇతనిని "నటరాజు" అని మెచ్చుకొన్నారు. ఆ బిరుదుతో ఇక "రాగరాగిణి' నాటకానికి వచ్చిన పేరు అంతా, ఇంతా కాదు. స్వయంగా డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఆ నాటకాన్ని తిలకించి అద్భుతమని కొనియాడారు.

సాధారణంగా అన్ని నాటకాలలో డైలాగ్‌ను ఆయుధంగా చేసుకొనే వీరు. శ్రీ గొల్లపూడి మారుతీరావుగారి చేత వ్రాయించుకొన్న "రాగరాగిణి" నాటకంలో 'రఘు' పాత్ర ద్వారా మౌనంతో, చూపులతో, భావవ్యక్తీకరణం ఎలా ఎన్నో డైలాగుల పెట్టుగా చేయవచ్చునో చేసి చూపించారు.

1959 ప్రాంతంలో గుడివాడ ఆంధ్ర నాటక కళాపరిషత్ ఉత్సవాల్లో "దొంగవీరడు" నాటకం ప్రదర్శించారు. "రామబ్రహ్మం" పాత్రలో అద్భుతంగా నటించారు. రాజమండ్రిలో లలిత కళానికేతన్ పరిషత్తులో శ్రీ ప్రఖ్య శ్రీరామమూర్తి అనువాదం "దెయ్యం" నాటకం ప్రదర్శించారు.

"ప్రెస్ రిపోర్టర్" పాత్ర వేశారు. శ్రీ చాట్ల శ్రీరాములు దర్శకత్వం చేశారు. "విశ్వకవి" రవీంద్రనాథ్ ఠాగూర్ రచనకు శ్రీ అబ్బూరి రామకృష్ణారావు అనుసరణ "ఎర్ర గన్నేరు" నాటకం 18 పాత్రలతో వీరి దర్శకత్వంలో ప్రదర్శించారు.

మద్రాసులో శ్రీ గొల్లపూడి మారుతీరావు రచన "కళ్ళు" నాటిక వీరి దర్శకత్వంలో శ్రీ బాల సుందరరావుగారి ఆధ్వర్యంలో మధుర కళానికేతన్ వారి కోసం ప్రదర్శించారు.

ఢిల్లీ నాట్య సంఘం అఖిల భారతీయ భాషల్లో నిర్వహించిన నాటక పోటీలలో పాల్గొని **యావత్ భారతదేశానికి ఉత్తమ నటనకు బహుమతి గెలుచుకొని,**

శ్రీ శంభుమిత్ర, శ్రీ సత్యజిత్ రాయ్ వంటి ప్రముఖుల ప్రశంసలందుకున్నారు.

ఢిల్లీలోని బహుభాషా నాటక పోటీలలో 'కప్పలు" నాటకం ప్రదర్శించి, ఓ విశ్వాసపాత్రమైన "నౌకరు" పాత్ర ధరించి, ఉత్తమ నటుడిగా నిలిచారు.

ఢిల్లీలో "ఆకాశరామన్న", "దొంగవీరడు" "కప్పలు", "పెళ్ళిచూపులు", "నాటకం" మొదలగు నాటకాలు ఆడారు.

ఢిల్లీలో ఆంధ్ర మహిళా మండలి వారిచే నాటిక వేయించవలసి వచ్చినప్పుడు, శ్రీ డి.వి.నరసరాజు రచన "వాపస్" లోని అన్ని మగ పాత్రలను ఆడపాత్రలుగా మార్చి ప్రదర్శింప జేశారు.

1958లో శ్రీ బందా కనకలింగేశ్వరరావుగారు ఒక బృందాన్ని థియేటర్ ఆర్ట్స్ గురించి శిక్షణ పొందడానికి ఢిల్లీలోని "ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్"కి వీరిని కూడా పంపించారు.

1958లో ఢిల్లీలో "దక్షిణ భారత నటీనట సమాఖ్య'ను స్థాపించారు. అప్పుడు బెల్లంకొండ రామదాసు "ఆకాశరామన్న", శ్రీ డి.వి.నరసరాజు "నాటకం" ప్రదర్శనలు జరిగాయి.

1959-60 లలో ఢిల్లీ నాటకోత్సవాలకు "రాగరాగిణి", "కప్పలు", "దొంగవీరడు". నాటకాలు ప్రదర్శించి బహుమతులు గెలుచుకొన్నారు. విశాఖపట్టణం, ఆంధ్రా విశ్వవిద్యాలయం, రంగస్థల కళల శాఖ, విద్యార్థులతో ఢిల్లీలో "కనక పుష్యరాగం", "త్రివేణి", "అసుర సంధ్య" నాటకాలు / నాటికలు ప్రదర్శించారు. 1962, డిసెంబర్ 15 న జాతీయ రక్షణ నిధికి గాను ఆంధ్ర విశ్వవిద్యాలయం, రంగస్థల కళల శాఖ, విద్యా ఎయిర్ థియేటర్ లో "ఆకాశరామన్న" నాటకం, 1963లో మద్రాసులో "రాజీవం".

1965లో హైదరాబాదు రవీంద్రభారతిలో "మహనటుడు" నాటక ప్రదర్శనలు వీరి దర్శకత్వంలో ప్రదర్శించారు.

1971లో సెప్టెంబర్ నెలలో ఢిల్లీలో జాతీయ సమైక్యత అంశం మీద నాటక ప్రదర్శనలు జరిగాయి. అవి బహుభాషా నాటక పోటీలు. ఆంధ్రా యూనివర్సిటీ నాటక విభాగం తరపున విద్యార్థులతో "త్రివేణి" నాటకం ప్రదర్శించడం జరిగింది. "త్రివేణి" నాటికను రైల్లోనే చదువుకోవడం, రిహార్సల్స్ చేయడం కూడా రైల్లోనే జరిగాయి. ఢిల్లీలో ప్రదర్శన దిగ్విజయం అయింది. ఉత్తమ రచన, ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు మిశ్రో. ఉత్తమ రంగాలంకరణలతో ఐదు బహుమతులు వచ్చాయి.

**ఆకాశవాణి**

కీర్తిశేషులు, కన్యాశుల్కం, రాగరాగిణి, నాబాబు, మూడంతస్తుల మేడ, ఆఖరు ప్రేమలేఖ. ఓ సీత కథ. తామరపూవు కానుక, మొదలగునవి.

**విషాదాలు**

నాటక రంగం పట్ల ఆయనకున్న అంకిత భావం అచంచలమైనది. అతని పది నెలల కొడుకు (ప్రథమ సంతానం) చనిపోతే ఇంటిల్లిపాదీ రోదిస్తున్న సమయంలో అరగంటలో వస్తానని ఆకాశవాణి (విజయవాడ) కేంద్రం చేరుకొని శ్రీ కొల్లపాటి గంగాధరరావు రచన "నా బాబు" నాటికి లైవ్ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆ నాటికలో ఆయన కొడుకు చనిపోతాడు.

ఇంకొకమారు శ్రీ రాఘవ రాసిన "కనక పుష్యరాగం" నాటక ప్రదర్శనకు న్యూఢిల్లీ బయలు దేరుతున్న సమయంలో, తాను ఎంతో అభిమానించే తన సోదరి మరణవార్త వస్తుంది. దుఃఖాన్ని కొన్ని క్షణాలు దిగమ్రింగుకొని ట్రెయిన్ ఎక్కి న్యూఢిల్లీ చేరి నాటకాన్ని అద్భుతమైన రీతిలో ప్రదర్శింపచేశారు.

1971లో అతన్ని పరీక్షించిన డాక్టర్లు, నాటకాలు మానేస్తే పదేళ్ళు, నాటకాలు వేస్తే రెండేళ్ళు బ్రతుకుతావని చెప్పారు. **"నాటకాలు వేయకపోతే నేను ఉండి ఏం ప్రయోజనం"** అంటూ నాటకాల్ని కొనసాగించారు.

**ముఖ్య సంఘటన**

ఒక పర్యాయం రాజమండ్రి ఓవర్ బ్రిడ్జ్ దాటుతున్న సమయంలో పట్టుతప్పి కింద పడిపోతున్న ఒక వృద్ధుణ్ణి రక్షించారు. ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు.

అందుకు కృతజ్ఞతగా శ్రీపాదవారు ర. స. న. సమాఖ్యకు,

***"మహదేవి సాయంతన సమయ సింహాసన గతా***
***తదాసన్నే బ్రహ్మాదిత్య పతయః వాక్యాది కలితా***
***సభాస్తారే దేవాస్సకల జగతాముత్సవకరం***
***నటంతం సర్వేశం ప్రతిభ నటరాజం హృదిభజే ॥"***

అనే ప్రార్థనా గీతాన్ని రచించి ఇచ్చారు.

**నట శిక్షకుడు**

శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి నాయుడు ఆంధ్రా విశ్వ విద్యాలయంలో రంగస్థల శాఖను స్థాపించి వీరిని ఆచార్య పీఠాన్ని అధిష్ఠించమని ఆహ్వానించారు. శ్రీ మంత్రి శ్రీనివాసరావు, డా॥కొర్లపాటి శ్రీరామమూర్తితో కలసి

అనేక మంది విద్యార్థులకు నటశిక్షణ ఇచ్చారు.

**వీరు నటశిక్షణ ఇచ్చిన ప్రముఖ నటీనటులు...**

శ్రీమతి జయశ్రీ (బేబీ), శ్రీమతి వాణిబాల, శ్రీమతి కె.విజయలక్ష్మి, శ్రీమతి 'పావలా' శ్యామల,

మద్దాలి విజయలక్ష్మి, శ్రీ పొట్టి ప్రసాద్, శ్రీ సి. హెచ్. కృష్ణమూర్తి, శ్రీ జి.వి.సుబ్బారావు. శ్రీ సాక్షి (రంగావజ్ఝల) రంగారావు, శ్రీ ధం, శ్రీ తంబు, శ్రీ కనకాల దేవదాసు, శ్రీ వంకాయల సత్యనారాయణ, శ్రీ మిశ్రో, శ్రీ కృష్ణచైతన్య, శ్రీ కొత్తూర్తి భాస్కరరావు... మొదలగువారు.

**గుణ నిర్ణేత**

అనేకసార్లు అనేక నాటక పోటీలకు గుణనిర్ణేతగా వ్యవహరించారు. నాటక పరిషత్తులలో **గుణనిర్ణేతగా అతని ఖ్యాతి ఎప్పటికీ చెక్కు చెదరనిది. నటీనటుల ప్రావీణ్యానికే మొదటి మార్కు యివ్వడంలో ఆయనెప్పుడూ రాజీ పడలేదు. ఆశ్రితజన పక్షపాతం అనేది అతనికి ఏ కోశానా లేదు.** అత్యుత్తమ గుణనిర్ణేతగా నాటకరంగ చరిత్రలో ఆ స్థానం ప్రత్యేకమైనది.

**సినిమారంగం**

చిత్రసీమ కూడా వీరిని సాదరంగా ఆహ్వానించింది.

వీరు నటించిన తొలిచిత్రం "ఇద్దరు మిత్రులు".

1960-61లో ఆత్రేయ దర్శక, నిర్మాతగా వ్యవహరించిన "వాగ్దానం" సినిమాలో హీరో తండ్రిగా నటించడమే కాక, వీరు చిత్రానికి సహాయ దర్శకులుగా కూడ పనిచేశారు. వీరు నటించిన చివరి చిత్రం "కన్నెవయసు".

**బిరుదులు**

నటరాజు, రంగస్థల నటసామ్రాట్, నటచతురానన, రంగభాస్కర.

**తుది సన్మానం**

1973, మార్చి 12న సికింద్రాబాదు లోని 'రైల్వే ఇన్స్టిట్యూట్' వారు హైదరాబాదులోని రవీంద్రభారతిలో

ఘనంగా సన్మానించారు.

**తుది మాటలు**

ఆనాటి సభలో వీరు. "ఇది నా 116వ సన్మానం. ఇక నేను సన్మానాలకు ఒప్పుకోవడం లేదు. నేను పుట్టి పెరిగిన రైల్వే శాఖలోని నా పూర్వ సహచరులు కోరినందువల్ల కాదనలేక ఒప్పుకున్నాను. ఇదే నా జీవితంలో చివరి సన్మానం" అన్నారు.

**కీర్తి శేషుడు**

ఆ మహానటుడి అంతర్వాణి ఎందుకు పలికించిందో కాని తర్వాత కొద్ది రోజులకు 1973, మే 25న కీర్తిశేషులయ్యారు.

భౌతికంగా లేకపోయినా తెలుగు నాటకరంగం జీవించినంత కాలం తెలుగు ప్రేక్షకుల గుండెల్లో "నటరాజు" శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు గారు బ్రతికే వుంటారు.



# K.VENKATESWARA RAO

*Founding Father of the Samakhya*

The following pen-picture of K. Venkateswara Rao appeared in the SUMMER NUMBER 1959 of NATYA, when he created a stir in the Capital's theatre circles by winning the Best Actor Award in the 1958-59 Drama Festival organisised by the Delhi Natya Sangh.

Venkateswara Rao is now stage Director in the Department of Theatre Arts at the Andhra University, Waltair

The shy, unassuming young man who stepped up to receive the Best Actor Award of Delhi's 1958-59 Festival is no stranger to such honours. K Venkateswara Rao has been collecting "Oscars" with such regularity as to make him almost a "Professional Winner". The award he got in Delhi was for his leading role in **Akasa Ramanna** a play in Telugu. Since it was in a language with which few are familiar in the North not many had a chance to see his acting. But the Judges were agreed that despite the language difficulty they could not but remark on the sterling performance they were witnessing.

In the past six years Venkateswara Rao has won 12 prizes in all for his acting in various State and provincial competitions. However, he does not act with an eye on a prize. "They have just been coming without my asking" he says modestly.

One secret of this may lie, apart from his natural talents, is his fierce dedication to drama. Venkateswara Rao is one of those frail people who alone seem to possess strength belying appearance.

Eight long years of asthama from almost the time he was born in 1924 handicapped Venkateswara Rao's speech and it was only in his eighth year that he could articulate words. But his voice was clear, even mellow. Today it has a rich Timbre and throws clear even in the open.

Venkateswara Rao began taking interest in drama when he was eighteen. The early years were spent as a hanger-on to the play-producer in his college in Andhra

where he learnt much by watching and absorbing all the tricks of the trade.

He began acting only in 1949 when he had, by then, joined Railway service. Hebecame founder-member of the "Navya Kala Mandali" which he acquired great renown in Andhra. Later he started his own theatre group and is a committee member of various theatrical organisations. In all these he has taken an active part in furthering the movement. He has directed and produced several full length and one act plays and acted in nearly all of them.

When he came to Delhi last year to study at the Asian Theatre Institute he found no Telugu stage in the Capital. Despite the incredulous dissuasion of various friends and well-wishers he set about organising a group for Telugu drama. Rehearsals were conducted amid ruins, in open parks, anywhere. Within the year, six plays had been produced. Limited in appeal to the small Andhra community in the Capital, they nevertheless opened many people's eyes to the possibilities of regional language dramas in Delhi. "Akasa Ramanna" was one of the plays staged by this group - the "Dakshina Bharata Natee-Nata Samakhya". Venkateswara Rao usulally resides in Vijayawada where he works in the Railways.



చలంగారి 'చలనసమితి' 'మాట తప్పకు'లో
కామరాజు పాత్ర ధరించి సన్మానితులైన కె.వెంకటేశ్వరరావు



## నేనూ-నా సమాఖ్య

-కుప్పిలి వెంకటేశ్వరరావు

గురుతుల్యులు కీ॥ శే॥ బందా కనకలింగేశ్వరరావు గారు మాకు (అంటే నేను, సినిమా పొట్టి ప్రసాద్, రేడియో సి.రామమోహనరావు) ఇక్కడ Asian Theatre Instituteలో (ఇప్పుడు National School Of Drama) నాటక శిక్షణ పొందే అవకాశం కల్పించారు. ఇక్కడా, అక్కడా అప్పులు చేసుకొని విజయవాడ నుంచి ఢిల్లీ చేరుకున్నాం. South India Restaurant లో మకాం వేశాం. ఇది 1958 నాటి మాట. వచ్చిన వారం రోజుల్లో Constantia హాలులో "Waiting For Godot" నాటకం AIFACS లో పద్మశ్రీ శంభుమిత్ర ప్రదర్శించిన ఒక బెంగాలీ నాటకం చూశాము.

AIFACS లో నాటకానంతరం Back Stage కి వెళ్ళి ఖర్చు వివరాలు వాకబు చేశాను. హాలు అద్దె రు॥ 380 ల చిల్లర అని తెలుసుకుని అంత చలికాలంలోనూ నాలిక తడి ఆర్చుకుపోయి ఇవతలికి వచ్చాను. రా. స. న. సమాఖ్య లో నేను నేను నిర్వహించిన ఏ నాటకానికి మొత్తం ఖర్చు 150 కి మించలేదు. Taxis, Cocacolas, భోజనాలు, నటులకు సదుపాయం చెయ్యడం అప్పుడూ లేదు. ఇప్పుడూ లేదు, మన తెలుగు ప్రాంతంలో.

తెలుగు నాటకం వెయ్యాలంటే వెయ్యాలని మా 'త్రయం' అనుకుని వేదకుమారికి చెప్పుకున్నాం. ఆవిడ ఖమతి వరలక్ష్మీరావు (డా॥ కె. యల్. రావుగారి సతీమణి) గారి చెవిన వేసింది. ఖర్చులు రు. 250 దాటకుండా వుంటే నాటకం వేయుంచుకోడానికి అభ్యంతరం లేదన్నారావిడ. ఇంకా చలి వణికించే రోజులవి. మేం చలినించి కాపాడుకునే బట్టలు కొనుక్కునే శక్తి లేనివాళ్ళం. మహా అయితే రెండేసి పైజమాలు, రెండేసి లాల్చీలు, చేతులను Gloves క్రింద దాచేసుకుని రోజులు జరుపుకునే వాళ్ళం.

వాణీబాలను హైదరాబాదు నుండి శ్రీ సూర్యనారాయణ అనే ఒకరి రైల్వే పాస్ మీద ఇక్కడికి రప్పించుకుని Casting వేసుకున్నాం. మన మొదటి నాటకం నరసరాజు గారి "నాటకం" అనే నాటకం. మరో ఇద్దరు దక్షిణాది వాళ్ళను చేర్చుకున్నాం. బక్షి శ్రీరాం (హైదరాబాదు నివాసి) కూడా ఒక పాత్ర వేశాడు. అందుకని -దక్షిణ భారత నటీనట సమాఖ్య" అని నామకరణం చేసుకున్నాం.

సరే ఏమయితేనేం, ఈవూరి వనితా మండలి సౌజన్యాన "దక్షిణ భారత నటీనట సమాఖ్య" వెలిసింది. ఆ నాటకానికి శ్రీమతి అనసూయశర్మ, శ్రీ రామచంద్రరావు రావటం తటస్థించింది.

నాటకాలు వెయ్యాలనే తపనగల శ్రీమతి శర్మ, స్థిరసంకల్పుడు రామచంద్రరావు, ముఖ్యంగా మమ్మల్ని సర్వవిధాలా ఆదరించిన వేద పీఠ్ళు మాకు అండదండలయ్యారు. తరువాత తరువాత చుట్టల రామారావు, శ్రీనివాసరావు, రామ్మూర్తి, అర్జునరావు, భాస్కరరావు, ఎన్.ఆర్.రావు, పురాణం, జైన్, మా ఆవిడ, శ్రీమతి కె.ఎల్.రావు, వారి పిల్లలు బ్రిగేడియర్ ఎం.కె.రావు, వారి సతీమణి, వారి పిల్లలు సమాఖ్య రూపానికి, జీవానికి, మనుగడకు కారణం అయినారు.

మనుగడ అంటే కష్టాలతో కూడుకున్న మనుగడ. ఉదాహరణకు :

ఓసారి 'ఖానీ ఖనాన్' tomb లో రిహార్సల్సు జరుపుకుంటున్నాం. సినిమా ప్రసాద్ తన సైకిలు (కొత్తది) పైకి తీసుకువెళ్ళి సకువెళ్ళీ శీఎఐ కి పెడల్‌ని ఆనించి పెట్టిన కారణంగా అక్కడి చౌకీదార్ ఆ సైకిల్ ని పైనించి క్రిందకు విసిరి మిమ్మల్ని, మాకు తెలీని భాషలో తిడూ కిందవర్కు తరిమాడు. మేం పరుగులాంటి నడకతో బయటపడ్డాం. ఆ మర్నాడు ప్రసాద్ ని సజీవంగా చూసి కుదుటపడ్డాం.

మరోసారి ఇంజినీరు భాస్కరరావు తాను Sub- tenent గా ఉంటున్న ఇంట్లో రిహార్సల్సు పెట్టుకున్నాం. మేం అందరం అక్కడకు చేరుకున్నాం. అసలు tenent ఉగ్రుడై "వ్యభిచారం లాంటి నాటకాలు ఇక్కడ వేస్తావురా సువర్" అంటూ భాస్కరరావు గారి కాలర్ పుచ్చుకున్నాడు.

ఆ సంవత్సరంలో మన సమాఖ్య... నాటకం వాపస్- ఆకాశరామన్న - నాబాబు - వెంకన్న కాపురం - గుడ్డిలోకం- కప్పలు - Michael (ఇంగ్లీష్‌లో) వేయగలిగాం అంటే ఇక్కడి వాళ్ళ సౌహార్ద్రత, సౌజన్యం కారణం.

తెలుగు వారి సాంప్రదాయానికి విరుద్ధంగా ఒక తెలుగు సంస్థని ఒకటిన్నర దశాబ్దంగా అవిఘ్నంగా సాగిస్తున్నారంటే ఇక్కడి ప్రవాసాంధ్రులు అభినందనీయులు.

ర. స. న. సమాఖ్య దర్శకుడుగా ఒక ప్రత్యేకమైన పరిస్థితిలో కీ॥ శే॥ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారిని దర్శించగా వారు నన్ను ఆశీర్వదించి నటరాజ స్తుతిని ప్రార్థన శ్లోకంగా ప్రసాదించారు. ఆ శ్లోకం నా నిర్వహణలో వ్యవస్థీకరింపబడిన ప్రతి సమాజానికి ప్రార్థన శ్లోకం అయింది. ఆ శ్లోకమే 'దక్షిణ భారత నటీ నట సమాఖ్య యొక్క ఈ దశాబ్దంన్నర మనుగడకు భగవదాశీర్వచనంగా నిలిచింది. ఈ సందర్భంలో కవితా మహర్షి అప్పటి ఆస్థాన కవులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారికి నా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

ఇకపోతే నా మాటగా, సంస్థ ఊరికే సంవత్సరాలకొద్దీ బ్రతకటం మాత్రమే కాదు. కావలసింది. సర్వతోముఖంగా పెరుగుతూ బ్రతకాలి. తెలుగు ప్రాంతానికి asset గా బ్రతకాలి. ఇతర ప్రాంతాలకి పోటీగా బ్రతకాలి. ఇందుకు తగినంతగా మరింతగా కృషి పెరగాలేమో!

ఏమైనా నేను ఈ మన సంస్థకు వ్యవస్థాపకుడిగా గర్వంగా బ్రతుకుతున్నాను. కృతజ్ఞుణ్ణి.

మకాం<br>
న్యూఢిల్లీ<br>
2-7-1972

భవదీయుడు<br>
కుప్పిలి వెంకటేశ్వరరావు



## శ్రీవారికి ప్రేమలేఖ

-కుప్పిలి శారద

ప్రియమైన శ్రీవారికి...

మీ శారద నమస్కరిస్తూ వ్రాయు లేఖ...

కొన్ని సంవత్సరాల తర్వాత మీకు ఉత్తరం వ్రాయడం వల్ల యేమో, చేతులు వణుకుతున్నాయి. దుఃఖం వస్తుందేగాని వ్రాయలేకపోతున్నాను.

బావున్నారా! మా అందర్నీ వదిలి హాయిగా వెళ్ళిపోయారు. మీరు లేకుండా నేను ఎలా బ్రతకగలనను కున్నారు? ఇద్దరం ఒక్కసారే కన్నుమూయాలని ఎన్నోసార్లు అనుకున్నామా, లేదా? మాట తప్పిన వారయారు.

నేను అత్తవారింట్లో అడుగు పెట్టిననాడే సహదేవ సూర్య ప్రకాశరావుగారు వ్రాసిన 'నర్తకి' 'పూజామాల' 'తిష్యరక్షిత' అనే మూడు నాటకాలు వారం రోజుల్లో ఫెయిర్ చేసి యివ్వగలవా అని అడిగారు. మీరు అన్న ప్రకారం నేను వ్రాసి యిస్తే యెంతో పొగిడారు. బెజవాడలో నేను కొత్తగా కాపురానికొచ్చిన రోజుల్లో అందరి పోర్షన్స్ విడివిడిగా వ్రాసి నేను మీ మాట ప్రకారం యిచ్చేదాన్ని మీ బృందం అందరికీ కాఫీ, టిఫిన్లు చేసి పంపేదాన్ని. పరిషత్తులో బస్తాలకొద్దీ బహుమతులు గెల్చుకొని మీరు యింటికి వస్తుంటే చూసి పొంగిపోయేదాన్ని. ఒకసారి విజయనగరం పరిషత్తులో ఉడుకుమోత్తనంతో మీమీద యేం వ్రాసారో గుర్తుందా మీకు? ప్రతిసారి మీరే షీల్డు పట్టుకుపోతే మిగిలిన వారికి ఏం ఉత్సాహ ముంటుంది. ఈసారి మీరు పరిషత్తునకు వస్తే మర్యాదగా వుండదని" హెచ్చరించారు. మీరు ఉత్తరం చూసి నిర్లక్ష్యంగా నవ్వేశారు. నేను భయపడి మిమ్మల్ని ఆ పరిషత్తుకి వెళ్ళొద్దన్నాను. మేం వెళ్ళి తీరుతామని సవాల్ చేసి బహుమతులన్నీ గెల్చుకొని వాటిని తిరిగి పరిషత్తు వాళ్ళకే యిచ్చేశారు. అప్పుడు వాళ్ళంతా మిమ్మల్ని క్షమాపణ కోరారు.

ఆ తక్కువ జీతంలోనే ఆ చిన్నయింట్లోనే డ్రస్ రిహార్సల్సు చేసేవారు. నేనున్నట్టు కూడా గమనించకుండా వారందరితో కలసి బైటికి వెళ్ళిపోయేవారు. ఆదివారమైనా ఇద్దరం కలసి సినిమాకి

వెళ్దామని నేనంటే మీరు 'ఏం శారదా! నాటకాలవాణ్ణి కట్టుకొని నీ సరదాలు తీరడం లేదని విచారిస్తున్నావా?" అని అడిగారు. ఆ మాటకి దుఃఖమొచ్చింది. మీరే తిరిగి నన్ను ఓదార్చారు.

బెజవాడలో 16 సంవత్సరాలు ఉద్యోగం చేసేక మద్రాసులో సినిమాల నిమిత్తం ఒక సంవత్సరమున్నాం. కొన్ని సినిమాలలో మీరు నటించి మంచి పేరు తెచ్చుకుంటూ వుండగా అంతలో అంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రారు కె.వి.గోపాల స్వామిగారు స్టేజి డైరెక్టర్ పోస్టు మీ కోసమే క్రియేట్ చేస్తున్నామనీ, వెంటనే రమ్మనీ, టెలిగ్రాం యిచ్చారు.

సినిమాలు వదిలి విశాఖపట్నం చేరేం. యూనివర్సిటీలో జాయిన్ అయాక ఏషియన్ థియేటర్ ట్రైనింగు కోసం ఓ సంవత్సరం ఢిల్లీలో వున్నాము. ఆ సంవత్సరములో ఒక ప్రక్క ట్రైనింగు అవుతూనే మరో ప్రక్క -దక్షిణ భారత నటీనట సమాఖ్య స్థాపించి నాటకాలు వేయిస్తుండేవారు. అప్పటి M.P. మోతె వేదకుమారి మనకు తన యింట్లో చోటిచ్చి అన్నివిధాల సహాయం చేస్తూ నాకు ఒక ఆడపడుచులా ఆదరించేది.

ఢిల్లీలో గవర్నరుగారు మిమ్మల్ని అభినందించి గోల్డ్ మెడల్ తొడిగిస్తుంటే యింత మహానటుడ్ని, నటరాజుని భర్తగా పొందగలిగేనని మురిసిపోయేను. మీరు Stage మీద యెప్పుడు స్పీచ్ ఇచ్చినా పిన్‌డ్రాప్ సైలెంటుగా అందరూ అమితానందముతో వినేవారు. అంతా అయ్యాక చిన్నపిల్లాడిలా నా దగ్గరకు వచ్చి "శారదా స్పీచ్ బాగా చెప్పానా?" అని అడుగుతూంటే నాకెంత విలువిచ్చి అభిమానంగా ప్రేమగా చూస్తున్నారో అర్థమై ఆనందంతో పొంగిపోయేదాన్ని.

మీరు ఢిల్లీలో తెలుగు నాటకాలు వేసిన సందర్భంలో 'ఆకాశరామన్న' అనే నాటకంలో అక్కడ ఓ హిందీ అమ్మాయి చేతే రిహార్సల్సు చేయిస్తుంటే, తీరా రెండు రోజులుండగా నేనా పాత్ర వేయలేను. నాకా తెలుగు రాదని హిందీ అమ్మాయి తప్పుకుంది. అప్పటి కప్పుడెవరొస్తారు తెలుగువారని తల పట్టుకొని కూర్చొని, రాష్ట్రపతి సమక్షంలో కొన్ని వందల ప్రేక్షకుల ముందు వేయాల్సిన నాటకం ఆగిపోతే యెలా యిపుడేం చేయడమని సడనుగా లేచి మీరందరు యేదో ఆలోచించుకొని నా దగ్గరకు వచ్చి "శారదా! జీవితంలో నేనెవర్నీ కోరని కోరిక కోరుతున్నాను. అందరు నన్నడగడమేగాని నేను నిన్నడుగుతున్నాను. నువ్వంగీకరించవని నాకు తెలుసు. కాని నా అవసరము కొద్దీ అర్థిస్తున్నాను. కాదనకు. ఇదే మొదలు, ఆఖరు కూడా. ఈ ఒక్క నాటకంలో పుష్పపాత్ర నాతోనే గనుక నీకంత కొత్తగా వుండదు. నీవు ఆ పాత్ర వేయాలి శారదా" అన్నారు. నేను షాక్ అయిపోయాను. నోట మాట రాలేదు. ముఖ్యంగా నా కిష్టం లేదు. "అసలు మా మామగారు మీరు వేస్తేనే కేకలు వేస్తారే, నేనెలా వేస్తాననుకున్నారండి. కాని కోరిక కోరి కాదనిపించుకొని నాకు నిందవేయడానికా? ససేమిరా వేయనని ఖచ్చితంగా చెప్పేశాను.

మీరు నిద్రాహారాలు మాని పిచ్చివాడిలా అయి పోతున్నట్లు వేదతో కలిసి ఇంట్లో నాటకమాడారు. మొత్తానికి నా మనస్సు కరిగించి నాచేత ఢిల్లీలో నాటకం వేయించేరు. రంగం పట్ల మీ తపన

అలాంటిది.

యేమాత్రం టైమున్నా రిహార్సల్సు నాటకాలు, శిష్యులను తయారు చేయడములో మునిగిపోయేవారు. విశాఖలో కలెక్టరాఫీసులో, పూర్ణా హాలులో, అప్సరా హోటల్ లోపల, భీమునిపట్నంలో, అనకాపల్లిలో, యలమంచిలిలో, థియేటర్సు దగ్గరుండి కట్టించడంలో మీరు పడ్డ శ్రమ ఇల్లు, ఇల్లాలు, పిల్లలు అనకుండా మీ ఆరోగ్యమైనా చూసుకోకుండా రోజుకి ఇరవై గంటలు నాటక రంగానికి అంకితమయ్యే మీ తపన ఎలా ప్రశంసించాలో మాటలురాక ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నానండి! మీరు మీకే సాటి.

అమ్మాయి లక్ష్మి చేత యూనివర్సిటీలో నాటకంలో వేయించారు....మీకు గుర్తుందీ! అబ్బాయి ప్రసాద్‌బాబుతో నాటకాలు వేయించేరు. అల్లుడు నటుడూ, రైటర్. తనతో నాటకాలు వేయించేరు. మనవడితో రాజాతో చిన్న బాబప్పుడు 'ఈనాడు' నాటకంలో వేయించారు. ఒకసారి ఏవేవో ముచ్చట్లు చెప్తూ ఇలా మా అందరిచేత నాటకాలు వేయించడం నాకెంతో తృప్తిగా వుంది. ఒకసారి 'ఆకాశరామన్న'లో వేసిన మన ఇద్దరి ఫోటోలు ఎవరు చూడకుండా దాచేశావు. చూపించవా? అంటే కనిపించలేదని మీతో అబద్ధమాడేనండి. మొన్న బీరువాలో మీరు వ్రాసిన వుత్తరాలు తీసి చదువుతుండగా అందులో నుండి మన ఫోటోలు జారి క్రిందపడగానే మీరే జ్ఞాపకమొస్తే యెంత ఏడుపొచ్చిందో.

ఎన్ని వేషాలు వేసినా ఎంత కోపమున్నా మీరు నా కిచ్చిన విలువ మాత్రం మర్చిపోలేనండి. ఒకసారి మన బాబు నామీద ఏదో చిన్నతనాన కేకలు వేస్తుంటే, "ఆమెను యెవ్వరూ ఏమీ అనే అధికారం లేదురా! నేనేదో అనేక చికాకులలో కేకలు వేస్తే వేస్తాను గాని ఆమెను తల్లిగా పొందిన, లక్ష్మీ నీవు భార్యగా పొందిన నేను అదృష్టవంతులంగా" అని నన్ను వెనకేసుకు వస్తుంటే వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లుండేది. ఇప్పుడు ఎవరే చిన్న మాటన్నా 'అయ్యో మీరు లేరే అని బాధపడ్తుంటాను. ఎప్పుడూ మిమ్మల్ని తల్చుకుంటూ మీరు వేసిన సినిమాలు చూస్తూ, మీ నాటకాలు రికార్డు చేసిన కేసెట్లు ద్వారా మీ కంఠస్వరం వింటూ మీరు చేసిన గొప్ప గొప్ప విషయాలు పిల్లలతో ముచ్చటిస్తూ మీ ధ్యాసలోనే వుంటానండి.

బెల్లంకొండ రామదాసుగారితో, పాత్రోతో, గొల్లపూడితో ఇంకా రచయితలను దగ్గర పెట్టుకొని నాటకాలు వ్రాయించిన మీరు సడన్‌గా వెళ్ళిపోతే వీరంతా యేమవాలండీ, మీ శిష్యులంతా కనిపిస్తుంటే మీ మధ్య వున్నట్లుందండీ.

మీ కొడుకు ప్రసాదుకి మీ గుణాలే వచ్చాయండి. ఆ పట్టుదల కార్యదీక్ష. మీ Post చేయాలి. మీ సీట్లో కూర్చోవాలి. అన్న కోరిక ! కాని పది సంవత్సరాల నుండి యెంతో ఓపికతో నిరీక్షిస్తున్నా స్టేజ్ డైరెక్టరు పోస్టు యెవ్వరికీ ఇవ్వకుండా అలా వుంచారండి. "అంతమంది శిష్యులను తయారుచేసిన నాన్నగారు నేను నాటకాలు వేస్తూ, వేయిస్తూ, నాటకాలు వ్రాస్తూ అవి డైరెక్ట్ చేస్తుంటే అవన్నీ చూసి సరిదిద్దే అవకాశం లేని దురదృష్టవంతుడ్ని అమ్మా !" అని బాబు ఎన్నోసార్లు దుఃఖపడుతుంటాడు. వాడ్ని మీరే దీవించాలి.

మీరున్నంతవరకూ సన్మానాలు, సభలు, మీటింగులు, జడ్జిమెంట్లు అని పూలమాలలతో అలంకరింప జేసుకుంటూనే వుండేవారు. ఇప్పుడు వర్ధంతులు, జయంతులు అని పూలమాలలతో పూజిస్తూనే వున్నారు. మీ సన్మానాలన్నిటికీ నన్ను తీసుకెళ్ళేవారు గాని, ఇప్పుడు మాత్రం నన్నొంటరిని చేసి నీ పాట్లు నువ్వు పడు అని వెళ్ళడమేమైనా న్యాయంగా వుందాండి ? నాతో చదువుకున్న స్నేహితురాళ్ళంతా వుద్యోగాలు చేస్తూ "శారదా! నీవు వుద్యోగము చేయకపోయినా అంత మహానటుడ్ని నటరాజుని భర్తగా పొందగలిగేవే" అని ఈర్ష్య పడేవారు. నేనంత ఆనందంగా వుండడం ఆ దేవుడు కూడా చూడలేక మనల్ని వేరు చేశాడండి. యెన్ని జన్మలకేనా మీరే నాకు భర్తగా కావాలని కోరుకుంటున్నాను. మీ దగ్గరకు నేను త్వరలో రావడం దగ్గరౌతోంది కదా. అందుకే ఆలశ్యంగా రాస్తున్నాను. తప్పులుంటే క్షమించండి.

ప్రేమతో మీ

**శారద**

---

బహురూప నట సమాఖ్య సౌజన్యంతో







## ప్రియమైన నాన్నగారు

-బి.లక్ష్మీకుమారి

నాన్నగారు...ఆయన పేరు గుర్తుకొస్తే చాలు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. నాన్నగారికి కోపం ఎక్కువని చాలా మంది అనడం నాకు తెలుసు. కానీ నా మొత్తం జీవితంలో నాన్నగారికి నాపై ఎప్పుడూ రాలేదు. ఆయన మనసు నిండా ప్రేమే అదే ప్రేమ ఆయనకి నాటకం పైన కూడా. ఎప్పుడూ అదే ధ్యాస.

నా చిన్నతనంలో నాన్న ఓ నాటికలో నటించమంటే నటించాను. మా అమ్మగారు కూడా ఢిల్లీ లో 'ఆకాశరామన్న' నాటకంలో నటించారు. నా తమ్ముడు కె.వి.ఎన్.డి.ప్రసాద్ నాన్నగారితో అనేక నాటకాల్లో నటించాడు. తర్వాత తర్వాత చాలా నాటికలు రాశాడు. అనేక బహుమతులు పొందాడు. ఆలిండియా జాతీయ నాటక రచనల పోటీల్లో రెండుసార్లు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతులు అందుకున్నాడు.

ఇహ మా వారు శ్రీ గణేష్ పాత్రో గారు రచనలో మొదట మెళుకువలు నేర్చుకున్నది నాన్నగారి దగ్గరే. తర్వాత మావారు ఎన్నో మంచి నాటికలు, నాటకాలు రాశారు. వాటిల్లో చాలా వాటిల్లో నాన్నగారు నటించి, దర్శకత్వం చేశారు. నాన్నగారు. మావారు నాటకరంగంలో చాలా మంచి నాటకాలు, నాటికలు తయారు చేశారని నేను గర్వంగా చెప్పుకోగలను. నాన్నగారు చనిపోయిన తర్వాత మావారు మద్రాసు వచ్చి మంచి సినీ రచయితగా స్థిరపడ్డారు. చాలాసార్లు మేం నాన్నగారిని తలచుకునేవాళ్ళం. మావారు గణేష్ పాత్రోగారు నూటయాభై కి పైనే సినిమాలకి మాటలు రాశారు. ఎన్నో నంది పురస్కారాలను/ అవార్డులను అందుకున్నారు. దీనంతటికీ మా నాన్నగారి ఆశీస్సులు వున్నాయని నమ్ముతాను. మేమెంతగా సినిమా రంగంలో స్థిరపడినా, నాటకం మా మనసుల్లోంచి సుల్లోంచి పోలేదు. పోదు కూడా. నేను నా పిల్లలు... కనకమహాలక్ష్మి (చెన్నై) సీతారాం పాత్రో (కెనడా)/ సంయుక్త (చెన్నై) ఇప్పటికీ నాటికలు చూస్తుంటాం. రేడియోలో వింటుంటాం. మా నాన్నగారి ప్రాణప్రదమైన 30 'నాటకాన్ని' ఆదరించే వారందరికీ నా వందనాలు.

నమస్సృతులతో...

**బి.లక్ష్మీకుమారి**



## మరణం లేని మా మాస్టారు

-బి.ఎస్.గణేష్ పాత్రో

కీ॥ శే॥ కె.వెంకటేశ్వరరావుగారు కారణజన్ములు. తెలుగు నాటకరంగంలో ఒక కొత్త వెలుగు నింపడానికి కోటి సూర్యప్రభా భాసమైన ప్రతిభతో అవతరించి ఒక దివ్వెనుండి కోటిదివ్వెలు ప్రజ్వలించినట్టు ఆ ఒక మహానటుడు ఎందరెందరో నటీనటులను, రచయితలను, దర్శకులను ప్రభావితం చేశారు. ఆ ప్రభావం నిరంతరంగా నాటకరంగం బ్రతికినంతకాలం బ్రతికే ఉంటుంది. అంతకాలం వెంకటేశ్వరరావుగారికి స్మరణమేగానీ మరణం లేదు.

విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తుండగా శ్రీ ఓలేటి బుచ్చిబాబు నాకు మాష్టారితో పరిచయం కలిగించారు. ఆ పరిచయం చనువై అనుబంధంగా మారే లోపల నా మిడిమిడి జ్ఞానంతో ఏవో సందేహాలు, సమాలోచనలు వస్తే వారి అనంతమైన అనుభవంతో నన్ను మన్నించేవారు, మాటాడేవారు. అప్పటికి నాకు తెలిసిపోయింది. ఆయన ఒక మేరుపర్వతమని, ఆయనకి కూడా తెలిసిపోయింది నేనొక జిజ్ఞాసినైన అజ్ఞానినని.

చివరికి నటుడికన్నా రచయితగా రాణిస్తానని వెంకటేశ్వరరావుగారు పత్రికల్లో అడపా దడపా పడే నా కథలు చదివి అభిప్రాయపడ్డారు. రిహార్సల్సులో కూడా ఎవరో రాసిన నాటకాలు, నాటికలు సంభాషణల్లో నేను అవసరానికి చేసే చిన్నచిన్న మార్పులు చూసి మెచ్చుకునేవారు. అలాగే ఒక అవసరం వచ్చి ఆయన వ్రాయించిన ఒక స్థూల నాటకాన్ని నా చేత తిరిగి రాయించారు. నేను చేసిన మార్పులు, చేర్పులతో నాటకానికి చాలా మంచి స్వరూపం వచ్చింది. వెంటనే ఆయన కూతుర్ని నాకిచ్చి పెళ్ళి చేశారు వెంకటేశ్వరరావుగారు. గానీ పెళ్ళి ప్రస్తావనకి ముందు కచ్చితంగా చెప్పారు... "నాటకాలు నాటకాలే, అల్లుడు అల్లుడే ! అలా అయితేనే మా అమ్మాయిని చేసుకో. చేసుకుని నాకు మొగుడి నౌదామనుకుంటే కుదరదు అబ్బాయ్ !" అని ముందే హెచ్చరించారు. పెళ్ళయాకా, మా ఆవిడతో నేను ఖర్గపూర్ వెళ్ళి కొత్త మోజులో నాలుగు రోజులు ఎక్కువగా ఉండిపోయాను. 'కీర్తిశేషులు' నాటకం రిహార్సల్సుకి రెండ్రోజులు ఎగ్గొట్టక తప్పలేదు. అల్లుడనే కనికరం కూడా లేకుండా, బండి దిగ్గానే, నా భార్య ఎదురుగానే చెడామడా వాయించేశారు. ఆబ్సెంట్ అయినందుకు మా ఆఫీసులో బాస్ కూడా నన్నేమీ అనలేదు. మాష్టారు మాత్రం తిట్టినతిట్టు తిట్టకుండా ఏకధాటిగా వడ్డించారు. ఆ నాటకం 'కీర్తిశేషులు'లో నేను వేసిన 'వాణీనాథం' పాత్రకి చాలా మంచి పేరు వచ్చింది.

ఆయనకి విశాఖపట్నంలో కనకమహాలక్ష్మి మీద చాలా గురి. నా పెద్ద కూతురికి ఆ పేరే పెట్టారు. నా మొదటి సంతానం ఆరువారాలకే కన్ను మూసింది. ఆ దిగులుతో ఉన్నాను, నా భార్యని ఊరడిస్తున్నాను. ఆయనకి పిల్లలంటేనే ప్రాణం. గారాల కూతురి కూతురు పోవడం ఎంత కష్టం కలిగిస్తుందో చెప్పవలసిన పనిలేదు. అలాంటి ఆయన సాయంత్రం ఆరు కాగానే Dress చేసుకుని విక్కీ స్టార్ట్ చేసి, నన్ను రిహార్సల్స్‌కి బయలుదేరమన్నారు. నేను ఏటూ తేల్చుకోలేక దిక్కులు చూస్తుంటే ఎవరో అన్నారు. పాపం కూతురు పోయిన బాధలో ఉన్నాడు. ఈ రోజుకి వదిలేయండని కూతురెక్కడుంది? ఏ బాధాలేదు, బయలుదేర మన్నారు. నేను వెళ్ళాను. తరువాత 'కూతురా ! వాణీనాథానికి చెప్పారు. పరకాయ ప్రవేశం చేసి బాధలు మరచిపోవడానికి వరంలాంటిది నాటకం, అందుకే బలవంతంగా రిహార్సల్స్‌కి తీసుకెళ్ళారు. అది నిజమని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

రావిశాస్త్రిగారు విశాఖపట్నం మాండలీకంలో కథలు రాసేవారు. నేను కూడా ఆ భాషని కథలకి వాడితే కొత్తదనం ఉండదు. కవిత్వం రాయబోతే, విశృంఖలమైన ఆ బాధ చందస్సుకి తలొగ్గలేదు. అప్పుడికి నాటిక రాయాలనుకొని మాష్టారితో చెప్తే 'పావలా' కథాంశాన్ని నాకు చెప్పి ప్రయత్నించ మన్నారు. రాశాను. ఎంతో మెచ్చుకున్నారు. వెనువెంటనే ప్రదర్శనకి సన్నాహాలు చేశారు - సరిగ్గా అప్పుడే మాస్టారికి Train లో దొరికింది 'పావలా శ్యామల'. ఆవిడ చేత ఆ నాటకంలో శ్యామలగా, నేను పావలా పాత్రోగా స్థిర పడిపోయినట్టు చేసి, ఆ విధంగా నా రచయిత జీవితానికి తొలిద్వారం తెరిచారు.

ఇలా రాసుకుపోతే ఇంచుమించుగా అది నా ఆత్మకథ అవుతుంది. పావలా, లాభం, తెరచిరాజు, త్రివేణి, కొడుకు పుట్టాల, అసురసంధ్య. నాటకాలు ఆయన పెట్టిన భిక్షే. సినిమా రంగంలో ఆయనకి వున్న కొద్ది అనుభవం వల్లనేమో. నన్ను ఎప్పుడూ సినిమా రచయిత కమ్మని ప్రోత్సహించలేదు. నాలుగు ముక్కలు రాయగానే సినిమాలకి పోతే నాటకానికి ద్రోహం కాదా అనేవారు. ఆయన ఎక్కడికి వెళితే అక్కడ స్నేహితులు, శిష్యులు, అభిమానులు, ఆరాధించే అసంఖ్యాక ప్రేక్షకులు. ఆయన నాటకం రేడియోలో వస్తుందంటే పండిత పామరులందరికీ విందే! ఆయన నాటకం ప్రదర్శిస్తున్నారంటే పల్లెలు, పట్నాలు, మహానగరాల్లో కూడా విపరీతమైన సందడి! స్టేజీ మీదకి వస్తే ఒక ప్రభంజనం! ఆయన శిష్యులందరూ ఆయన్ని అనుసరించి ఆంధ్రదేశమంతా వెంకటేశ్వరరావులు నిండిపోవడం గూర్చి ఆయన చెప్పిన సమాధానం ఆయనే చెప్పగలరు! మంచి నటన అంటే నా నటనే" !! కాబట్టి అందరూ నాలా నటిస్తేనే మంచినటులు కాగలరని నమ్ముతున్నాను. నటిస్తున్నాను"

నిజమే మాష్టారూ! ఆరిపోని వెలుగులు మా అందర్లో నింపి మీరు మా పరంజ్యోతిగా మిగిలి పోయారు. మీకు తెలుగుదేశమంతా రుణపడివుంది !!

గణేష్ పాత్రో

బహురూప నట సమాఖ్య సౌజన్యంతో



## తండ్రి, గురువు, గైడ్, ఫిలాసఫర్

-కె.వి.ఎన్.డి.ప్రసాద్

మహానటుడు శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు గారు నాకు తండ్రి, గురువు, గైడ్, ఫిలాసఫర్ నాకు తండ్రి, గురువు ఒకరే అవటం నా అదృష్టముగా భావిస్తాను.

మా నాన్న గారికి నాటకము అంటే ప్రాణము. ఓసారి ఆయన ఆరోగ్యము పాడైనపుడు డాక్టరు కొప్పచ్చి కృష్ణమూర్తిగారు చాలా సీరియస్‌గా "వెంకటేశ్వరరావుగారూ! మీరు నాటకాలు వేయడం మానకపోతే రెండేళ్ళల్లో చనిపోతారు. మానేస్తే మరో పదేళ్ళు బ్రతుకుతారు'' అని చెప్పినప్పుడు **"నాటకాన్ని వదిలేసి నేను బతకలేను. రెండేళ్ళల్లోనే నన్ను పోనీయండి"** అని చెప్పినప్పుడు డాక్టరు కొప్పచ్చి కృష్ణమూర్తిగారు చాల ఆశ్చర్యపడ్డారు. బాధపడ్డారు కూడా.

మా నాన్నగారు బ్రతికింది **49** ఏళ్ళు. ఈ నలభై తొమ్మిది ఏళ్ళల్లో నాటకరంగాన్ని ఎంతగా ప్రేమించి ఎంతగా శ్రమించారంటే ఆయన శిష్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయన శతజయంతి దినోత్సవాన్ని జరుపుకునేంతలా.

ఎక్కడో చాగల్లు అనే చిన్న గ్రామాల్లో పుట్టి పెద్దగా చదువుకోక పోయినా, ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా బలహీనంగా ఉన్నా ఆయన తన నాటక లక్ష్యాన్ని విడువలేదు. మరువలేదు. నాటకాన్ని తన ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించి తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారు.

మా అమ్మగారి పేరు శ్రీమతి కుప్పిలి శారద, మా అక్కయ్య పేరు శ్రీమతి బి. లక్ష్మీకుమారి, మా బావగారు ప్రఖ్యాత నాటక సినీ రచయిత శ్రీ గణేష్ పాత్రోగారు, నా పేరు కె.వి.ఎన్.డి.ప్రసాద్. నా భార్య పేరు శ్రీమతి కుప్పిలి గున్నేశ్వరి. నా కుమారుడు చి॥ కుప్పిలి వెంకట సాయి సాగర్, ఎం.టెక్. పూర్తి చేసి ఇంజినీరుగా ఉద్యోగం చేస్తున్నాడు.

నాన్నగారికి నాటకం అంటే ఎంత ప్రాణమంటే ఆయన తన చివరి క్షణాల్లో హాస్పిటల్ బెడ్ పైన ఆయాసపడుతూ **"నాయనా ప్రసాద్ ! నేను పోయాక నాటకం మనింట్లో వుంటుందా?"** అని అడిగారు. నాటకం పట్ల వారికి గల ఆపేక్షను గమనించి ఆశ్చర్యపోతూ, తప్పకుండా నాటకం మనింట్లో వుంటుందని చెప్పాను. ఆ కారణంగానే మెకానికల్ ఇంజినీరింగ్ పట్టభద్రుడ నైనప్పటికీ నేను ఆయన

స్టేజి డైరెక్టర్‌గా పని చేసిన థియేటర్ ఆర్ట్స్ డిపార్టుమెంట్ లోనే స్టేజి మేనేజరుగా చేరి 2012లో స్టేజి డైరెక్టరుగా రిటైరయ్యాను. నా తండ్రిగారి శిక్షణ వల్లనే ఆకాశవాణి వారు నిర్వహించిన రచయితల పోటీల్లో రెండుసార్లు అఖిల భారత స్థాయిలో ప్రథమ బహుమతులు పొందగలిగాను. చాలా రేడియో నాటికలు, స్టేజి నాటికలు వ్రాశాను. ఆయన చివరి కోరికను నా స్థాయిలో తీర్చగలిగాను అనుకుంటాను.

చివరిగా ఆయన ప్రియ శిష్యులు శ్రీ ఎస్.కె.మిశ్రో గారు, శ్రీ కృష్ణ చైతన్య గారు. శ్రీ జగన్నాధరావు గారు, శ్రీ వంకాయల సత్యనారాయణగారు, శ్రీ సాక్షి రంగారావు గారు, శ్రీ పొట్టి ప్రసాదు గారు, శ్రీ ధం గారు, శ్రీ గొల్లపూడి మారుతీరావుగారు, శ్రీ గణేష్ పాత్రోగారు, శ్రీమతి వాణిబాల గారు, శ్రీమతి పావలా శ్యామల గారు, శ్రీమతి విజయలక్ష్మి గారు, డా॥ ఆడమ్స్ గారు, శ్రీ జి.బి. సత్యనారాయణ గారు, శ్రీ రామ్మూర్తిగారు, శ్రీ పిఠాపురం బాబ్జిగారు, శ్రీమతి అంగపాప గారు, శ్రీమతి జయశ్రీగారు.

శ్రీ పద్మనాభాచారి గారు, డా॥ కొల్లి మోహనరావు గారు, శ్రీ సీతారామరెడ్డి గారు, ర.స.న. సమాఖ్య (విజయవాడ) శిష్య బృందమంతా, రచయితలంతా, దక్షిణ భారత నటీనట సమాఖ్య (ఢిల్లీ) నట బృందమంతా. 205 నాన్నగారి శిష్యులందరినీ గుర్తు తెచ్చుకోవడం చాలా కష్టం గనుక ఎవరి పేర్లయినా మర్చిపోతే దయచేసి మన్నించండి.

శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావుగారు ఎంతమంది నటీనటులను, రచయితలను, దర్శకులను తీర్చిదిద్దారో ఎంతమందికి నాటక స్ఫూర్తి ఇవ్వగలిగారో చెప్పడం కష్టం.

ఆయన శతజయంతి దినోత్సవాన్ని జరుపుతున్న ఆలిండియా రేడియో వారికి, టీ.వీ.ల వారికీ, ఆంధ్రా యూనివర్శిటీ వారికీ, మాజీ మంత్రివర్యులు శ్రీ దాడి వీరభద్రరావు గారికీ, రైటర్స్ అకాడమీ వారికి, నాటక సమాజాలన్నిటికీ, నాన్నగారి శిష్యులకు, మిత్రులకు, అభిమానులకు కృతజ్ఞతాభి వందనములు సమర్పించుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

కె.వి ఎన్.డి. ప్రసాద్





# పొన్నూరు కళాపరిషత్

రి. నెం. : 464/2004

4-7-6A, విద్యానగర్, నిడుబ్రోలు-పొన్నూరు - 522 124. గుంటూరు జిల్లా.

Cell. 98481 44268

| గౌరవ అధ్యక్షులు | అధ్యక్షులు | కార్యదర్శి | కోశాధికారి |
|---|---|---|---|
| నన్నపనేని రఘునాథ్ M.Sc. | యస్.ఎ. నాయుడు M.A. | Ch.V. రామకృష్ణ M.A; B.Ed., | గుమ్మడి సోమయాజులు |
| Rtd. Lecturer | Rtd. Lecturer | Teacher | Rtd. Health Extn. Officer |

Date..............................

## నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు గారి శతజయంతి సుమాంజలి

పొన్నూరు కళాపరిషత్ కళోదయం **2000** సంవత్సరం, ఫిబ్రవరి **28**వ తేదీన ప్రముఖ "సినీ రచయిత శ్రీ పరచూరి గోపాలకృష్ణ గారి స్వర్ణ హస్తాలతో ప్రారభించబడింది. ప్రజలకు విజ్ఞాన వినోద వికాసాలను కలిగించదానికి, చైతన్యవంతులను చేయదానికి, కళలకు మించిన మార్గం లేదని భావించి ఆసక్తి గల కొందరు నట మిత్రుల సంఘటిత ప్రయత్న ఫలితమే పొన్నూరు కళాపరిషత్. ఆ రోజు నుండి ప్రతి సంవత్సరము మే నెలలో రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలతో బాటు అనేక వైవిధ్యమైన, కళా సాంస్కృతిక, సాహిత్య, క్రీడా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పొన్నూరు పట్టణానికి కళారంగంలో గౌరవాన్ని, ఒక ప్రత్యేక స్థానాన్ని, ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో గుర్తింపును తెచ్చినందుకు సంతోషిస్తున్నాము.

ప్రతి సంవత్సరం వృద్ధ కళాకారులకు ఆర్థిక సహాయంతో కూడిన గౌరవ సత్కారాలు, రంగస్థల సేవా పురస్కారాలు, సినీ ప్రముఖులు, రంగస్థల ప్రముఖులను ఆహ్వానించి సన్మానించడం జరుగుతూ ఉంది. ప్రత్యేకించి నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూలు నందు "సేవారత్న MJF Ln.ఆకుల సాంబశివరావు గారి సారధ్యంలో మా కళాపరిషత్ గౌరవాధ్యక్షులు MJF Ln.నన్నపనేని రఘునాథ్ గారి భూరి విరాళంతో దాతల సహకారంతో "డా॥ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదిక"ను పొన్నూరు కళాపరిషత్ కార్యవర్గం భవిష్యత్‌తరాలకు ఉపయోగపడే విధంగా నిర్మంచుకోవడం జరిగింది. ఈ నిర్మాణం ద్వారా పాఠశాలకు మూడు తరగతి గదులు ఏర్పాటు చేయడం మాకెంతో గర్వకారణం.

ఈ సంవత్సరం **23**వ ఉభయ తెలుగురాష్ట్రాల స్థాయి నాటిక పోటీలలో మా గురువుగారు శ్రీ ఆకురాతి మురళికృష్ణగారి గురువుగారైన ప్రముఖ రంగస్థల నటులు, నటరాజు కీ॥శే॥ కుప్పిలి వెంకటేశ్వరరావు గారి శతజయంతి సందర్భముగా నిర్వహించుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నాము. అంతేగాక, కుప్పిలి వెంకటేశ్వరరావుగారి శతజయంతి స్మారక సంచికను మా పొన్నూరు కళాపరిషత్ కార్యక్రమాలలో ఆవిష్కరించుకోవడం మాకెంతో ఆనందదాయకం. కుప్పిలి వెంకటేశ్వరరావు గారి పేరు మీద స్థాపించబడిన పొన్నూరు కుప్పిలి కళాంజలి సంస్థలో ఈ కళాపరిషత్ కార్యవర్గ సభ్యులు అనేక మంది నటించి ఉండడం మా అదృష్టం.


**25** సం॥లుగా మా పొన్నూరు కళాపరిషత్‌ను ఆదరిస్తున్న కళాపోషకులకు, కళాకారులకు, కళాభిమానులకు, కార్యవర్గ సభ్యులకు మా హృదయపూర్వక ధన్యవాదములు.



యస్.ఏ.నాయుడు
అధ్యక్షులు మరియు కార్యవర్గసభ్యులు
పొన్నూరు కళాపరిషత్, నిడుబ్రోలు

## చంద్రునికో నూలుపోగు

-ఆకురాతి మురళీకృష్ణ, M.Sc



1962 జూన్ నెలలో మావూరులో PUC ప్యాసయిన తర్వాత ఆంధ్ర యూనివర్సిటీ కళాశాలలో B.Sc (స్పెషల్) (4సం. ల BSc Hons తీసేసిన తర్వాత కొత్తగా 3 సంవత్సరాల డిగ్రీ కోర్సు పెట్టారు) మొదటి సంవత్సరం కోర్సులో జాయిన్ అవడానికి వెళ్తున్న సందర్భం. మావూరు నిడుబ్రోలు (అప్పుడు పెద్ద గ్రామం, ఇప్పుడు పొన్నూరు మున్సిపాలిటీగా మారిపోయింది) నుంచి విజయవాడ, అక్కడి నుంచి వాల్తేరు (ఇప్పుడు విశాఖపట్నం) ప్యాసింజర్ రైలులో వెళ్ళాలి.

ఆ రోజు బాగా గుర్తుంది. విజయవాడలో రైలెక్కి కిటికీ పక్క కూర్చున్నాను. ట్రైన్ ఎప్పుడు బయలుదేరుతుందా అనే ఆదుర్దాలో కిటికీనుంచి ప్లాట్ఫారం వైపు చూస్తున్నాను. ఇంతలో కోలాహాలంగా ఒక పెద్దబ్యాచ్ మా పక్క పెట్టె దగ్గరకు వచ్చారు. వారి మధ్యలో పూలదండలతో సన్నని పొడవాటి వ్యక్తి జోకులు పేలుస్తున్నాడు. ఎవరో రైల్వే ఆఫీసర్ అయి వుంటాడనుకున్నాను. రైలు బయలుదేరింది. ఆ మిత్రులందరూ టాటా బై బై చెబుతూనే రైలుతోపాటుగా ప్లాట్ఫారం మీద కనుమరుగయ్యేంత వరకూ నడుస్తూనే వున్నారు. ఆ దృశ్యం మైండులో ముద్రబడిపోయింది. ఉదయానికి జట్కా బండిలో యూనివర్సిటీ హాస్టల్ రూంలో జాయిన్ అయ్యాను. ప్రిన్సిపాల్ ఆఫీసుకు వెళ్తే ఒక సీటు దగ్గర గుమస్తా కూర్చొని వున్నాడు. జాయినింగ్ అప్లికేషన్ ఫారం ఎక్కడ ఇవ్వాలండీ అని అడిగాను. దానికి సంబంధించిన గుమస్తాను ఆయన చూపించాడు. (ఏంచేస్తాం, థాంక్స్ చెప్పడం కూడా తెలియని పరిస్థితి, పల్లెటూరు నుంచి వచ్చాంగదా?)

### University లో Tiger :

నెల రోజుల తర్వాత మా మెస్ దగ్గర ఒకరోజు “ఆ రోజున Ersqin Theatreలో నాటకం ఉంద”ని నోటీసు పెట్టారు. అసలే నాటకాలు వేసివున్నాం గదా, ఇక్కడ నాటకాలు ఎలా వేస్తారోననే కూతుహలంతో వెళ్ళాం. మా రూంమేట్స్ కొంచెం ఆలస్యం చేశారు. మేము ఆ

ఓపెన్ థియేటర్ కు వెళ్లేసరికి నాటకం జరుగుతోంది. గేటు మూసేశారు. మేము చేతులతో గేటు మీద కొడుతున్నాం. ఇంతలో కోటు వేసుకున్న ఒక పెద్దాయన (చేతిలో పైపుతో) లోపాలనుంచి గేటు దగ్గర ప్రత్యక్షమయ్యాడు. ఆయన్ను చూసి మా సీనియర్లు టైగర్ వచ్చాడ్రా అనుకుంటూ పారిపోయారు. ఎందుకో తెలియక నేనక్కడే నిలబడిపోయాను. "సార్, కొంచెం గేటు తియ్యండి సార్, నాటకం చూడాలి సార్" అన్నాను.

"కొత్తగా వచ్చావా? నాటకం మొదలు పెట్టాక గేట్లు తీయరు. రేపు మరలా ఉంటుంది, 6 గంటలకు ఖచ్చితంగా వచ్చేయ్" అన్నాడు.

ఉసూరుమంటూ రూంకు తిరిగివెళ్ళాక చెప్పారు "ఆయన University టైగర్" అని. నిజంగా టైగర్ లానే వున్నాడు. ఆ తరవాత తెలిసింది, "ఆయన యూనివర్సిటీ రిజిస్ట్రార్ & Theatre Arts Producer K. V. Gopala Swamy " గారని.

**మతిపోగొట్టిన Open Theatre :**

మరుసటి రోజు అరగంట ముందుగానే బోటనీ జూలజీ డిపార్టుమెంటుల మధ్య గల చతురస్ర ఖాళీస్థలమే Ersquin Square Open Air Theatre (ఆరుబయలు రంగస్థలం) దీన్ని ప్రస్తుతం "కూర్మా వేణుగోపాలస్వామి ఆరుబయలు రంగస్థలం" అని పేరుపెట్టారు. స్టేజికి ఎదురుగా సాంచిలోని బౌద్ధుల పవిత్ర సాంచిస్తూప ముఖద్వారానికి సాంకేతంగా సిమెంట్ కట్టడం వుంది. అన్నట్లు యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని హాస్టల్స్ పేర్లు కూడా బౌద్ధానికి సంబంధించిన పేర్లే (అశోకవర్ధన, సద్ధర్మసదన, వినయవిహార, వివేకవిన్యాస, హర్షవర్ధన, సిద్ధార్థ, నాగార్జున). రెండోపక్క బౌద్ధ స్థూపాన్ని పోలిన డోమ్ ఆకారం కలిగిన స్ట్రక్చర్ కనిపిస్తుంది. కర్టెన్లు, స్టేజి ఎక్కడా అని వెతుకుతుంటే, కరెక్టుగా గం.6.30 కు గంట మోగింది. డోమ్ స్ట్రక్చర్ కింద రెండు తలుపులు తెరుచుకొని కర్టెన్ కనిపించింది. అప్పటికిగాని అది స్టేజి అని అర్థం చేసుకోలేకపోయాను. రెండో గంట మోగింది. సిల్క్ కర్టెన్ తెరుచుకుంది. ఆశ్చర్యం ఏమిటంటే స్టేజిమీద ఒక్క లైట్ గిన్నెగాని, ఒక్క మైక్ గానీ కనపడలేదు. (అవన్నీ ఏర్పాటు చేసుకోడానికి మరో అరగంటయినా పడుతుందేమో అనిపించింది) కానీ అవేమి లేకుండానే నాటకం మొదలుపెట్టారు.స్టేజి మీద ఆకాశంలో క్రమంగా సూర్యాస్తమయం అవడం కనిపించింది. (తర్వాత తెలుసుకున్నాను, వెనకవున్నది ఒక ప్రత్యేకమైన కర్టన్ CYCLORAMA అని. ఆ తెరమీద సూర్యోదయం, చంద్రోదయం, నక్షత్రాల మిలమిలలు, సముద్రపు అలలు, సంపత్ కుమార్ ఆంధ్ర జాలరి, దేవలోకంనుంచి దిగివచ్చే మహలక్ష్మి (బేబీ) బృందం వారి 'కచదేవయాని' నృత్యనాటకం,... ఓహ్ ఎన్నని చెప్పను?)

వాటన్నిటిని సృష్టించింది యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కాశ్యప గారని. అవన్నీ ఆ

సైక్లోరమా తెరమీదనే సాధ్యం. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో అలాంటి కర్టెన్ నేనెక్కడా చూడలేదు ఒక్క హైదరాబాద్‌లోని శిల్పారామం స్టేజి మీద తప్ప. ఒకవేళ వున్నా అలాంటి కాస్యప లాంటి ఇంజనీర్లు, కె.వి.గోపాలస్వామి లాంటి నిర్మాతలు, వినియోగించుకునే నైపుణ్యం గల స్టేజ్ డైరెక్టర్లు ఉండాలి గదా? లేరని చరిత్ర చెబుతోంది. All credit goes to these great Electrical Engineer, Producer n Stage Director only)

లైట్స్ ప్రేక్షకులకు కనబడకపోయినా సందర్భానికి తగిన లైటింగ్ ఎఫెక్ట్స్ ప్రదర్శనకు నిండుదనమిస్తాయి. మైకులు కనిపించకపోయినా నటులు ఏ మూలనున్నా వారి మాటలు స్పష్టంగా వినిపిస్తాయి. కాగితం చప్పుడు కూడా వినిపించడం ఆశ్చర్యం గొలుపుతుంది. (పొన్నూరు కళా పరిషత్ స్టేజి పైన ఈ పద్ధతి అనుసరిస్తున్నామని మాకు కొంచెం గర్వం వుంది). ఇలాంటి రంగస్థల ప్రయోగశాల ప్రదర్శనలకు 'టైగర్' తప్పనిసరిగా హాజరు, అల్లరి చేద్దామని వచ్చేవారు సైలెంట్. వారు ఉంటేనే ఒక నిండుదనం. వారి తదనంతరం ఆ థియేటరకు "గోపాలస్వామి ఓపెన్ థియేటర్ " అని పేరుపెట్టడం, ఎంట్రన్స్ దగ్గర వారి విగ్రహం పెట్టడం గర్వకారణం.

**మహా నటుడు, దర్శకుడు, ప్రయోక్త :**

ఇక ఆరోజు నేను చూసిన నాటకం అదరహో (వారి అన్ని ప్రదర్శనలూ ఒకదాన్నిమించి మరొకటి ఉంటాయని తర్వాత కాలంలో నాకొచ్చిన స్వీయ అనుభవం). ఆ వాచకం,నటన హావభావాలు, మోడ్యులేషన్, కదలికలు... అమోఘం. పరిసరాలు మరచిపోయి అదోరకమయిన మైకంలోకి వెళ్లిపోవడమే. ఆ స్థితిని ఏమంటారో నాకు తెలియదు. అంతలోనే నాటకం అయిపోయింది, పాత్రల పరిచయం చేస్తున్నారు. రెండు ఆశ్చర్యాలు : ఒక నటుడు మా ప్రిన్సిపాల్ ఆఫీసులో నేను మాట్లాడిన గుమస్తా, R Rangarao గారని పరిచయంలో చెప్పారు. వారిని మొదట చూసినప్పుడు వారంతటి నటుడుగా నేను ఊహించలేక పోయాను.

చివరగా ఒక పాత్ర నటించిన పాత్రధారి, దర్శకుడు పేరు చెప్పారు, కె.వెంకటేశ్వరరావు అని. వారు స్టేజిమీదకు వచ్చారు నమస్కరిస్తూ. అంతే, నా విస్మయానికి అంతులేదు. వారెవరోకాదు, ఆ రోజున విజయవాడ ప్లాట్ఫారమ్ మీద పూలహారాలతో కనిపించిన వారే. ఇక అంతే, ఆయన ఫాన్ ఐపోయాను. ఎప్పుడు యూనివర్సిటీ థియేటర్లో నాటకం జరిగినా, ముందుగానే హాజరవడం ఆనవాయితీగా పెట్టుకున్నాను. వారినే గురువుగా భావించాను. ఆ రంగస్థలం మీద వారి డైరెక్షన్లో కనీసం ఒక్క నాటకంలో అయినా ఒక్కసారైనా ఒక వేషం వేయాలనే గొంతెమ్మ కోర్కె మాత్రం వుంది.

ఒకసారి ఆ అవకాశం వచ్చింది. మేము స్పెషల్ B.Scలో వున్నప్పుడు నేను మా హాస్టల్ వెల్ఫేర్ సెక్రటరీగా ఎన్నికయ్యాను (1964-65). (ఆ సమయంలోనే గాంధీ పార్కులో గార్డెన్

వేయించాను) హాస్టల్ విద్యార్థులతో KVR దర్శకత్వంలో ఒక నాటిక ప్రదర్శించే అవకాశం వచ్చింది. మా వార్డెన్ గారు Prof రామనాథం గారి ప్రోత్సాహం ఎంతోవుంది. KVR గారి దగ్గరకు పంపారు, వారు అంగీకరించారు. గొల్లపూడి వారి "రెండు రెళ్ళు ఆరు" నాటిక. నాకు హీరో మేనమామ 'విశ్వం ' పాత్ర ఇచ్చారు. నా ఆశ నెరవేరుతున్నందుకు ఎంత ఆనందమో! ఆ రిహార్సల్స్ ద్వారా ఎంత అనుభవమో మాటల్లో చెప్పలేనిది. నటన, దర్శకత్వం మీద కొంత అవగాహన కలిగింది. అంతకుముందు స్కూల్ లెవెల్లో మేము ప్రదర్శనలు వేసినవి నాటకాలే కాదని అర్థమయ్యింది. ఏమీ తెలియని మాలాంటి విద్యార్థులతో ప్రదర్శన బాగుంది అనిపించుకోడంలో విజయం మా గురుదేవులదే.

**ఆయన్ని నేను "మాస్టారూ" అనే పిలిచేవాడిని**

డిగ్రీ 3వ సంవత్సరం అయిపోయింది., పెళ్లి కూడా అయిపొయింది. ఉద్యోగాలకోసం తిరిగాను. మొత్తానికి సంవత్సరం తర్వాత హైదరాబాద్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో LDC ఉద్యోగం వచ్చింది. నాకేమో క్లరికల్ ఉద్యోగం ఇష్టం లేదు, టెక్నికల్ ఉద్యోగం మీద మోజు, ఇంటర్వ్యూ దాక వస్తున్నాయి కానీ సెలక్షన్ రావడం లేదు (డబ్బులు ఇచ్చినవారికి మాత్రం వస్తున్నాయి) ఇక లాభంలేదని యూనివర్సిటీలో MSc చెయ్యాలని నిర్ణయించుకున్నాను. కానీ అప్పటికి అడ్మిషన్స్ పూర్తయినా, యూనివర్సిటీలో స్పెషల్ BSc చదివిన మాకు 3నెలల తర్వాత అడ్మిషన్ ఇచ్చారు. అసలే 3 సం.ల గ్యాప్, 3నెలల లేటు! ఒకసారి KVR గారిని కలిసి ఏమ్మేస్సిలో చేరినవిషయం చెప్పాను. "ఇంకేమి, Theatre Artsలో కూడా చేరమన్నారు. "కుదరదు సార్, ఇప్పటికే నాకు పెళ్లయింది,చదువుకు 3సం. గ్యాప్ వచ్చింది. అన్నీ మర్చిపోయాను. MSc పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరకపోతే కష్టం సార్" అన్నాను. "సరే, అప్పుడప్పుడు కనపడుతుండు, ప్రోగ్రామ్స్ జరిగేటప్పుడు మాత్రం తప్పనిసరిగా వస్తుండు" అన్నారు. అప్పుడప్పుడు వారిని కలవడం కుదరలేదుగాని, థియేటర్ ఆర్ట్స్ వారి ప్రదర్శనలు మాత్రం ఏవీ మిస్ కాలేదు. MSc పూర్తయిన 3 నెలలకే మా ఊరు కాలేజీలోనే లెక్చరర్ ఉద్యోగం రావడంతో ఊరట పడ్డాను.

మాస్టారు చనిపోయిన తర్వాతగాని నాకు తెలియలేదు. (అప్పటిదాకా ఎవరెవరో అడిగితే పొన్నూరులో వేషాలు వేస్తున్నా.) వెంటనే కొందరు నాటక మిత్రులతో సమావేశం జరిపి మాస్టారి గుర్తుగా "కుప్పిలి కళాంజలి" సంస్థను రిజిస్టర్ చేసుకొని, మాస్టారికి "జోహార్లు" మాత్రమే ప్రార్థనాగీతంగా చేసుకొని పరిషత్తులలో పాల్గొంటున్నాము. రిహార్సల్స్‌లో ఆయన అనుసరించిన విధానాలే అనుసరిస్తున్నాము.

## : మాస్టారి విధానాలు :

1. మంచి కధాబలం వున్న నాటకం తీసుకోవడం (మేము సామాజిక ప్రయోజనం గల కధలను తీసుకుంటున్నాము )

2. పాత్రధారులకు సరిపడే పాత్రలు కేటాయించడం

3. మోడ్యులేషన్‌తో పాటుగా అందరికీ కంఠస్థం వచ్చేంతవరకు, సుమారు 3 నెలలు సిట్టింగ్ రిహార్సల్స్ చేయడం

4. ఒక వారం పది రోజులు మూవ్మెంట్ సర్దుబాట్లతో స్టాండింగ్ రోహార్సల్స్

5. ఆపయిన రోజుకొకసారి బ్రేక్ లేకుండా డ్రిల్లింగ్.

6. ఈ విధానం ద్వారా ప్రతి డైలాగూ మూవ్‌మెంట్స్‌తో సహా ప్రతి పాత్రధారికి వచ్చేస్తాయి. అందుకే ఎవరికైనా వేషం మార్చినా ఇబ్బంది పడకుండా చేయగలుగుతారు. మాస్టారు అప్పుడప్పుడు తానువేసే ప్రధాన పాత్రలను ఇతరులతో కూడా చేయిస్తుంటారు (ముఖ్యంగా ట్రాజడి సన్నివేశాలలో ఆర్.రంగారావు, మిశ్రో లాంటివారు మక్కీకి మక్కి గురువుగారిని దించేస్తారు. వారిని చూస్తుంటే గురువుగారే నాకు కనిపిస్తుంటారు.

ఈ విధానాలే కుప్పిలి కళాంజలి పాటించింది, పాటిస్తున్నది.

చివరిగా......

మాస్టారి నాటకం చూస్తుంటే తెలుగు నాటకం ఉన్నత శిఖరాలు చేరుకున్నదనిపిస్తుంది. అది నిజమే. ప్రస్తుత నాటకరంగంలో కూడా ఎందరో మంచి నటులున్నారు. వారంతా గొప్ప ఆశలు కల్పిస్తుంటారు. అలా అనుకున్నంతలోనే వారు టీవీ, సినీరంగంలోకి పరుగులు తీసి నాటకరంగాన్ని అనాథను చేస్తున్నారు. వాస్తవానికి నాటకరంగంలో పేరు తెచ్చుకున్నవారికి సరయిన వేషాలే లేక అంత గొప్ప కళాకారుడు టీవీ సినిమాలలో చిల్లర వేషాలు వేస్తుంటే, వారిని చూసినవారికి బాధేస్తోంది, జాలి కలుగుతోంది.

వాస్తవానికి మాస్టారి గొప్ప గొప్ప నాటకాలు చూసిన నేను, గత 30 సంవత్సరాలుగా తెలుగు సినిమాలు చూడడమే లేదు, ఇది వాస్తవం.

మాస్టారు అన్నట్లు :

"కళాకారుడికి గర్వం ఉండకూడదు,  
కానీ గర్వించదగ్గ కళాకారులు  
లేకపోవడం  
తెలుగువారి దౌర్భాగ్యం!"

సినిమా పాటల మ్యూజిక్ విని-
అది సాలూరి రాజేశ్వరరావు గారిదని చెప్పవచ్చు,
అలాగే ఒక నాటకంలోని డైలాగ్ విని-

అది కుప్పిలి వెంకటేశ్వరరావు గారిదని చెప్ప గలిగినవారు చాలామంది వున్నారు!

"నటరాజు" వెంకటేశ్వరరావు గారి గురించి ఎందరో తమ అభిప్రాయాలు ఈ సంచికలో రాశారు, వారితో పాటు నా మనసులోని ముద్ర కూడా రాశాను. ఇవన్నీ చదివినవారు, విన్నవారు, మరింతమంది అలా తయారుకావాలనేది మా ఆశ! అందుకే నా ఈ ఘోష!

మాస్టారు కుప్పిలి వెంకటేశ్వరరావు గారికి ఇదే నేను అర్పించుకునే నివాళి ఈ "చంద్రునికో నూలుపోగు!"

**-ఆకురాతి మురళీకృష్ణ,**
దర్శకుడు : కుప్పిలి కళాంజలి
మొబైల్ : 081212 25046.

ధియేటర్ ఆర్ట్స్


Bar-at-law

కె.వి.గోపాలస్వామి, ప్రొడ్యూసర్



కె.వి.ఆర్. డైరెక్టర్







## నేను చూసిన 'నటరాజు' కె.వెంకటేశ్వరరావు

-ఎన్.తారక రామారావు

1960 సంవత్సరం రామమోహన గ్రంథాలయం - విజయవాడలో 'దొంగవీరడు' నాటకం చూశా - నిలబడి - గ్రంథాలయం స్టేజీ - పది - పన్నెండు అడుగుల - అరుగు - ఆ అరుగు మీద 14 మంది నటులు - 'దొంగవీరడు' నాటక ప్రదర్శన - హాలులో అందరూ నేల పైన కూర్చున్నారు - నే కిటికీలో నిలబడ్డా - అంతా రెండు వందల మంది.

నాటకం ఇలా ఆడాలి- నటనంటే ఇదే సుమా - రెండు గంటలు నిలబడి నాటకం చూశా - నాటకం మహాద్భుతం.

శ్రీ వెంకటేశ్వరరావు 'దొంగవీరడు'లో రామబ్రహ్మం - లాల్చీ, పైజామా - మెడలో మఫ్లర్.

"మా మామగారు నన్ను చూడగానే చెప్పు తీశాడు."

రామబ్రహ్మం ఓ ప్రక్కనున్నాడు కాలి చెప్పు రంగస్థలం మీద మరో చోట.

"కొట్టాడా?"

"లేదు."

రామబ్రహ్మం వెళ్ళి చెప్పు తొడుక్కున్నాడు - ఈ మధ్య ఓ నిమిషం - జనం చప్పట్లు. 'వామ్మో - ఇదా నటనంటే' అనుకున్నా.

అదీ నే చూసిన నటన - నాటకం సర్వశ్రీ - జి.యస్.ఆర్. మూర్తి, శివరామిరెడ్డి, జి. వి. సుబ్బారావు, చాట్ల శ్రీరాములు, పొట్టి ప్రసాద్, రాజబాబు అందరూ మహానటులు అందులో ధృవతార శ్రీ కె.వెంకటేశ్వరరావు.

ఆ తర్వాత 1971 ప్రాంతంలో శ్రీ కళానికేతన్ - నారాయణగూడ వై.యం.సి.ఏ.లో వెంకటేశ్వరరావుకి, శ్రీ జె. యల్. నరసింహారావుకి సన్మానం చేసింది. ఆ సభలో శ్రీ వెంకటేశ్వరరావు 'కీర్తిశేషులు' నాటకంలో - (కాఫీ దృశ్యం) - 'మురారి' పాత్ర నటించాడు.

జనం ఆశ్చర్యపోయారు - గుండెలు చిక్కబట్టుకొని లేచి నిలబడి కరతాళధ్వనులతో- ఆ మహానటుడికి - ప్రశంసలందించారు.

ఆయన నిజంగా నటరాజు.

సన్నగా - బక్కగా - లాల్చీ, పైజామా ధరించి - చూపుల్లో అదో ఆకర్షణ - మాటల్లో చిద్విలాసం - అదీ మహానటుడి రూపం.

12-09-1971 'ఆత్మసాక్షి' నాటకం విజయవాడ రైల్వే ఇనిస్టిట్యూట్ - పోటీల్లో ఉదయం 10:30కి ప్రదర్శించాం.

నాటకం అయ్యాక శ్రీ కె. వెంకటేశ్వరరావు స్టేజీ మీదకొచ్చాడు.

మా డైరెక్టర్ కె. సూర్యనారాయణ మూర్తి - చాట్ల శ్రీరాములు - కె. వెంకటేశ్వరరావు- రైల్వే మిత్రులు.

"సూరీ ! ఈ నాటక రచయిత ఎవర్రా ?" అనడిగాడు.

మా డైరెక్టర్ గారు నన్ను పిల్చి - పరిచయం చేశాడు. నన్ను ఎగాదిగా చూసి "మెలోడ్రామాకు ఈ నాటకం పరాకాష్ట" అన్నాడు.

నాకు అప్పటికి "మెలోడ్రామా" అంటే తెలీదు. తొలి నాటకం - లలిత కళానికేతన్‌లో ఉత్తమ రచయితగా బహుమతి వచ్చింది.

ఆ తర్వాత - అదే రైల్వే ఇనిస్టిట్యూట్‌లో - ర. స. న. తరపున - 'కనక పుష్యరాగం' తొలి ప్రదర్శన చూశా.

శ్రీ వెంకటేశ్వరరావు ది - హస్కీ వాయిస్ - చూపులు పులి చూసినట్లు ఉంటాయి. 'కనక పుష్యరాగం' - శ్రీ కె. వెంకటేశ్వరరావు - నటన దర్శకత్వం వహించాడు - అదో గొప్ప అనుభూతి.

ఆధునిక తెలుగు నాటకంలో - ఆయనో ప్రభంజనం - నటన - దర్శకత్వంలో ఆయన బాణీ అనితరసాధ్యం.

ఆయన నిజంగానే "నటరాజు"

-యన్. తారక రామారావు

13-1-59/2,
మోతీనగర్ (ఎక్స్‌టెన్షన్)
హైదరాబాద్ - 500114



## కుప్పిలి వెంకటేశ్వరరావు

-మల్లేశ్వరరావు ఆకుల

మహానటుడు నటరాజు కళాతపస్వి ఆదిగాగల బిరుదాంకితుడు కీర్తిశేషులు కుప్పిలి వెంకటేశ్వరరావు (1923 1973). ఆయన 50 ఏళ్ల పరిమిత జీవన గమనంలో, ప్రస్థానంలో అతి ముఖ్యమైన విషయాలు ఘట్టాలు ఇప్పటి తరం తెలుసుకునేందుకు స్ఫూర్తి పొందేందుకు తప్పక చదువవలసిన గ్రంథం ఇది. అలా ఇప్పటి థియేటర్ యాక్టివిస్టులు ప్రాక్టీషనర్స్‌కి ఈ గ్రంథం ఒక బైబిల్ లాంటిది, భగవద్గీత లాంటిది. దీన్ని శ్రీ విరించి, వారి కుమారుడు కే.వీ.ఎన్.డీ. ప్రసాద్ కలిసి రాశారు. ఇందులో 12 అధ్యాయాలు ఉన్నాయి.

వెంకటేశ్వరరావు గారి జీవిత విశేషాలను తెలియ చెప్పే ముందు మాటలలో ఈ గ్రంథ రచయితలు చెప్పే ఎన్నో విషయాలను మనకు, వెంకటేశ్వరరావు గారి నటజీవిత నిబద్ధత, నడక, వికాస పురోగమనాలు మనకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి. పల్లవించిన పసిడి ఫణితి సమర్పణ ప్రార్ధన తర్వాత నాందితో మొదలై భరతవాక్యంతో 160 పేజీల నిడివికి విస్తరించి ముగుస్తుంది. ఇందులో గురువుగారు అంటే ఏమిటో భావితరాలకు నటీనటులకు స్పష్టంగా తెలిసి రావలసిన విషయాలు అనేకం ఉన్నాయి. వారి అంకిత భావం అనన్య శ్రద్ధ అందరికీ ఆదర్శవంతం కావాలి అంటారు శ్రీ విరించి ఒక సందర్భంలో. ఎక్సలెన్స్ ఇస్ ఈక్వల్ టు మోటివేషన్ వర్సెస్ కమిట్మెంట్ టు ద పవర్ ఆఫ్ టు, అని - ప్రసస్తి, అంటే ప్రేరణ ప్లస్ నిబద్ధత అని నిర్వచిస్తారు. ఇందులో ముఖ్యంగా ఇప్పటి తరానికి ఎన్నో విషయాల్ని సుస్పష్టం చేస్తూ నాటక రంగంలో నిబద్ధులైన వారి క్రియా కలాపాలని పరిపుష్టం చేస్తూ, అర్థవంతం చేస్తూ నాటక రంగాన్ని సంవర్గీకరించటానికి ముందు తరాలకి అందజేయటానికి కావలసిన అనేక విలువైన విషయాలు ఇందులో అక్షరీకరింపబడటం, ఈ గ్రంథాన్ని చదవడమే ఒక గొప్ప అనుభూతి, సంతృప్తికరమైన ఫీలింగ్‌ని ఇస్తుంది.

**నాటకం నా ఊపిరి - జీవితం తదుపరి** అన్న బంగారు పలుకులు గల ఈ అధ్యాయంలో ఆయన సహధర్మచారిణి శ్రీమతి శారదమ్మ ఒక సందర్భంలో లేఖాముఖంగా తన భావాలను ఇలా వ్యక్తీకరించారు. "ఇది భర్త స్వర్గస్తులైన తర్వాత రాసిన బహిరంగ లేఖ. ఈ ఉత్తరంలో వారి అన్యోన్య అనురాగం పరస్పర ఆశ్రయము అవగాహన ప్రత్యక్షంగా రూపు కట్టుకుంటాయి.

"నేను అత్తవారింట్లో అడుగుపెట్టిన నాడే సహదేవ సూర్యప్రకాశరావు గారు రాసిన 'నర్తకి' - 'పూలమాల' - 'శిష్య రక్షిత' అనే మూడు నాటకాలు వారం రోజుల్లో ఫేర్ చేసి ఇవ్వగలవా ? అని

అడిగారు. అన్న ప్రకారం రాసి ఇస్తే ఎంతో పొగిడారు. బెజవాడలో నేను కొత్తగా కాపురానికి వచ్చిన రోజుల్లో అందరి పోర్షన్స్ విడివిడిగా రాసి మీ మాట ప్రకారం ఇచ్చేదాన్ని. మీ బృందం అందరికీ కాఫీ టిఫిన్లు చేసి పంపేదాన్ని. పరిషత్తుల్లో బస్తాల కొద్దీ మీరు బహుమతులు గెలుచుకుని వస్తూ ఉంటే చూచి పొంగిపోయేదాన్ని. అతి తక్కువ జీతంతో ఆ చెన్నై ఇంట్లోనే డ్రెస్ రిహార్సల్స్ వేసేవారు. నేను ఉన్నట్లు గమనించకుండా వారందరితో కలిసి బయటికి వెళ్లిపోయేవారు. ఆదివారమైనా ఇద్దరం కలిసి సినిమాకు వెళ్తామని నేనంటే "ఏం శారదా, నాటకాల వాడిని కట్టుకొని సరదాలు తీరడం లేదని విచారిస్తున్నావా?'' అని అడిగారట ఒకసారి. ఆ మాటకు ఆమెకు ఎంతో దుఃఖం వచ్చింది అప్పుడు ఆయనే ఓదార్చారు. ఇల్లు పిల్లలు అనకుండా ఆరోగ్యమైనా చూసుకోకుండా రోజుకు 20 గంటలు నాటక రంగానికి అంకితం అయ్యే మీ తపనని ఎలా ప్రశంసించాలో మాటలు రాక ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ రాసిన మాటలు ఇవి. అమ్మాయి లక్ష్మీ చేత యూనివర్సిటీలో నాటకం వేయించారు. అబ్బాయి ప్రసాద్ బాబుతో నాటకాలు వేయించారు. అల్లుడు గణేష్‌పాత్రో నటుడు రైటర్- అతనితో నాటకాలు వేయించారు, రాయించారు. మనవడు రాజాతో చిన్నబాబు నాటకం వేయించారు. మీరు నాకు ఇచ్చిన విలువ మాత్రం మర్చిపోలేనండి'' అని రాసుకున్న ఈ మాటలు వారు ఉభయులూ సంసార సాగరంలో, నాటకాల నావలో ప్రయాణం చేస్తూ జీవితాన్ని ఉన్నంతలో సంతృప్తి నింపుకున్న ఆ మహా ఇల్లాలి అంతరంగమైతే, ఇక వారి కుమారుడు కేవీయస్ డి ప్రసాద్ ఏమంటారంటే.. "నన్ను చాలా జాగ్రత్తగా చదివించారు. ఆయనే లెక్కలు ఇంగ్లీషు రోజుకు అరగంట సేపైనా బోధించేవారు. ఒకసారి లెక్కల్లో నూటికి నూరు మార్కులు వస్తే. ఇప్పటినుంచి నీ కష్టాలు మొదలు నాయన అన్నారు.

అదేమని నేను ఆశ్చర్యపోయి అడిగితే 'నూటికి నూరు మార్కులు తెచ్చుకోగల సమర్థత నీకు ఉన్నదని తెలిపాక 99 మార్కులు తెచ్చుకున్నా, ఆ రాని ఒక్క మార్కు కోసం నీకు దండన తప్పదు కదా' ! అన్నారు. ఆయన కోపగించుకున్నా దండించినా ఆనందంగా ఉండేది. ఎందుకంటే మర్నాడు మంచి స్వీట్లో, కొత్త బట్టలు కానీ కొనిపెట్టి బోలెడు విషయాలు వివరంగా చెప్పేవారు. ఎంతోమంది శిష్యులను తయారు చేసిన నాన్నగారు, "నేను నాటకాలు వేస్తూ వేయిస్తూ నాటకాలు రాస్తూ డైరెక్ట్ చేస్తూ ఉంటే చూచి నన్ను సరిదిద్దే అవకాశం లేకపోవడం దురదృష్టం. అంతకన్నా ఇంకేం అనగలను'' అన్న ఆవేదన ఆయన మాటల్లో వ్యక్తం అవుతుంది.

కొడుకు చనిపోయిన నాడు కూడా నాటకం వేయవలసి రావడం, ఆరోగ్య కారణాలు అలసటను ఎత్తిచూపుతూ, తనను సహనటులు శిష్యులు నాటకంలో వేషం వేయకుండా వారించడం ఆయన ఎలా సహించాడో, ఎంత దుర్భరంగా బాధపడ్డాడో, ఊహించడం అసాధ్యం. అక్షర రూపం కల్పించడం మరీ దుస్సాధ్యం. అందుకే ఆయన "నాటకం నా ఊపిరి జీవితం తదుపరి'' అనేది, వారికే సొంతమైన సూక్తి.

నాటక రంగం పట్ల ఆయన అంకిత భావం ఎలాంటిదో తెలియాలంటే పది నెలల కొడుకు

(ప్రథమ సంతానం) చనిపోతే ఇంటిల్లిపాది రోదిస్తున్న సమయంలో అరగంటలో వస్తానని ఆకాశవాణి విజయవాడ కేంద్రం చేరుకుని కొర్రపాటి గంగాధర్ రావు రచన "నా బాబు" నాటిక లైవ్ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆ నాటికలో ఆయన కొడుకు పాత్ర చనిపోతుంది. ఇంకొక మారు శ్రీ రాఘవ రాసిన కనకపుష్య రాగం నాటక ప్రదర్శనకు న్యూఢిల్లీకి బయలుదేరుతున్న సమయంలో తన సోదరి మరణం వార్త వస్తుంది. దుఃఖాన్ని దిగమింగుకొని ట్రైన్ ఎక్కి న్యూఢిల్లీ చేరి నాటకాన్ని అద్భుతమైన రీతిలో ప్రదర్శింప చేశారు. 1971 లో ఆయనను పరీక్షించిన డాక్టర్లు- **నాటికలు మానేస్తే పదేళ్లు, నాటకాలు వేస్తే రెండేళ్లు బతుకుతావు** అని చెప్పారు. **నాటకాలు వేయకపోతే నేను ఉండీ ఏం ప్రయోజనం ?** అంటూ నాటకాలే జీవితంగా కొనసాగించారు. ఒకసారి రాజమండ్రి ఓవర్ బ్రిడ్జి దాటుతున్న సమయంలో పట్టుతప్పి కింద పడిపోతున్న వృద్ధుణ్ణి రక్షించారు. ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు. అందుకు కృతజ్ఞతగా శ్రీపాద వారు 'మహాదేవి సాయం తన సమయ సింహాసనం' అనే ప్రార్థనా గీతాన్ని రచించి ఇచ్చారు.

తన జీవితకాలంలో ఎన్నో బహుమతులు బిరుదులు అందుకొన్నారు. వాటితో తృప్తి పడక దర్శకత్వం వహించి నాటకాలను మధించి నటనలో, ప్రదర్శనలో అపూర్వమైన నూతన పోకడలు సృష్టించారు. నాటకాన్ని కట్టుదిట్టంగా రిహార్సల్స్ చేయడం, పరిశీలించడం అనుకున్న సమయానికి నాటకం ప్రారంభింప చేయడం.. అన్నిటికంటే ముందు క్రమశిక్షణకు మొదటి స్థానాన్ని కల్పించడం, ఇవన్నీ ఆ నటరాజును నట శిఖరాగ్రస్థాయికి చేర్చాయి.

రంగస్థలం నా తపోభూమి అన్న అధ్యాయంలో.. ఒకసారి విజయవాడ నాటక సదస్సులో ఒక పోటీ. అదేమిటంటే, మరణశిక్ష పొందిన ఖైదీ జైలులోనికి రావడం, ఉరి తీయబడటానికి వెళుతున్న ఖైదీ, మరణ శిక్ష నుంచి విడుదలై బయటికి వెళుతున్న ఖైదీ, ఈ మూడు పాత్రలకు అప్పటికప్పుడే రూపకల్పన చేసుకుని నటించి చూపాలి. ఇందులో కే. వెంకటేశ్వరరావు గరికిపాటి రాజారావు, కొడాలి ఆదిశేషయ్య గార్లు సమున్నతంగా నటించి ప్రేక్షకులను అలరించారట. "రంగస్థలం మీద బంగారు తీగలాగా శరీరాన్ని ఇష్టం వచ్చినట్లు, కావాలనుకున్నట్టు, నటనను ఉద్దీపనం చేస్తూ తిప్పడం వెంకటేశ్వరరావుకు వెన్నతో పెట్టిన విద్య'' అంటారు ఈ గ్రంథ రచయితలు.

"నటన జన్మతః రావాలని అనుకోనక్కర్లేదు, నేర్చుకుంటే.. శ్రద్ధగా పరిశీలించడం చేతనైతే ఎవరైనా నటించవచ్చును. నటించే శక్తి జన్మతః అందరిలోనూ ఉంటుంది. దానిని సానబట్టడం వెలుగు తీసుకురావడం అనేది మంచి శిక్షణ పొందడం మీద ఆధారపడి ఉంటాయి" అన్న విషయాన్ని వేయిరెట్లుగా పెంచుకొని తనకు చేరువైన ఇతర నటీనటులతో కలిసి పనిచేసి వారినీ రత్నాలుగా తయారు చేశారు వెంకటేశ్వరరావు గారు.

గొల్లప్రోలు నాటక పరిషత్తులో జరిగిన ఒక గోష్ఠిలో కొందరు "వెంకటేశ్వరరావు గారు ఇంకా పరిషత్ పోటీలకు రావడం న్యాయంగా లేదు. ఆయన పోటీకి రాకుండా నిషేధించాలని ప్రతిపాదించారట. దానికి ఆయన అనుస్పందిస్తూ నాకు ఉన్నత స్థానం ఒకళ్ళు ఇచ్చింది కాదు,

దయాధర్మంగా. కష్టపడి సుశిక్షణ పొంది నేనుగా సంపాదించుకున్నాను. బహుమతులు పొందాలనే తాపత్రయంతో నేను పోటీలకు రావడం లేదు. మంచి నటులను తయారు చేయడం నా ఆశయం. నన్ను చూసి మీరు భయపడకూడదు. బాగా నటించాలన్న కసి పెంచుకోవాలి మీరు. మీ ముందు నేను ఓడిపోయే రోజు వచ్చేవరకు నేను ప్రతి పరిషత్తుకు వస్తూనే ఉంటాను" అన్న సమాధానం ఇచ్చి ప్రతిగా అభినందనలు సంపాదించుకున్నారు.

మరొక వ్యక్తిగత విషయం ఏమిటంటే ఆయన విశాఖపట్నంలో ఉన్నన్నాళ్ళు, కనకమహాలక్ష్మి వారి ఆరాధ్య దేవత- ఆమెకు నమస్కారం పెట్టకుండా ఒక్కమారు స్టేజి మీదకి ఎక్కలేదట. ఒకమారు పరాకులో మరిచిపోయి మేకప్ చేసుకున్నాక హఠాత్తుగా గుర్తుకు వచ్చి, ఆ ముస్లిం మేకప్ లోనే మోటార్ సైకిల్ మీద వెళ్లి దేవతకు కొబ్బరికాయ కొట్టి మరీ వచ్చారట. అలా తన మనవరాలుకు 'కనకమహాలక్ష్మి' అని పేరు పెట్టుకోవడమే కాకుండా తనకు ఇష్టమై వ్రాయించుకున్న ఒక నాటకానికి ముందు కనక పేరు వచ్చేటట్లుగా 'కనకపుష్యరాగం' అని నామకరణం చేయించారట. 'నా బాబు' నాటికలో వారి నటనను చూసిన మీదటనే డివి సుబ్బారావు గారు 1955లో మచిలీపట్నంలో వీరికి 'నటరాజు' అనే బిరుదుతో మెచ్చుకున్నారు, సత్కరించారు. అలా నా బాబు వారి జీవిత తపః ఫలం.

'నాటక సంపత్తి - సినిమా సంప్రాప్తి' అన్న అధ్యాయంలో ఈనాటి నటీనటులు తెలుసుకోవలసిన ఒక చక్కని విషయం.. ఒకసారి వెంకటేశ్వరరావు ఇద్దరుమిత్రులు సినిమా సెట్‌కు రాగానే సీన్ పేపర్ అడిగారట. ఎందుకండీ, మీ వేషానికి డైలాగులు లేవు కదండి అని అంటే, అలా కాదండి మూగవాడికి కూడా భాష ఉంటుంది. అతనికి మాటలు వచ్చి ఉంటే ఏం మాట్లాడుతాడో ఆ మాటలు మనమే వ్రాసుకోవాలి, అని పేపర్ అడిగి తీసుకుని ఆయా సన్నివేశాలకు తగినట్లు తన మూగ పాత్రకు తానే తగు మాటలు రాసుకొని ఇది కరెక్టే కదా అండి అని ఆ వాక్యాలను చూపించారట. సెట్ పక్కకు వెళ్లి ఆ వాక్యాలలోని భావాన్ని సంజ్ఞల ద్వారా, కళ్ళ ద్వారా సాత్వికాభినయంతో ఎలా పలికించాలో సాధన చేసి వచ్చి,నటించారట. ఈ మూగ చెప్పిన ముఖసాక్ష్యమే కథను మలుపు తిప్పి పతాక సన్నివేశానికి దారితీస్తుంది. ఈ సన్నివేశం వెంకటేశ్వరరావు గారి పాత్ర పట్ల వారి శ్రద్ధకు అద్దం పడుతుంది.

మరో ఆసక్తికరమైన విషయం.. 1960లో మద్రాసుకు నాటకాలు వేయడానికి వెంకటేశ్వరరావు గారు వచ్చినప్పుడు అతని నటసహచరుడు రాజబాబు సినిమా ప్రవేశం దొరకక కష్టాల్లో ఉంటే అతనికి నెల రోజులకు సరిపడా భోజనం టికెట్లు కొని జేబులో పెట్టారట. ఆ తర్వాత రోజుల్లో "గురువుగారు, మీకేం కావాలో చెప్పండి, నన్ను రుణం తీర్చుకోనివ్వండి అన్న రాజబాబుతో ఏం వద్దన్నా పట్టు పట్టి బలవంతం చేసిన మీదట, సరే! నా దగ్గర టేప్ రికార్డర్ లేదు అది కొనివ్వు. నా రేడియో నాటకాలు రికార్డ్ చేసుకుంటాను'' అన్నారట వెంకటేశ్వరరావు. క్షణాల మీద టేప్ రికార్డర్ తెప్పించి గురువుగారి రుణం తీర్చుకున్నాడు పుణ్యమూర్తుల రాజబాబు.

"నాటకం అతని స్వరూపం, సినిమా అతనికి అపురూపం". నాటకానికి అతను పెట్టని కోట గోడ- సినిమాకు అతను కట్టని వారధి''

విశ్వవిద్యాలయం - గురుపీఠం అన్న అధ్యాయంలో 1961లో థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ నెలకొల్పబడినప్పుడు స్టేజ్ డైరెక్టర్‌గా నియామకం కావడానికి ఇంటర్వ్యూ బోర్డ్‌కు "నాకు అవకాశం ఇచ్చి చూడండి. నేనంటే ఏమిటో నా సామర్థ్యం ఏమిటో చూపిస్తాను" అని నాటకాల పట్ల తనకు ఉన్న అంకిత భావాన్ని ఆనాడే స్పష్టం చేశారు. అటు తర్వాత కళారంగానికి సంబంధించిన పెద్దలు ఎవరైనా ఊళ్లోకి వచ్చారని తెలిసినప్పుడు వారిని ప్రత్యేకంగా డిపార్ట్మెంట్కు ఆహ్వానించి రిహార్సల్స్ చూపించే వారట. నాటక ప్రదర్శనం గొప్పగా తయారవ్వడానికి ఎటువంటి వాళ్ళనైనా ప్రాధేయపడి పరిస్థితులు సానుకూలం చేసుకునే వారట. ఒక్క రోజులో కొత్త వ్యక్తికి శిక్షణ ఇచ్చి నటుడుగా తయారుచేసి ప్రదర్శనలు రక్తి కట్టించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ఒకే పాత్రను పలుమార్లు ప్రదర్శించవలసివచ్చినా ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు కొత్తదనం కొట్ట వచ్చినట్లుగా కనిపించే విధంగా తన నటనను తీర్చిదిద్దుకునేవారు.

హాలీవుడ్ ప్రఖ్యాత నటుడు క్లార్క్ గేబిల్ చెప్పిన మూడు ప్రత్యేకతలుగా మన వెంకటేశ్వరరావు గారు చెప్పేవారు. అవి -

1. డైలాగు స్పీడ్ : తగినంత వేగంలో వరవడిలో ప్రతి సంభాషణను వెలువరించడం.

2. మాడ్యులేషన్ : ప్రతి మాట వెనుక గొంతులో ఎంత తీవ్రత నిదానం ఉంచాలో తెలుసుకొని ఆ విధంగా 'ఉదాత్తానుదాత్తాలు' చూపటం.

3. డిక్షన్ : స్పష్టంగా మాట్లాడటం, మాట వెనుక భావాన్ని స్ఫురింపజేయడం ... ఈ మూడు ప్రత్యేకతలు. అలా పాత్రలకు ప్రాణ ప్రతిష్ట చేసి నాటక ప్రదర్శనను మహోన్నత శిఖరాలకు తీసుకు వెళ్లిన మహానటుడు ఆయన.

నాటక ప్రేక్షకులను ఆకర్షించడం ఆకట్టుకోవడం గురించి చెప్పాలంటే ప్రతి ప్రదర్శనకు ఆనాటి వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, అన్ని శాఖల ప్రొఫెసర్లు సకుటుంబ సమేతంగా వచ్చేవారట. థియేటర్ ఆర్ట్స్ ప్రోగ్రాం అంటే ఒక ఇంటర్ డిసిప్లినరీ కోర్సుగా ఆయన ఆధ్వర్యంలోనే పేరు తెచ్చుకుంది. వెంకటేశ్వరరావు గారి ఔదార్యం విషయానికి వస్తే థియేటర్ డిపార్టుమెంట్ మేకప్ ఆర్టిస్ట్ రామచంద్రరావు స్వర్గస్తులైనప్పుడు వారి కుటుంబ సభ్యుల సహాయార్థం గురజాడ కన్యాశుల్కం నాటకం ప్రదర్శన ఏర్పాటు చేయించి దానికి దర్శకత్వం వహించడమే కాకుండా గిరీశం పాత్రను ధరించారు వెంకటేశ్వరరావు గారు. కన్యాశుల్కాన్ని క్లుప్తీకరించి తన దర్శకత్వంలో మలిచిన తీరు ఆ నాటకానికి ఎంతో వన్నెతెచ్చింది. గురజాడ శతజయంతి సందర్భంగా ఆ నాటక ప్రదర్శన మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది, 1963 తర్వాతనే.

తెలుగు నాటకరంగ చారిత్రక ఘట్టం ఒకటి ..కలకత్తాలో ఆంధ్ర సంఘం వారు ప్రప్రథమంగా నాలుగు రోజుల తెలుగు నాటకోత్సవాలు జరిపినప్పుడు వెంకటేశ్వరరావు గారి దర్శకత్వంలో "దైవశాసనం, కీర్తిశేషులు, కన్యాశుల్కం, రాజీవం" అన్న నాటక నాటికలు ప్రదర్శించారు. ఒక రోజు శంభు మిత్ర చూసి "నాటకంలోని వివిధ సన్నివేశాలను దాదాపు ఏడెనిమిదింటిని ఒకే 'బాక్ కర్టెన్'

రక్తికట్టించేటట్లు ప్రదర్శించిన నేర్పును శంభు మిత్ర ఎంతో ప్రస్తుతించారు. "మేము ఈనాటిక ఆడాలంటే ఎన్నో హంగులు ఉంటే తప్ప వేయలేము. దర్శకుడుగా నటుడుగా ఏ టెక్నిక్‌ను ఉపయోగించని మీ టెక్నిక్ అద్భుతం" అన్నారట ఆయన.

వెంకటేశ్వరరావు గారు తీర్చిదిద్దిన కె.విజయలక్ష్మి కనకపుష్యరాగం, కొడుకు పుట్టాలా. పావలా నాటికల ద్వారా శ్యామలను నాటక రంగానికి పరిచయం చేసిందీ కొన్ని వందల నాటకాలలో నటింపజేసి వేల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చిన అగ్రశ్రేణి నటీమణులుగా తీర్చిదిద్దిన ఘనత వెంకటేశ్వరరావు గారిదే.

రేలంగి - కొడుకు పుట్టాల నాటికను ఆయన కోసం ప్రత్యేకంగా విశాఖపట్నం వచ్చినప్పుడు డ్రస్ రిహార్సల్స్ చూపించారట. రేలంగి నాటక ప్రదర్శనను చూచి వెంకటేశ్వరరావు గారికీ, నటీనటులకి అందరికీ పేరుపేరునా పాదాభివందనం చేస్తే గాని వారి మనసు సంతృప్తి చెందలేదట. నా జీవితంలో ఈ ప్రదర్శన చూడగలడం ఒక మరుపురాని ఘట్టం అన్నారట రేలంగి. త్రివేణి నాటకం అయితే జాతీయ సమైక్యత మీద రాయబడిన నాటకం ఇంటర్ యూనివర్సిటీ మల్టీలింగ్వల్ కాంపిటీషన్లో ఢిల్లీలో ప్రదర్శించడానికి వెళ్తూ ఆ నాటికను రైలులోనే చదువుకోవడం, పాత్రలు సెలక్షన్, ప్రదర్శనకు పూర్వ రంగం అంతా సిద్ధం అయిపోయిందట. అక్కడ ప్రదర్శన దిగ్విజయంగా జరిగి ఉత్తమ ప్రదర్శనకు బహుమతి ఒక్కటే కాకుండా ఉత్తమ దర్శకుడుగా మిశ్రోకు ఉత్తమ నటుడుగా, వంకాయలకు ఉత్తమ ఉపనటుడిగా బహుమతులు వచ్చాయట.

వెంకటేశ్వరరావు గారు తన నాటక బృందాలను వారి మానసిక ఉల్లాసం కోసం మనోరంజన కోసం దగ్గర ప్రదేశాలకు తీసుకువెళ్ళి, పర్యాటక స్థలాలు చూపించేవారట. అలా తిరుపతి హైదరాబాద్ కలకత్తా ఢిల్లీ ఆగ్రా సందర్శన చేయించి వాళ్లతో ఆత్మీయత పెంచుకునేవారు. వాళ్లలో వాళ్లకు సంఘీభావం లాంటి సల్లక్షణం ఏర్పడడానికి ఈ క్రియ దోహదం చేసేది.

అక్షర లక్షలు విలువ చేసే మరొక మాట- కొడుకు పుట్టాల నాటికలో తన కొడుకు ప్రసాదుకు ఒక వేషం ఉంది. అది తాగిన వాడి పాత్ర. నువ్వు ఎప్పుడైనా తాగావా ? అని అడిగారట, అతడికి ఇలాంటి దుర్వ్యసనం లేదని స్పష్టంగా తెలిసి కూడా, కొడుకు బిత్తరపోయి తండ్రి వంక చూస్తే ... రా నాతో ! ... అని కల్లుపాకల దగ్గరకు తీసుకుపోయాడు. ఆ తండ్రి కొడుకులు అక్కడ తాగి తూగుతున్న వాళ్లను కొద్దిసేపు గమనించి చూడమని... వాళ్లకు నరాలపటుత్వం ఉండదు, మాటల్లో ద్విత్వాక్షరాలు పలకలేరు. ఈ విషయం ప్రత్యక్షంగా గమనించాలి. "జీవితంలో పాత్రలను పరిశీలించి నేర్చుకోవాలి. మనం జీవితమే మనకు గురువు" అని హితోపదేశం చేశారట. రాగరాగిణిలో అన్నదమ్ములుగా వేశారు ఆ తండ్రి కొడుకులు. కొడుకు 'అన్న చనిపోయినందుకు ఏడవాలి. ప్రసాదుకు అది చేతకావడం లేదు. అప్పుడు అబ్బాయీ, నేను పోయినాను అనుకోరా.. బాగా ఏడు అన్నారట కొడుకుతో. ఇంకేముంది అంతే ! ఆ మాటలకు ప్రసాదుకు దుఃఖం పొంగిపొర్లుకు వచ్చింది. సన్నివేశం రక్తికట్టింది.

మరొక విషాద సన్నివేశం సందర్భం. నటుడు మిశ్రో తన తొలి బిడ్డను కోల్పోయినప్పుడు ప్రదర్శన ఆపు చేయవలసిన పరిస్థితి. అయినా ప్రేక్షకులకు నిరాశ కలగకూడదని దుఃఖాన్ని కడుపులోనే గొంతులోనే దిగమింగుకొని నటింప చేశారు. ఆ సందర్భంలో వెంకటేశ్వరరావు గారు 'నీకు పాదాభివందనం చేస్తున్నాను' అనడము మిశ్రో జీవితంలో మరుపు రాని ఘట్టం. తనకంటే తన శిష్యులు నటనలోనూ దర్శకత్వంలోనూ మించిపోతున్నారని గర్వపడడం ఆయన జీవించి ఉండగానే జరగడం ఎంత అదృష్టం ! ఒక పరిషత్తులో ఉత్తమ దర్శకుని బహుమతి తనకు కాదని తన శిష్యుడు డీన్ బద్రుకు ప్రకటించినప్పుడు బద్రుని కౌగిలించుకుని గురువుని మించిన శిష్యుడువై, నా పేరును మరింత పెంచినందుకు గర్విస్తున్నాను'' అంటూ ప్రశంసలతో ముంచెత్తిన ఔదార్యం వారిది. దొంగ వీరడు నాటకంలో రాంబ్రహ్మం పాత్ర కోసమే మీరు పుట్టారని ఎవరో అంటే ..ఆయనకు ప్రత్యర్థి అయిన మాచినేని వెంకటేశ్వరరావును ప్రస్తావిస్తూ నాకంటే ఆ నటుడు బ్రహ్మాండంగా చేస్తాడు'' అని చెప్పడం వారి వ్యక్తిత్వ ఔన్నత్యం వినయ శీలత. ఆయన అభిమానులకు గుర్తుండిపోయే విషయం.. కీర్తిశేషులు పొట్టి ప్రసాద్ "నటన కోసమే నటించాడు తప్ప కీర్తి డబ్బు ఇలాంటి వాటికోసం కాదు'' ఆయనకు అరగంటే విరామం ఇచ్చినా సరే ఆరు నెలల శిక్షణ ఉంటే ఎంత మార్పు చేయడానికి ప్రదర్శనకు నిండుతనం తీసుకురావడానికి వీలుందో అంతా అరగంటలోనే నిపుణంగా చేసి చూపిస్తారు. ఆయనకు పూచిక పుల్ల, లేకపోతే గడ్డిపరక ఇవ్వండి చాలు నాలుగు క్షణాల్లో దాన్ని మంచి నటుడుగా మలుస్తారు. దర్శకత్వంలో ఆయన ప్రతిభ అంత తిరుగులేనిది అంటారు ... పొట్టి ప్రసాద్.

సాక్షి రంగారావుగా మనందరికీ తెలిసిన వ్యక్తే. వెంకటేశ్వరరావు గారు గురించి ఒక సందర్భంలో.. "వందనాటకాలు వేయడం కంటే పది మంచి నాటకాలు చూస్తే చాలు. పది మంచి నాటకాలు చూడడం కంటే ఒక మంచి నాటకం పురిటి నొప్పులు పడుతున్నప్పుడే మమేకం అయిపోయి తొలి రిహార్సల్స్ నుంచి ప్రదర్శన వరకు చూచి క్షుణ్ణంగా మనసుకు పట్టించుకోవడం అంతకన్నా మంచిది. అదే నేను అప్పుడు చేసిన పని. అదేనా వృత్తికి పెట్టుబడి అయింది' అంటారు పెళ్లి పందాలు అన్న నాటికలో తన మొదటి అనుభవం గురించి చెబుతూ.

మన నటరాజు వెంకటేశ్వరరావు గారు నటనలో స్పార్క్ ఉండి, ముందుకు రావడానికి సందేహిస్తున్న వాళ్లను కవ్వించి మరీ నటనా రంగంలోనికి తీసుకురావడం వారిదైన ప్రత్యేక శైలి, పద్ధతి. బాగా పేరు వచ్చాక ఆయనకు, ఆయన నాటికలకు ఉత్తమ బహుమతులు ఇస్తే.. నాకు బహుమతులు ఇవ్వకండి, ప్రదర్శనలు ఇవ్వనివ్వండి. అంతే చాలు! యువతీ యువకుల దారికి నేను అడ్డు రాను'' అని రంగస్థలం నుండి సవినయంగా మనవి చేసుకున్న ఉదాత్తుడు వెంకటేశ్వరరావు.

ఇదే అధ్యాయంలో మిశ్రో.. వెంకటేశ్వరరావు గారి గురించి, ఆయన పద్ధతి గురించి చెబుతూ "అబద్ధం ఆడి ఆ క్షణాన నమ్మించడం అన్నది ఒక నాటక ప్రక్రియగా ఆయన తన శిష్యులకు నూరి పోసేవారు" అంటారు. పిఠాపురం బాబి "చతుర్విధ అభినయ పారంగతుడు, త్రిగుణాత్మకుడు

అయినా వ్యక్తికి పరిశీలన అవగాహన ఆచరణ అన్న మరో మూడు లక్షణాలు కూడా తోడౌతాయి.. ఆయనలో'' అంటారు కె.యస్.టి.శాయి వెంకటేశ్వరరావు గారి గురించి. పరిషత్ వ్యవస్థకు ప్రచారం గొప్పతనం తెచ్చి పెట్టిన కళాకారుల్లో ప్రధములు ఆయన అంటారు ఆర్ వి చలం.

ఆధునిక నాటక రంగానికి యుగపురుషుడు, ఔత్సాహిక నాటక రంగాన్ని తీర్చిదిద్ది జీవం పోసిన ఉద్ధారకుడు'' అంటారు నాటకాన్ని పవిత్ర గ్రంథం గా భావించి రంగస్థలంనే దేవాలయంగా భావించి రచయిత భావాన్ని నాటకంలోని సారాన్ని మనోరంజకంగా అందజేయాలనే తపనతో తపస్సు చేసేవారు- మా గురువుగారు'' అంటారు ఆంధ్ర నాటకరత్న డీన్ బద్రు. "నాటక రంగంలో మనం చేసేది స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞం. ఈ యజ్ఞం చేస్తూనే దేహ చక్రంలో దేహాంతర ప్రాప్తి లేకుండా శ్రీ నటరాజులో ఐక్యమైన వారు వెంకటేశ్వరరావు గారు'' అంటారు డబ్బీరు రమాకాంతరావు. నటనలో తన ప్రతిభతో సమాజ,ప్రజా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ, పోలీసు సంక్షేమ నిధికి, గురజాడ స్మారక కళామందిరానికి ధనాన్ని పోగుచేసి ఇచ్చిన వెంకటేశ్వరరావు గారి వంటి అంకిత భావం, అనన్య భక్తి ఉన్న మనిషి దొరకడం నాటక రంగం యొక్క తపఃఫలం. ఆయనలా శిక్షణ ఇవ్వగల దర్శకత్వంలో మెలకువలు సున్నితంగా బోధించగల గురువు లభించడం నాటక రంగంలోని విద్యార్థుల అదృష్ట విశేషం. నాటక రంగం చేసుకున్న పూర్వపుణ్యం. ఆయన హృదయం- ఈ ప్రపంచమే ఒక నాటక రంగం అనే అభిప్రాయాన్ని ఎప్పుడూ స్పందిస్తూ ఉండేది. ఈ రంగానికి అంకితం అయిపోవడం ఆయన ఆత్మలక్షణం. అలోకిక నాటక ఆనందం ఏదో ఆయనలో దివ్యత్వం ఎప్పుడూ ఆవరించి ఉండేది.

ఆంధ్రదేశంలో మొట్టమొదటి నాటక శిక్షణాలయ స్థాపనకు ముఖ్య కారకుడైన కూర్మా వేణుగోపాల స్వామి నాయుడు గారు, దానికి అది గురువైన శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు గారు అందించిన స్ఫూర్తితో ఆంధ్ర నాటక రంగం మరింత కీర్తిమంతం అయ్యింది.. అవుతూనే ఉంటుంది'' అంటారు ఈ గ్రంథ రచయితలు.

నూతన ప్రయోగాలు **116** సన్మానాలు అన్న అధ్యాయంలో "తన **30**వ ఏటనే నూరవ గౌరవాన్ని పొందిన వెంకటేశ్వరరావు గారు గర్వపడడం గురించి .."నటుడికి మంచి కాదు కానీ గర్వపడే నటుడు లేకపోవడం ఆంధ్రదేశానికి మంచిది కాదు అంటారు. గౌరవ ప్రతిష్టలు ఉన్నత శిఖరాలను తాకినా, వ్యక్తిగా పతనమైన మహానటుడు దేశానికి వ్యర్థం. సమాజానికి వ్యర్థం. సామర్థ్యపు పునాదుల మీద సత్ప్రవర్తన సత్ శీలం నిలిపిన నటుడే దేశం సమాజం కోరే మహానటుడు అవుతారు'' అంటారు.

ఇంతటి మహోన్నతమైన నట శిఖరాలను అధిరోహించిన మనిషి లేని లోటు మన రాష్ట్రానికి దేశానికి ముఖ్యంగా నటలోకానికి తీరని లోటు. వారి ప్రతి కదలిక వారి నోట వెంట వచ్చిన ప్రతి మాట, వారి చేతుల్లో రూపం దిద్దుకున్న ప్రతి నాటకం దర్శించే క్షణాలు వేలాది లక్షలాది మంది జీవితాల్లో అపూర్వాలయ్యాయి. వారి నటన నాటక రంగంలో కొత్త అధ్యాయాన్ని తెరిచింది. వారి పోకడలు కళా సరస్వతికి నూతన ఆభరణాలయ్యాయి. వారి మార్గాలు ఔత్సాహికులకు రాచ బాటలు

అయ్యాయి.

రచయితలకు థీమిచ్చి దగర కూర్చొని సంభాషణలు ఎప్పటికప్పుడు తను అనుభవిస్తూ పలువరిస్తూ సరిచూచుకుంటూ సరి చేసుకుంటూ రాయించుకోవడం మరో ఎత్తు. అలా ఆయనతో కలిసి పనిచేసిన ప్రఖ్యాత రచయితలు ప్రఖ్య శ్రీరామ మూర్తి, కొర్రపాటి గంగాధరరావు బెల్లంకొండ రామదాసు కొడాలి గోపాలరావు గొల్లపూడి మారుతీ రావు, రాఘవ, గణేష్ పాత్రో.

తాను నాటకాల కోసం ఎక్కడికి వెళితే అక్కడికల్లా నన్ను తీసుకుపోయి చర్చిస్తూ నటించి చూపుతూ రచన చేయించేవారు" అంటారు గొల్లపూడి మారుతీరావు.

నాటక రచయిత కాశీ విశ్వనాథ్ వెంకటేశ్వరరావు గురించి చెబుతూ "ఆయన తెలుగు నాటక రంగానికి ఉండే పరిమితుల్ని, ప్రదర్శన అవకాశాలను మాత్రమే దృష్టిలో ఉంచుకొని నాటకాన్ని ప్రదర్శించేవారు. చాలా పరిమితులకు లోబడి ఉన్న తెలుగు రంగస్థలం మీదే నాటకాన్ని బతికించారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఆయన చాలా ప్రాక్టికల్ దృష్టి ఉన్న ప్రయోక్త.

వెంకటేశ్వరరావు గారు మంచి వక్త. నాటక సమాజల వాళ్ళు ప్రదర్శనకారులు కాలేజీ సాంస్కృతిక ఉత్సవాల నిర్వాహకులు ఆయనను ఉపన్యాసాలు ఇవ్వమని ఆహ్వానిస్తూ ఉండేవాళ్ళు. ఆయన నటన గురించి అనర్గళంగా మాట్లాడేవాడు. ఆయన ఉపన్యాసాలు నటీనటులకు సమాజ నిర్వాహకులకు కొత్త ఉత్సాహంగా ఉత్తేజం కలగడమే కాకుండా సామాన్య శ్రోతలకు నాటకాన్ని ఎలా అర్థం చేసుకోవాలో, అవగాహన చేసుకోవాలో, రసజ్ఞత పెంచుకోవడం అనే విషయాలు స్ఫూర్తిదాయకంగా తెలిసి వచ్చేవి.

ఏ. వి. ఎన్. కాలేజీ డ్రమిటిక్ అసోసియేషన్ వారు తమ వార్షిక సమావేశాలకు ప్రధాన అతిథిగా ఆహ్వానించిన సందర్భంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి "బాగా చదువుకోండి. మొదటి తరగతి మొదటి ర్యాంకు తెచ్చుకోండి ప్రతి అంతస్తులోను. అప్పుడు మీ ఇష్టం. ఎంతైనా అల్లరి చేయండి. మంచిగా అల్లరి చేయండి. మీకు సంతోషం, చూసేవాళ్ళుగా మాకూ సంతోషం" అని ముగించారట. వెంకటేశ్వరరావు గారు శ్రద్ధ వహించిన ముఖ్యమైన అంశాలు - **1.** నటులు, నాటక సమాజాల కృషిని ప్రోత్సహించడం. **2.** నటులను నటిమణులను తీర్చిదిద్దడం. **3.** ఉత్తమ నటీనటుల్ని ఇంకా మెరుగు పరచడం. **4.** వాచకం సాత్వికాభినయం లాంటి విశేష ప్రక్రియలను గురించి అనువర్తనం నేర్పడం. తన శిష్యుల్ని తయారు చేయడంలో ఈ విషయాలన్నీ ఆయన సదా దృష్టిలో ఉంచుకున్నట్లు కనిపిస్తుంది. ఆయన సంకల్పం, నిర్మాణాత్మకమైన కృషి బహుదొడ్డది. ఎప్పటికీ వీగిపోనిది. నిజాయితీగా పనిచేయడం, ఏమాత్రం అలసత్వానికి చోటు ఇవ్వకపోవడం, శరీరాన్ని మనసును వంచి పని చేయించడం ఇవీ ఆయన సూత్రాలు.

న్యాయనిర్ణేతగా ఆయన చాలా నిక్కచ్చిగా పనిచేసేవారు. నటనా ప్రావీణ్యానికే మొదట మార్కు ఇవ్వడంలో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదు. వ్యక్తిగత మర్యాదలు మన్ననలు ఆశ్రిత జన పక్షపాతం అనేవి ఆయనకు ఏ కోశానా లేవు. తనకు నమస్కారం చేయని నటులను చిన్నతనంతో చూడడం

గాని, వారి నటనా సామర్థ్యం గణనీయమైంది అయినప్పుడు బహుమతి ఇవ్వకుండా ఉండడం గానీ ఆయన ఎప్పుడూ చేయలేదు.

కీర్తిశేషులు జవ్వాది రామారావు గారు తన జ్ఞాపకాలలో ఇలా రాశారు "ఒకరోజు శ్యాంసుందర్ ప్రదర్శించిన 'ఇది ఆత్మహత్య కాదు' నాటికలో అతని నటన ఎలా ఉంది? అని అడిగితే, చాలా బాగుందన్నారు వెంకటేశ్వరరావు గారు. వెంటనే లేచి ఆయన నాటికలో ఆ నటుడు చెప్పిన ఓ డైలాగ్ చేసి చూపించారు. అదే తానైతే ఎలా చేస్తారో చేసి, ఇదే డైలాగుని మిత్రుడు జి. ఎస్. ఆర్. మూర్తి అయితే ఎలా చేస్తాడో చూడు అని అదీ చేశారు. ఆశ్చర్యం ఒక నటుడిలో ఒక్క డైలాగు ముగ్గురు నటులు నటించే వైవిధ్యమైన నటన చేసి చూపించారు. పరిషత్ ఆఖరి రోజున పరిషత్ పెద్దలు ఏదైనా ఏకపాత్ర చేసి చూపిస్తే నటీనటులు సమాజాల వారు ఆనందిస్తారు" అని అభ్యర్థించినప్పుడు, గిరీశం ఇనెస్పెక్టర్ జనరల్ మొదలయిన ఏక పాత్రలు చేసి ముగింపుగా ఔత్సాహిక నటుడు- కీర్తిశేషులు నాటకంలో మురారిగా పౌరాణిక నటుడు, మయసభలో రారాజు పాత్ర చేస్తే ఎలా చేస్తారో చేసి, మురారి చేసిన ఔత్సాహిక నటుడు రారాజు చేస్తే ఎలా ఉంటుందో రారాజు చేసిన పౌరాణిక నటుడు మురారి చేస్తే ఎలా ఉంటుందో చేసి చూపించారు. ఇది అక్కడి ప్రేక్షకులకు కళాకారులకు వారికి బహుమతి కన్నా విలువైన బహుమతి. అంతటి అపూర్వ అభినయం తిలకిచినందుకు వారంతా ముగ్ధులయ్యారు.


ప్రేక్షకులు టికెట్లు కొని చూసే సంప్రదాయం బలపడాలని గట్టిగా కోరుకునేవారు.

రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారు ఒక సందర్భంలో.. వెంకటేశ్వరరావుకు డాక్టరేట్, కళా ప్రపూర్ణ ఇవ్వకపోవడం విశ్వవిద్యాలయపు వారి దౌర్భాగ్యం అంటూ ఆయనకు ఆయనే సాటి. ఇతర దేశాల్లో ఇతర కాలాల్లో ఆయన కంటే మించిన నటులు ఉంటే ఉండవచ్చు కానీ ఆయన జీవితకాలంలో ఆంధ్రదేశంలో ఆయనకు మించిన నటుడు లేనే లేడంటే అది అతిశయోక్తి కానే కానేరదు అన్నారు. ఆయనలోని జీనియస్ ఏమిటంటే ఆయనకు కొత్త పద్ధతుల్ని నటనలో పాత పద్ధతులుగాను, పాత పద్ధతుల్ని కొత్త పద్ధతులుగానో చేసి చూపించగల ప్రతిభ ఉండేది. ఆయన లేకపోయిన లోటు ఆంధ్రదేశానికే కాక భారతదేశంలో కూడా లోటు" అని చెప్పగల సాహసం నాకు ఉంది అన్నారు రాచకొండ.

నటన నాటక రంగం, మొత్తం రంగస్థలంకి సంబంధించిన ఎన్నో విషయాలను ఒకే ఒక పుస్తకంలో పాఠ్యపుస్తకంగా అ నుండి క్ష వరకు ఎన్నో పాఠాలను ఈ ఒక్క గ్రంథమే ఇవ్వగలగడం, అది చదివి నేను పొందిన ఆనందం మీతో పంచుకోవడం నా ఉద్దేశ్యం. ఇంకా ఎన్నో విషయాలు చెప్పలేదన్న బాధ ఉన్నా కొన్నైనా మీతో పంచుకోగలిగిన ఆనందం బహు దొడ్డది. ఈ శతజయంతి సంవత్సరం విజయవంతంగా దిగ్విజయంగా అపురూపంగా అపూర్వంగా జరగాలని, ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలవాలని నా ప్రగాఢ ఆకాంక్ష.

-మల్లేశ్వరరావు ఆకుల

## గురుభ్యోన్నమః


శ్రీ యస్.కె.మిశ్రో
నటులు, దర్శకులు, రచయిత, ప్రయోక్త

-యస్.కె.మిశ్రో

రంగమార్తాండు డతఁడు

'నటరాజు' బిరుదాంకితుడు

శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు మహాశయుడు

ఒకానొక సన్మాన సభలో విజయవాడనుంచొచ్చిన ఓ నాటక ప్రముఖుడు తన ప్రసంగంలో మాష్టారి గురించి చెప్పిన మాటతో చప్పట్లతో ఆడిటోరియం దద్దరిల్లిపోయింది.

'అదిగో వినరా ఆ చప్పట్లు ! ఆ చప్పట్లే కదరా ఆకలిగొన్న కళాజీవికి పంచభక్ష్య పరమాన్నాలు' - శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ గారి కలం నుంచి జాలువారిన నాటకం "కీర్తిశేషులు'' లోని గీతా వాక్యాలు. ఈ మాటలు రంగస్థలం మీద మాష్టారు చెపుతున్నప్పుడు జనం పరవశించిపోయారు. నిజంగా రంగస్థలం మీద ఆయన మార్తాండుడే. శ్రావ్యమైన గొంతు, స్వచ్ఛమైన భాష (అది యాస అయినా సరే) చక్కటి ఉచ్చారణ. డైలాగుల్లో ఎంతటి వేగం వున్నప్పటికీ అదిరిపోయే స్పష్టత, భావప్రకటన, ఏ పాత్రలోనైనా యిట్టే ఇమిడిపోయే స్వభావం, సంభాషణ ఆయన వ్రాసుకున్నదా, నాటక రచయిత వ్రాసిందా అన్న సందేహం కలిగేది. అంత గొప్పగా Own చేసుకునేవారు మాష్టారు.

నేనోసారి నా మిడిమిడి జ్ఞానంతో మాష్టార్ని అడిగాను. "నాటకంలో మ్యూజిక్ ఫాలోయింగ్ వుంటే ఇంకా బాగుండునేమో కదా మాష్టారు ?'' అని ... దానికి మాష్టారు ఇలా చెప్పి నా నోరు మూయించారు. "మన మాటల్లోనే రిథిమ్, మ్యూజిక్ ఉందోయ్ మిశ్రో ! అదనంగా మ్యూజిక్ పెట్టి మాటను చెడగొట్టడమెందుకు ? అవసరమా ?'' నిజమే ! సంగీతం సన్నివేశాన్ని కృతకంగా మారుస్తుంది. వాస్తవ రూపాన్ని పాడు చేస్తుంది.

అప్పట్లో - అంటే నేను నాటకం రుచి మరిగేక నాకు వినిపించిన నాటక రంగ ప్రముఖులు ముగ్గురే ! శ్రీ బళ్ళారి రాఘవ, డా? గరికిపాటి రాజారావు మరియు శ్రీ కే. వేంకటేశ్వరరావు. అంతేకాదు, శ్రీ కే. వెంకటేశ్వరరావుగారి గురించి మరో విషయం విన్నాను.

ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీ కే. వి. గోపాలస్వామిగారు మాష్టారి నాటకం చూసేకనే, యూనివర్శిటీలో ఒక నాటక విభాగం ఉండాలని ఒక నిర్ణయం తీసుకున్నారనీ, మాష్టార్ని ఆహ్వానించి స్టేజ్ డైరెక్టర్‌గా నియమించారనీ. అది ముమ్మాటికీ నిజమయ్యుంటుంది. ఎందుకంటే - ఓపెన్ ఎయిర్ థియేటర్లో జరిగే అన్ని నాటక ప్రదర్శనలకు వారు తప్పనిసరిగా వచ్చేవారు. ప్రదర్శనను

ఆసాంతం చూసేవారు. అల్లరి చెయ్యడానికి వచ్చే విద్యార్థుల్ని అదుపు చేసి, అవసరమనిపిస్తే ఆ ప్రాంగణం నుంచే వెళ్ళగొట్టేవారు. పాలకుడు కళాప్రియుడైతే కళాకారులకు పండుగే !

థియేటర్ ఆర్ట్స్ వాళ్ళు నాటకం వేస్తున్నారన్న కబురు తెలిస్తే చాలు మేమంతా ప్రదర్శన చూడటానికి పరిగెత్తేవాళ్ళం. మాస్టారు కూడా ఊళ్ళో ప్రదర్శించే నాటకాలను ఆహ్వానం లేకుండా వచ్చి చూసేవారు. నేను నా సమాజంతో రైల్వే ఇనిస్టిట్యూట్ లో నాటకం వేశాను. వచ్చి, చూసి - మర్నాడు యింటి కొచ్చి డిపార్టుమెంట్ లో చేరవలసిందిగా ఆదేశించారు. నేననే కాదు ! - వీడిలో నటించే సత్తా వుంది, పనికొస్తాడు అనిపిస్తే చాలు - డిపార్టుమెంట్ లో చేరమని ప్రోత్సహించేవారు. రంగస్థలాన్ని పరిపుష్టం చెయ్యాలన్నదే వారి ఆశయం.

డిపార్టుమెంట్‌లో చేరిన కొద్ది కాలానికే 'త్రివేణి' నాటికలో ఢిల్లీ వెళ్ళే అవకాశం వచ్చింది. అది పూనా నేషనల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ వారి నిర్వహణలో జరిగిన ఫెస్టివల్. పద్నాలుగు భాషల్లో పోటీదారులున్నారు. పోటీలలో మా 'త్రివేణి' నాటికకు 'ఉత్తమ ప్రదర్శన', నాకు 'ఉత్తమ నటుడు' బహుమతులొచ్చాయి. ఎవరి సంగతి ఎలా వున్నా నేను మాత్రం లోలోపల తబ్బిబ్బై ప్రపంచాన్ని గెలిచినవాడిలా పొగరు పెంచేసుకున్నాను. విశాఖపట్నం హిందూ రీడింగ్ రూంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. పట్టణ ప్రముఖులతో పాటు కళాభిమానులెందరో వచ్చారు. వారి మధ్య వేదిక మీద మాస్టారి ప్రక్కన కూచోవడం ... మనసు బెలూన్ లాగా గాలిలో తేలిపోతూ వుంది. సన్మానానంతరం సమాధానం చెప్పేందుకని మాస్టారు గొంతు సరిజేసుకున్నారు. ఏదేదో మాట్లాడేరు. ఒక్క ముక్క నా చెవికెక్కలేదు. ఈ సోది యిప్పుడంత అవసరమా అనిపించి విసుక్కున్నాను కూడాను. చివరాఖరికి ఉపన్యాసం ముగిస్తూ మా విజయ యాత్రను గురించిన మాటలు టూకీగా నాలుగుముక్కల్లో తేల్చేశారు. నా బెలూన్ కి చిల్లులు పొడిచారు. అదెలాగంటే "ఢిల్లీలో జరిగిన ఆ పోటీలు ఏమంత చెప్పుకోదగ్గవి కావు. ఇక్కడ మన విశాఖపట్నంలో ప్రతి ఏడాది మన కంచరపాలెంలో జరిగే మహాత్మాగాంధీ నాటక పరిషత్ స్థాయికి మించిందేం కాదు. కాబట్టి, ఆ మాత్రందానికంత ఆర్భాటం అవసరం లేదు. ఎదుగుతున్న వాళ్ళకి ఈ గెలుపు అంత ఆరోగ్యకరం కాదు'' - నా ఉత్సాహమంతా నీరు గారిపోయింది. నా కార్యక్రమం ముగిసేక మాస్టార్తో అన్నాను- 'ఏం మాస్టారూ! ఇది నాకు సన్మానమా ? అవమానమా ?' ... మాస్టారు శ్రీకృష్ణ పరమాత్మలా నవ్వి నన్ను ఓదార్చేరు. 'మిత్రో! నటుడు నిత్య విద్యార్థి ! నాటకాలు నువ్వేం నాతోనే మొదలెట్టలేదు! నీకంటూ ఒక సమాజం వుంది గనక, ముందుముందు కూడా నాటకాలు వేస్తావు. అలాంటి నువ్వు గెలుపును నెత్తికెత్తుకుని తిరగడం నీకు క్షేమం కాదు. గెలుపన్నది నిన్న తిన్న భోజనం. ఇవాల్టి పునాదుల మీద రేపటికి భవంతులు కట్టవలసిన మీ కుర్రాళ్ళు సన్మానాలకు ఎగబడకూడదు ... మాటలు ఆ క్షణాన నన్ను సముదాయించలేకపోయినా, తర్వాత్తర్వాత ఆ నీతి పాఠమే నన్ను నిశ్చింతగా నడిపింది. గెల్చినా, ఓడినా పట్టించుకోని ఒక గొప్ప గుణాన్ని నేర్పింది.

మరోసారి ...

యూనివర్సిటీ తరపున ఢిల్లీలో కామన్వెల్త్ యూత్ ఫెస్టివల్ జరిగింది. అక్కడ సౌండ్ అండ్ లైట్ ప్రక్రియ ఆధారంగా ప్రదర్శించిన "స్వాతంత్ర్య సంగ్రామ పోరాటం" నాటకం చూశాను. ఆ టెక్నిక్ తో ఇక్కడ విశాఖపట్నంలో నాటకం చేస్తే బావుండునన్న కోరిక గమ్మత్తుగా తీరిపోయింది. ఎలాగంటే - సెయింట్ ఆంథోని చర్చ్ పూర్తిగా పడగొట్టి, పునర్నిర్మాణం చేసి, దాని ప్రారంభోత్సవానికి ఏదైనా కార్యక్రమం ఘనంగా చేయాలన్న తలంపులో వున్నారు యాజమాన్యం పెద్దలు. మిత్రులు ఆడారి జోసెఫ్ గారి వల్ల ఆ అవకాశం నాకొచ్చింది. "జీసెస్ క్రైస్ట్" నాటకం రూపుదిద్దుకుంది. వందమంది కళాకారులతో ప్రదర్శించాము. ఈ విషయం మాష్టారికి చెప్పలేదు. మాష్టారు నాటకానికొచ్చి చూశారు. మర్నాడు ఇంటికొచ్చి ఆయన మోటరు సైకిల్ మీద మధ్యాహ్న భోజనానికి తీసుకెళ్ళేరు. ఓ గంటసేపు ఎడాపెడా వాయించేశారు. అందులో బోలెడన్ని దీవెనలున్నాయి. పొగడ్తలున్నాయి.

"నిజమేనయ్యా ! ప్రత్యేకంగా క్రైస్తవ మతస్థుల కోసమే తయారైన నాటకం మిగిలినవాళ్ళు చూడకూడదా? విశాఖపట్నంలో అలాంటి బృహత్తర నాటకం ఇంతవరకు ఎవరూ వేసినట్టు దాఖలాల్లేవు. Illustrated Weekly లాంటి ప్రతిష్ఠాత్మకమైన పత్రికలు ఒక పేజీ కేటాయించవలసినంత వర్క్ చేశావు. కనీసం సాటి కళాకారుల్నైనా పిలవాలి కదా ..." సరియైన ప్రచారం యివ్వనందుకు ఎంతగానో వాపోయారు. శిష్యుల పట్ల గురువులకు ఎంతటి ప్రేమాభిమానాలుంటాయో ఆ సన్నివేశం చూస్తే అర్థమవుతుంది.

మాష్టారు ఒక విలక్షణమైన వ్యక్తి. ఏనాడూ ఎవరి మీద కేకలు వేయగా నేను చూళ్ళేదు. రంగస్థల కళాకారులంటే ఒక ప్రత్యేకమైన ప్రేమ. వారు నిస్వార్థపరులనీ, సంఘసంస్కర్తలనీ, వారిని కాపాడుకోవడం సమాజం బాధ్యతనీ - తన ఉపన్యాసాల్లో తరచు చెప్పేవారు. సందర్భమేమిటో ఖచ్చితంగా చెప్పలేను గానీ - ఓసారి మాష్టార్ని కలుద్దామని ఆయన రూం కెళ్ళాను. అప్పుడాయన, ఎవరో యిద్దరు పెద్దవాళ్ళతో సమావేశమై వున్నారు. ఆ పెద్ద వాళ్ళిద్దరు వేడి వాడి చర్చల్లో ఉన్నారు. మాష్టారేమో కూల్ గా ఇద్దర్నీ గమనిస్తున్నారు.

'ఏవంయ్యా వేంకటేశ్వరరావూ! నువ్వు నోరు మెదపవేమీ ? నువ్వేమంటావు?' వారిలో ఒకాయన అడిగేడు. మాష్టారు నిదానంగా, మెల్లగా జవాబిచ్చారు.

'ప్రేక్షక దేవుళ్ళు అంటారుగానీ - అది తప్పు. నా ఉద్దేశ్యంలో దేవుళ్ళు ప్రేక్షకులు కారు! రంగస్థల కళాకారులు ! దర్శకుడన్నవాడు విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేసినట్టు, నటులకు దైవత్వాన్ని ఆపాదిస్తాడు. ప్రేక్షకులు దిగువన - నటులు రంగస్థలం మీద. ఎత్తైన వేదిక మీద వుండి పూజలందుకుంటారు. భక్తులు పూజాదికాలను గమనిస్తూ, ఆ కథలోను, ఆ పాత్రల్లోను లీనమయిపోయి బాహ్య ప్రపంచాన్ని మరచి పోతారు" - ఎంత చక్కటి విశ్లేషణో గదా !

నటశిక్షణా కోర్సు రెండేళ్ళు పూర్తయ్యేక, దర్శకత్వ కోర్సులో మరో రెండేళ్ళు కొనసాగించాను. దర్శకుడి బాధ్యతల గురించి మాష్టారు చెప్పిన మాటలు నన్ను చాలా ప్రభావితుడ్ని చేశాయి. అందులో

కొన్ని యివి ...

సామాజిక స్పృహతో దేశకాల పరిస్థితుల్ని, తద్వారా ప్రజల్లో వస్తున్న మార్పుల్నీ పరిశీలిస్తూ వుండాలి !

నాటకం పరిపూర్ణంగా రూపుదిద్దుకోవాలంటే రచయిత, దర్శకుడు కలిసి పని చెయ్యాలి. దర్శకుడు రచయితకు మార్గదర్శనం చెయ్యలి. రచయిత తప్పనిసరిగా దర్శకుడి పెద్దరికాన్ని అంగీకరించాలి !

కథ, కథనం జీవితానికి ఎంత దగ్గరగా వుంటే అంత తీవ్రంగా ప్రేక్షకుల హృదయాలకు హత్తుకుంటుంది.

దర్శకుడు ప్రథమ ప్రేక్షకుడు ! వారి కుండవలసింది కామన్ సెన్స్ !! మంచిని పంచే నాటకం వైద్యుడిచ్చిన చేదు గుళికల్లాంటివి. పెద్దగా రుచించవు. బిడ్డకు తల్లి తినిపించినట్టుగా జాగ్రత్తగా బుజ్జగించి తినిపించాలి. ప్రేక్షకులు పసిపిల్లలు. నచ్చకపోతే మొహం చాటేస్తారు. మెచ్చేలా మనం నాటకం వేసి వారిని మనవైపు త్రిప్పుకోవాలి.

థియేటర్ ఆర్ట్స్‌లో చేరక మునుపు నా ఆలోచనా విధానం వేరేగా వుండేది. సరదా కోసమే తప్ప సదాశయమంటూ ఏమీ వుండేది కాదు. గురువుగారి చలవ వల్ల దారి తప్పిపోకుండా సరిదిద్దుకోగలిగేను. నటన గురించి కూడా కొన్ని సూచనలు, సత్యాలు చెప్పారు. అవి యివి ...

నటన నేర్పేది కాదు - నేర్చుకునేది!

నటుడు కావడానికి అర్హత ఆకాంక్ష మాత్రమే. అది వుంటే చాలు దానంతటదే దీక్షాదక్షతలు అలవడతాయి.

నటుడు నిత్యవిద్యార్థి. ప్రపంచమే అతని పాఠశాల.

చుట్టూరా వుండే ప్రపంచం, పరిసరాలు మనకు గురువులు.

నేర్చుకోవడానికి మనం సిద్ధంగా వుంటే అవే నేర్పుతాయి.

మాష్టారి ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. Enlargement Of Heart అన్నారు డాక్టర్లు. ఇక ఎంతో కాలం బ్రతకనన్న సంగతి ఆయనకు తెల్సివచ్చింది కాబోలు - మాష్టారు ఒక చిత్రమైన ఆశను బయటపెట్టారు. 'నా చివరి శ్వాస రంగస్థలం మీద తీసుకోవాలనుందోయ్! నటరాజు అనుగ్రహం వుండాలి !' అంటూ ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచారు. 'కొడుకు పుట్టాల' నాటిక ప్రదర్శన జింఖాన గ్రౌండ్సులో వేయడానికి తేదీ ఖరారయింది. అందులో మాష్టారు ఒక ముఖ్యపాత్రను వేసేవారు. తను ఆ వేషం వేస్తానని మారాం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి చూస్తే విషమంగా వుంది. మొత్తం ప్రదర్శన అపేయాలన్న నిర్ణయానికొచ్చేం. మా పట్టుదల విన్నాక మాష్టారు దారికొచ్చేరు. ఆయన వేషం ఇదివరకట్లో ఆచారి మాష్టారు కూడా వేశారు. ఆ విధంగా ప్రదర్శనకు అంతరాయం లేకుండా నాటిక ఆడటం జరిగింది. - మాష్టారు లేకుండా !

ఆరోజు - ప్రదర్శన ముగిసి తెరపడింది. డాక్టర్ ఆడమ్స్ వచ్చి చెప్పారు. మాష్టారు లేరని. నటరాజులో ఐక్యమయినారని. ఇది జరిగి అప్పుడే యాభయ్యేళ్ళయింది. మేమున్నంత కాలం మా మనసుల్లో నిలిచే వుంటారు.

'మాష్టారూ ! మీరు అర్థాంతరంగా వెళ్ళిపోయారు. మీ దగ్గర నేర్చుకోవాల్సింది చాలా వుంది. అక్కడే వుండండి. త్వరలో నే వస్తున్నాను' ...

-యస్. కె. మిశ్రో



కన్యాశుల్కంలో...



నటరాజు కె.వెంకటేశ్వరరావు ఫొటోకు ఆయన కుమార్తె శ్రీమతి గణేష్ పూలమాల వేస్తున్న దృశ్యం

## గురుదేవులు

-కె.విజయలక్ష్మి



నటనలో ఎన్నో మెళకువలను నేర్పించి, నన్ను మంచి నటిగా తీర్చిదిద్దిన మహనీయుడు నా గురువుగారు పితృసమానులు శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు గారు. నాటకాన్ని ప్రేమించి, పూజించి, శ్రద్ధగా నాటకరంగంలో జీవించడం నాకు నేర్పింది మా గురువుగారు శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావుగారే. అంత సమర్థుడైన మంచి గురువు దొరకడం -నా పూర్వజన్మ సుకృతం. ఆయన దగ్గర శిష్యరికం చేసిన వారంతా నా ఆలోచనతో ఏకీభవిస్తారని నాకు తెలుసు. ఆయన తయారుచేసుకున్న నటులు, దర్శకులు, రచయితలు అందరూ గురువుగారిని ఎంతగా ఆరాధిస్తారో నాటకాన్ని అంతగా ప్రేమిస్తారు. నాటకాన్ని మా ఆత్మ బంధువుగా చేసి మా అందరి జీవితాలకు ఓ అర్థాన్ని, పరమార్థాన్ని కలిగించింది మా గురువుగారు శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావుగారే. ఆయన విజయాల్ని మా విజయాలుగా చేసి ఈనాటి మా విజయాల్లో ఆయన భాగస్వామిగా జీవిస్తున్నారు. **నాటకం ఉన్నంతకాలం ఆయన జీవిస్తూనే ఉంటారు.** అందుకే ఈ వ్యాసంలో ఎక్కడా కూడా ఆయన్ని కీర్తిశేషులు శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు గారు అని అనలేదు. ఎందుకంటే నాటకం వల్ల ఆయన అమరుడు. ఆయన శిష్యులుగా మేమంతా అదృష్టవంతులం.

నమస్కరిస్తూ...

**కె.విజయలక్ష్మి**

(ఈ సంచికలో మేము కూడా కీ.శే. అనే పదం వాడలేదు. -సంపాదకులు)



ఎడమ నుండి కుడికి నిల్చున్నవారు మేకప్ సన్నిబాబు, కృష్ణచైతన్య, వంకాయల సత్యనారాయణ ఎస్.కె.మిశ్రో

కూర్చున్నవారు పి.జగన్నాథరావు, గణేష్‌పాత్రో కె.వెంకటేశ్వరరావు కె.విజయలక్ష్మి కె.వి.యల్

నా నాటక రంగ ప్రస్థానానికి తొలిగురువు -
నాటకరంగ కృషికి, పురోగతికి మార్గదర్శి -

## కుప్పిలి వెంకటేశ్వరరావు



-డా॥ కొల్లి మోహనరావు

తెలుగు నాటక రంగంలో లబ్ధప్రతిష్ఠులైన కె. వెంకటేశ్వరరావుగారి గురించి చదివినప్పటికీ, రేడియోలో విన్నప్పటికీ, రంగస్థలంపై ఆయన ప్రదర్శనలు చూసినప్పటికీ ఆయనతో ముఖాముఖి జరిగిన తొలి పరిచయం - నేను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో యం. ఎ. (హిందీ) తో పాటు డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ (యాక్టింగ్)లో చేరడానికి వెళ్ళినప్పుడే (1967). అప్పటికి నా నాటకానుభవం (1963-66) నాటికలలో నటించడం. 1 నాటికకు దర్శకత్వం వహించడం మాత్రమే.

యం.ఎ. (హిందీ)లో జాయిన్ అయిన తరువాత థియేటర్ ఆర్ట్స్ డిప్లొమాలో చేరదామని వెళితే ఇంటర్వ్యూ ఉంది. వెంకటేశ్వరరావుగారిని కలవమని చెప్పారు. ఆయన దగ్గరికి వెళ్ళి నమస్కరించాను. ఆయనను చూడగానే నా మనసు అసంకల్పితంగా ఆయన (నటరాజు) ముందు మోకరిల్లింది.

ఆయన నా గురించి వివరాలు తెలుసుకున్న తరువాత రెండు కాగితాలు ఇచ్చి, వాటిలోని డైలాగులు చదివి చెప్పాలన్నారు. అవి శ్రీ కె. వి. రమణారెడ్డి మరియు శ్రీ వేణు గార్ల "రాజీవం" నాటికలోని 'విద్యార్థి' మరియు 'ఖాజామియా' డైలాగులు అని ఆ తరువాత తెలిసింది.

విద్యార్థి : (రాజీతో) ఊర్వశి నీలకేశాలలో తురిమిన మందార పుష్పధామం మేఘసోపానాల మీదుగా దొర్లీ దొర్లీ వచ్చి ఇచట మానవాకృతి తాల్చింది ...

ఖాజామియా : (చేతిలో కమ్చీ, తాగి తూలుతూ ఉంటాడు) హెవ్రా హీడు ! పిల్లా మీద సేయి పడిందంటే నీది ప్రేణం ఖతం (రాజీతో) హెయ్ ! ఖాతాదార్కీ మస్కా కొట్టి ఇక్తా ఖుషీ చేస్తావుండావ్ ? ఛల్ ఛల్ (కమ్చీ ఛెళ్ళుమనిపిస్తాడు) ఛల్ రే బేటా ఛల్ (ప్స్...ప్)

వీటిని చదువుకుని డైలాగులు నోటికి వచ్చిన తరువాత చెప్పాలన్నారు. సరే అని ఆ పనిలో పడ్డాను. ఒక పావుగంట తరువాత ఆయన నా దగ్గరకు వచ్చి..... పై డైలాగు కాగితాలు తీసుకుని నాటిక కథ పాత్రలు, స్వభావాలూ, వారి మానసిక స్థితి, పారస్పరిక సంబంధాలు, సన్నివేశ సందర్భం వివరిస్తూ కాగితం మీద ఉచ్చారణ, ఆరోహణ, అవరోహణ, విరామం తదితర మార్గాలను సూచిస్తూ వాటి ఆధారంగా మళ్ళీ చదవమన్నారు.

మళ్ళీ డైలాగులు చదవడం ప్రారంభిస్తే కళ్ళ ముందు చీకటి తెరలు తొలిగి వెలుగు రేకలు విచ్చుకున్నట్టనిపించింది.

డిప్లొమా లో జాయిన్ అయ్యాను. రోజూ సాయంత్రం 6 గంటల నుండి 9 గటల వరకు క్లాసుల జరిగేవి. అవి ఎంతో ఉత్సాహవంతంగానూ, విజ్ఞాన దాయకంగానూ నడిచేవి. చాలా సందర్భాలలో 'రాజీవం' నాటక పసావన వచ్చేది.

1968 సం॥ఎల్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 'రాజీవం' ప్రదర్శించారు. మేమందరం దానిని చూసిన తరువాత ఆయన దాని గురించి వివరణాత్మక విశ్లేషణ చేశారు. అప్పటి నుండి 'రాజీవం' నాటికకు దర్శకత్వం వహించి ప్రదర్శించాలన్న కోరిక బలపడుతూ వచ్చింది.

'రాజీవం' నాటికను ప్రదర్శించే అవకాశం నాకు 1971 సంవత్సరంలో సర్ సి.ఆర్. రెడ్డి కళాశాల, ఏలూరు - నాటక సమితి అధ్యాపక అధ్యక్షుడిగా లభించింది. యస్. యస్. ఎన్. కాలేజీ, నరసరావుపేట వారు నిర్వహించిన అంతర్ కళాశాలల నాటికల పోటీలలో పాల్గొనే అవకాశం వచ్చింది. అందుకోసం కళాశాలలో ముందుగా ప్రదర్శన ఏర్పాటు చేసి కళాశాల అధ్యాపకులను, స్థానిక కళాకారులను ప్రత్యేకంగా ఆహ్వానించి నాటిక ప్రదర్శనపై - వారి వారి అభిప్రాయాలను నిస్సంకోచంగా వెలిబుచ్చుతూ, అవసరమైన మార్పులు చేర్పులు - సూచించమని కోరాను (ఈ పద్ధతిని కె. వెంకటేశ్వరరావు గారిని చూసి అనుసరించిందే)

మా ప్రయత్నాలు ఫలించి ఉత్తమ ప్రదర్శన, దర్శకత్వంతో పాటు మరో మూడు వ్యక్తిగత బహుమతులు లభించాయి. ఆ తరువాత 1971 లోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం యువజనోత్సవాలలో పాల్గొనే అవకాశం వచ్చింది. అక్కడ ఆయనను కలుసుకొని ప్రదర్శనకు ఆహ్వానించాను. ఆయన చూచి ప్రశంసాపూర్వకంగా భుజం తట్టి "బాగా చేశారు - శుభాకాంక్షలు" అంటూ ఆశీర్వదించారు. అక్కడ 'ఉత్తమ నటి' బహుమతితో పాటు మరో వ్యక్తిగత బహుమతి కూడ లభించింది.

ఆ తరువాత 'రాజీవం' నాటికను స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా మరియు గవర్నమెంట్ ఎంప్లాయీస్ కల్చరల్ అసోసియేషన్ తరఫున ప్రదర్శించి ఎన్నో బహుమతులు పొందటం ఆయన ఆశీర్వాదబలమే. ఈనాటికీ నన్ను వెన్నంటి నడిపిస్తోంది. 'రాజీవం'లో ఆయన ధరించిన "ఖాజామియా" పాత్రను పోషించే అవకాశం నాకు లభించడం నా అదృష్టం.

ఆయనకు 'చంద్రునికో నూలు పోగు' అన్నట్టుగా 1971 లోనే సర్. సి. ఆర్. రెడ్డి కళాశాల ప్రారంభించిన అంతర్ కళాశాల నాటిక పోటీలలో ఉత్తమ దర్శకత్వానికి ఆయన పేరిట 'రోలింగ్ షీల్డ్' బహూకరించాను.

శ్రీ వెంకటేశ్వరరావుగారి దర్శకత్వంలో నేను నటించిన మొదటి నాటిక శ్రీ యర్రంనేని చంద్రమౌళి గారి "న్యాయం - చట్టం" - నా పాత్ర కొండయ్య, వయసు 50 సంవత్సరాలు, నిరక్షరాస్యుడు, జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీ నా పాత్రను మలచడంలోనూ, నన్ను ఆ పాత్రలో సమర్థవంతంగా నటింపజేయడానికి ఆయన తీసుకున్న శ్రద్ధ మరువలేనిది ... ప్రతి కదలికను

సునిశిత పరిశీలనా దృష్టితో చూసి ఎన్నో రిహార్సల్స్ చేయించి ప్రదర్శింపజేశారు ఆ పాత్ర వల్ల నాకు యూనివర్శిటీ విద్యార్థి సమూహాల నుండి మూడు నాటికల్లో నటించడానికి అవకాశాలు వచ్చాయి. అదీ ఆయన చలువే ... ఆశీర్వాదబలమే.

ఆయన శిష్యరికం చేస్తూ, ఆయన దర్శకత్వంలో నటించడం ఒక ఎత్తైతే, ఆయన దర్శకత్వంలో ఆయనతో కలిసి నటించడం మరో ఎత్తు. రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి 'విషాదం' (నాటిక), అనిసెట్టి సుబ్బారావు గారి 'గాలిమేడలు' (నాటకం) లో ఆ అవకాశం లభించింది.

ఈ రెండు ప్రదర్శనల్లో మొదటిది 'సమయపాలన' 'క్రమశిక్షణ' విషయంలో తోడ్పడితే ... రెండవది ఒకే నటుడు మూడు వైవిధ్యభరితమైన పాత్రలు ధరించే విషయంలోనూ, 'దర్శకత్వపు మెళకువలు' నేర్చుకోవడానికి తోడ్పడింది.

'విషాదం' నాటికను ఆంధ్ర యూనివర్శిటీ 'ఓపెన్ ఎయిర్ థియేటర్'లో ప్రదర్శించాము. అక్కడ నాటిక ప్రదర్శించడం నాకు తొలి అనుభవం - సాయంత్రం గం. **6 - 30** ని.లకు ప్రదర్శన. గం. **6- 25** ని.ల కల్లా అందరమూ సిద్ధమయ్యాము - మాలోని ఉత్సుకత మాటిమాటికీ తెరచాటు నుండి ప్రేక్షకుల గాలరీని చూసేటట్లు చేసింది. ప్రేక్షకులు **50**కి లోపే ఉన్నారు. మాలో ఉత్సాహం నీరు కారిపోయింది. మాస్టారు దగ్గరకు వెళ్ళి మరో పది నిముషాలు వేచి చూద్దామని అడిగాము. ఆయన మరోమాట లేకుండా చేయెత్తారు. రెండవ గంట మ్రోగింది. ఆ తరువాత మూడవ గంట. తెర మెల్లగా తొలగింది. సమయం **6 - 30** నిముషాలు - ప్రదర్శన మొదలైంది. గేట్లు మూసేశారు ... నాటిక మధ్యలో విరామ సమయంలో ఒక ప్రకటన చేశారు. 'మరుసటిరోజు - ఇదే వేదిక మీద - ఇదే నాటిక, సా. **6 - 30** ని. లకు ప్రదర్శిస్తారు' అని...విని ఆశ్చర్యపోయాం.

మరుసటి రోజు ... అదే సమయం ... అదే ఉత్సుకతతో ప్రేక్షకుల గాలరీ వైపు చూశాం అంతా కోలాహలం - నేల ఈనిందా అన్నట్టు ప్రేక్షకులు. మా ఆనందానికి అవధులు లేవు. రెట్టించిన ఉత్సాహంతో ప్రదర్శన పూర్తి చేశాం. మాలో ఆయన నెలకొల్పిన క్రమశిక్షణ, పాటించిన సమయపాలన మాకు రక్షణ కవచాలై ఈ నాటికీ ముందుకు నడిపిస్తున్నాయి.

ఆయన దర్శకత్వంలోనే ఆయనతో కలిసి నటించిన మరో నాటకం అనిసెట్టి సుబ్బారావుగారి 'గాలిమేడలు' - దీనిలో ఒక ప్రత్యేకత వుంది. ఇందులో ముగ్గురు నటులు ఒక్కొక్కరు మూడు వైవిధ్యభరితమైన పాత్రలను పోషించాలి. అందులో నేను - 'పోలీస్ ఆఫీసర్' 'సత్రం వాచ్ మన్' 'వెంకట్రావు (వ్యాపారస్థుడు)" - పాత్రలు ధరించాను. అదొక వింతైన అనుభవం - ఒకే నాటకంలో ఒక పాత్రను సమర్థవంతంగా పోషించడమే కష్టసాధ్యమైన విషయం. అలాంటిది మూడు విభిన్న పాత్రలను నటించడం కత్తి మీద సామే. కాని పాత్రల పట్ల పూర్తి అవగాహన, పాత్రధారుల సామర్థ్యం మీద నమ్మకం, వీటితోపాటు ఆయన దర్శకత్వపు అనుభవం - ఈ మూడింటి సమ్మేళనంతో ఎన్ని రిహార్సల్స్నో చెప్పలేం ... ఎన్ని చర్చలో లెక్కలేదు. నెల రోజుల తరువాత మాలో ధైర్యం చిక్కింది. మేము కూడా సమర్థులమైన నటులమే అన్న చిన్నపాటి గర్వం మొలకెత్తింది. ఆయన దర్శకత్వపు

మెరుపుల్లో మాలోనూ దర్శకత్వపు ఆలోచనలు రూపుదిద్దుకోవడం మొదలైంది.

ఆయన ప్రదర్శనల గుణనిర్ణయం చేయడంలో జీవనటనా నైపుణ్యాలకిచ్చే ప్రాధాన్యత, ప్రదర్శనా ప్రత్యేకతలు, దర్శకత్వపు విలువలు, ప్రదర్శన సునిశిత పరిశీలన తప్పొప్పుల తార్కిక విశ్లేషణ, వాటిని సమన్వయ పరచడంలో ఆయన పాటించిన సంయమనం నిష్పాక్షికత ... గుణనిర్ణయం పట్ల కొన్ని సిద్ధాంతాలను మాలో పాదుకొల్పాయి. అవే భవిష్యత్తులో నటుడిగా మాత్రమే కాకుండా నాటక సమాజ నిర్వాహకుడిగా, దర్శకుడిగా, గుణనిర్ణేతగా నా వెన్నంటి నడిపిస్తూ ఉన్నాయి.

నంది నాటకోత్సవాల వంటి పోటీలతో పాటు, అక్కినేని నాటక కళాపరిషత్తు, పరుచూరి రఘుబాబు మెమోరియల్ నాటక కళా పరిషత్తు, పంతం పద్మనాభం మెమోరియల్ నాటక కళాపరిషత్, అప్పాజోస్యుల ఫౌండేషన్ - వంటి పరిషత్తులతో దాదాపు 40 పరిషత్తులలో నిష్పాక్షికమైన గుణనిర్ణేతగా పేరు తెచ్చుకోవడమే కాకుండా, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల నుండి ఎన్నో బిరుదులు, సన్మానాలు, పురస్కారాలు పొందే అదృష్టం దక్కింది. ఆయన ఆశీర్వాద బలమే ఈనాటికీ 80 సంవత్సరాల వయసులో కూడా నాటకమే నా శ్వాస, ధ్యాసగా కొనసాగేలా చేస్తూ వచ్చింది. అందుకు నేను ఆయనకు సదా ఋణపడి ఉంటాను. ఆయన శతజయంతి ఉత్సవాలు నిర్వహించడంలో నాకు భాగస్వామ్యం లభించడం ఆయన ఋణం కొంతైనా తీర్చుకునే అవకాశంగా భావిస్తున్నాను.

నేను ఆయనకు ఆజన్మాంతం ఋణగ్రస్తుడినే ... ఆయన ఆత్మకు శతకోటి వందనాలు అర్పిస్తూ ఆయన కృపాదృష్టి నా మీద ఇలాగే కొనసాగాలని, ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ... సెలవు!

-డా॥ మోహనరావు కొల్లి





## సాంఘిక నాటక రంగంలో అతనిదో శకం

-ఎం.సి.దాస్

నాటకం అతని ప్రాణం, నటన అతని ఊపిరి. కాకినాడ అనగానే కాజాలు, బందరు అనగానే తొక్కుడు లడ్డూలు, సింహాచలం అనగానే సంపెంగలూ జ్ఞాపకం వచ్చినట్టు సాంఘిక నాటకం అనగానే 'నటరాజు' స్వర్గీయ కె. వెంకటేశ్వరరావు గారు జ్ఞాపకం వస్తారు.

మొట్ట మొదటిసారి శ్రీ వెంకటేశ్వరరావు గార్ని 1964లో విశాఖపట్నం టౌన్‌హాల్‌లో 'కన్యాశుల్కం' నాటకం వేస్తుండగా చూశాను. అప్పుడు వారితో పరిచయం కాలేదు. అప్పట్లో నేను 'నాట్య భారతి' వారి సమాజంలో వేస్తూ వుండేవాణ్ణి.

ఆంధ్రా యూనివర్శిటీలో ఎమ్.కామ్. చదువుతున్న రోజుల్లో ఓ రోజు "సుజాతా పరిణయం" అనే నాటకం వేశాము. నాటకానంతరం శ్రీ వెంకటేశ్వరరావు గారు గ్రీన్‌రూమ్‌లోనికి వచ్చి, "నాటిక బాగా వేశారు. మీ గొంతు బావుంది. రేపొకసారి నన్ను డిపార్టుమెంట్ లో కలుసుకోండి" అన్నారు. అప్పట్లో ఆయన 'స్టేజ్ డైరెక్టరు'గా వుండేవారు. మర్నాడు కలుసుకున్నాను. "మనం ఆంధ్రా యూనివర్సిటీ తరపున ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి ఓ కార్యక్రమం సమర్పిస్తున్నాం. అందులో మీరో పాత్ర వహించాలి" అన్నారు. ఆ రోజుల్లో శ్రీ వెంకటేశ్వరరావు గారితోనో, వారి దర్శకత్వంలోనో నటించడం నటుడికి ఓ పెద్ద అవకాశం, అదృష్టం.

అది 1967 వ సంవత్సరం. అప్పుడు నేను కలకత్తాలొ వుద్యోగం చేస్తున్నాను. ప్రవాసాంధ్ర కళాసమితి, ఖర్గపూర్ వారు శ్రీ వెంకటేశ్వరరావుగారికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. నేను, మరి కొంతమంది మిత్రులం కలకత్తా నుంచి ఖర్గపూర్ వెళ్ళాం. సన్మాన సంరంభాన్ని చూడటానికి, "నా నటన చూపించే సన్మానం చేయించుకుంటాను గాని, ఊరికినే కాదు" అన్నారుట వెంకటేశ్వరరావుగారు. అందుకని, ప్రవాసాంధ్ర కళాసమితి, ఖర్గపూర్ వారు రావి వెంకటాచలం గారి 'మాట తప్పకు' నాటక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అందులో వెంకటేశ్వరరావుగారు 'కామరాజు' పాత్ర వేశారు. He was at his best. ఆరోజు ఆయన నటన అమోఘం. అద్భుతం, అద్వితీయం, అనన్యసామాన్యం. ఆ నటనకు చలించిన ఓ బెంగాలీ కళాకారుడు అమాంతం స్టేజి మీదకు వరిగెత్తుకు వెళ్ళి వెంకటేశ్వరరావుగారి రెండు కాళ్ళను వాటేసుకున్నాడు. ఆనాడు ఆడిటోరియంలో వున్న మా అందరి కళ్ళమ్మట ఆనందభాష్పలు కురిశాయి. మన ఆంధ్రుడికి లభించిన ఆ గౌరవానికి మా కళ్ళు గర్వంతో మెరిశాయి. అది మరువలేని, మరపురాని సంఘటన.

ఆ తర్వాత చాలాకాలం మేం కలుసుకోలేదు. నేను ఉద్యోగరీత్యా కలకత్తా నుండి మచిలీపట్నం, ఆ తర్వాత విజయవాడ చేరుకోవడం జరిగింది. అనుకోకుండా ఓరోజు స్వర్గీయ శంకరమంచి సత్యంగారు ఫోన్ చేసి, "మీరు 'కొడుకుపుట్టాల' నాటికలో ఓ పాత్ర వేయాలి, ఆ నాటికకు శ్రీ వెంకటేశ్వరావుగారు దర్శకత్వం వహిస్తారు, మీకు కాంట్రాక్టు పంపిస్తున్నాను" అన్నారు.

"మళ్ళీ ఎన్నాళ్టికి వెంకటేశ్వరరావుగారితో సహచర్యం" అని మహా సంబరపడిపోయాను.

విజయవాడ బీసెంట్ రోడ్డులోని బృందావన్ లాడ్జిలో మూడు రోజుల పాటు రిహార్సల్సు వేశాం. రేడియో నాటికలకు అంత దీక్షగా అన్ని రోజులు ఎప్పుడూ రిహార్సల్సు వెయ్యలేదు. పాత్రను గురించి చెప్పటంలోగాని, మలచడంలో గాని ఆయనకు ఆయనే సాటి. నేను వేసిన 'శరభయ్య దద్ది' పాత్రను గురించి వివరిస్తూ, "దాసుగారూ, ఆ **"నరసివ్వా" అనే పిలుపు ఎలా రావాలో తెలుసునా, వధ్యశాలకు తీసుకు వెళ్ళబడుతున్న మేక గొంతులోని దైన్యం, అశక్తత, ఆవేదన అందులో వినిపించాలి"** అన్నారు. Hats off to his perception and perfection!

"నటరాజు మనకిక లేడు" అన్న వార్త పిడుగులా పడింది మా మీద. బెజవాడలోని మిత్రులందరం స్వర్గీయ వెంకటేశ్వరరావుకు అతి ప్రియమైన, తాను నాటక కళ కోసం అహోరాత్రులు శ్రమించిన, పరిశ్రమించిన గాంధీనగరం సెంటర్‌లో కలుసుకున్నాం, నివాళులర్పించాం. వూరేగింపుగా వెళ్ళి కృష్ణవేణమ్మ వొడిలో తలలు పెట్టి రోదించాం. మునకవేసి మా గోడు వినిపించుకున్నాం.

ఆంధ్రప్రదేశ్ లోనే గాక ఆంధ్రేతర ప్రాంతాలలొ కూడా సాంఘిక నాటక రంగానికి ఒక కొత్త ఒరవడిని దిద్దిన మహానటుడు, నటులకూ నాటకరంగానికీ గౌరవాన్ని, హుందాతనాన్నీ తెచ్చి పెట్టిన మహా మనీషి, నటరాజు స్వర్గీయ వెంకటేశ్వరరావు.

అతనిదో వాణి, అతనిదో బాణి, సాంఘిక నాటక రంగంలో అతనిదో శకం.

యం.సి.దాస్





## 'చరితార్థులు' మా వెంకటేశ్వరరావు

-ఏ.బి.ఆనంద్

కుప్పిలి వెంకటేశ్వరరావు అనగానే నాటక కళ ప్రతి ఒక్కరికి గుర్తు వస్తుంది. నాటకమే తానుగా తానే నాటకంగా జీవించిన వ్యక్తి. జీవితంలో చిన్నతనంలో తన స్నేహితులు ఇంటి పేరు కుప్పిలి కావడంతో కుప్పిగంతులు వేసేవాడు మా వెంకీ అని ఆటపట్టించేవారు ఆ ఆట తన జీవితంలో చెరగని ముద్ర వేసి నాటక రంగాన్ని ఒక ఆట ఆడించిన ఉత్తమ నటుడిగా నిలిచాడు. నటనలో తన సామర్థ్యాన్ని చూపించడమే కాక దర్శకత్వ బాధ్యత స్వీకరించి ప్రతి ఒక్కరిని తీర్చి దిద్దిన మార్గదర్శకుడు. వారి శిష్యులు ఏ శివరామరెడ్డి, కబీరుదాస్, సందూరి వెంకటేశ్వర్లు లాంటి వాళ్ళను ఉత్తమ నటులుగా తీర్చిదిద్ది వారి జీవితానికి రహదారి నిర్మించిన వ్యక్తి కె.వెంకటేశ్వరరావు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో నటునిగా పనిచేసిన శ్రీ రామమోహనరావు గారితో కలిసి నాటకాలను అన్ని ప్రాంతాలకు వ్యాపింప చేసి చివరకు ఢిల్లీలో కూడా ప్రదర్శనలు ఇచ్చినవాడు. ఆ పరిచయంతో రామ్మోహనరావుగారు, బందా కనకలింగేశ్వరరావు గారికి, వెంకటేశ్వరరావు గురించి చెప్పడం, వారికి తగిన పాత్రలను ఇచ్చి ప్రోత్సహించడం ఆకాశవాణి బాధ్యతగా స్వీకరించి అనేక నాటకాలలో అవకాశాలను ఇచ్చింది. అయితే వేదిక వేరు రేడియో వేరు. అక్కడ దృశ్యం, ఇక్కడ వాచ్యం. ఈ రెంటి భేదాలను గమనించి సాధన చేసి ఉండకపోతే వేదిక పైన ప్రదర్శించే నాటకంగానే తయారవుతుంది ఆకాశవాణి నాటకం కూడా. అలాంటివి జరగకుండా చూసుకునే బాధ్యత నాటక ప్రయోక్త బందా కనకలింగేశ్వరరావు గారిది. వారు దానిని సక్రమంగా నిర్వర్తించారు. వారు కూడా రంగస్థలం నటులు కనుక. ఆకాశవాణిలో గురజాడ అప్పారావు గారి 'కన్యాశుల్కం' నాటకం తయారు చేయడానికి నటీనటుల ఎన్నిక చేస్తున్నప్పుడు రామ్మోహనరావు, నేను, సుబ్బారావు లతో పాటు 'గిరీశం' పాత్ర కోసం ప్రత్యేకంగా వెంకటేశ్వరరావుగారిని పిలిపించడం, బందా గారి విజ్ఞతకు గుర్తు. నటులను ఎన్నిక చేయడంలో వారి తర్వాతనే ఎవరైనా. ఆ నాటకం ప్రసారమై మంచి పేరు పొందిన తరువాత ప్రత్యేకించి 'గిరీశం' పాత్రను ఏకపాత్రగా వ్రాయించి దానిని కే. వెంకటేశ్వరరావు ద్వారా ప్రసారం చేయాలనుకున్నప్పుడు బందాగారు దగ్గర ఉండి, ఆయన కూడా వేదికపై ఆపాత్రను నిర్వహించారు. కనుక 'గిరీశం' పాత్రకు పూర్తి న్యాయం చేయాలంటే అతని బాణీని అలవర్చుకోవాలి. దానికి వెంకటేశ్వరరావు రెండు రోజులు కష్టపడి అద్భుతమైన నటనను అందించారని. శ్రోతలలో మంచి పేరు సంపాదించుకున్నాడు. దానికి

బందా గారిని అభినందించవలసినదే.

అప్పటికే చిన్నచిన్న నాటకాలు వేస్తున్న చాట్ల శ్రీరాములు గారిని తన సంస్థ ర. స. న. (రసజ్ఞుల సరసుల నటీనటుల సమాఖ్య)లో సభ్యులుగా చేర్చి ద్వితీయ స్థానంలో చాట్ల శ్రీరాములు గారిని నిలబెట్టిన ఘనుడు వెంకటేశ్వరరావు ఆ తర్వాత శ్రీరాములు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాటక శాఖకు అధిపతిగా ఉండి అనేక నాటకాలను సాధన చేయించాడు పిల్లలతో. ఆ తర్వాత కొంతకాలానికి కె. వెంకటేశ్వరరావును కూడా ఎన్నిక చేయడం అన్నది ఆయన కీర్తి కిరీటంలో ఒక మణి. ఆ సందర్భంలోనే విశాఖపట్నంలో ఉన్న విజయలక్ష్మిని తీసుకువచ్చి వేదికపై నిలబడటం దగ్గర నుంచి ప్రతి కదలికను దగ్గర ఉండి నేర్పించి ఆమెను ఉత్తమ నటిగా దేశంలో అనేక బహుమతులు పొందిన నటిగా తయారుచేసిన ఉపాధ్యాయుడు. అలాగే విజయవాడలో వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేసే సందూరి వెంకటేశ్వర్లు గారిని నివేదిక పైన ఎలా నిలబడాలో ఏం చేయాలో తెలియని వాడిని తీసుకువచ్చి ఉత్తమ హాస్య నటునిగా తీర్చిదిద్దిన మేధావి. అలాగే కబీర్ దాస్ వేరే ఉద్యోగం చేసుకుంటున్న కుర్రవాడు అతనిని తీసుకువచ్చి కథానాయకుడిగా ప్రధాన పాత్రలను ఇచ్చి ప్రోత్సహించి మంచి నటుడిగా దర్శకుడిగా తీర్చిదిద్దారు. విజయవాడలో జి.ఎస్.ఆర్. మూర్తి పేరు వినని వారు తక్కువ. ఆయన సొంత సంస్థ ద్వారా అనేక నాటకాలను ప్రదర్శిస్తున్న సమయంలో అతనిని కూడా తన సంస్థలో చేర్చుకొని ప్రాథమిక విషయాలు తెలియజేసి వేదికపై ఎలా ప్రవేశించాలి ఆ తర్వాత ఆ పాత్రలో చివరి వరకు ఎలా లీనమై ఉండాలి అన్న విషయాలను బోధించిన అధ్యాపకుడు. తాను విశాఖపట్నంలో నాటకాలను ప్రదర్శిస్తున్న సమయంలో విజయనగరంలో ఉన్న కంటికి నగదుగా కనిపించే రాజ్యలక్ష్మిని చూసి నాటకాలలో వేషం వేస్తావా అని అడిగితే నాకు నాటకమే తెలియదు దానిలో పాత్ర ఏం పోషిస్తాను'' అన్న సమాధానానికి నేను చూసుకుంటానని అవన్నీ నీవు అంగీకరిస్తే చాలు అని ఆమె భర్త వద్ద అంగీకారాన్ని తీసుకొని విశాఖపట్నం తీసుకువచ్చి రోజుల తరబడి నాటక లక్షణాలను గురించి ఆమెకు తెలియజేస్తూ ఏ పాత్రను ఎలా పోషించాలో ఆ పాత్రల విలువలను అర్థం అయ్యేలా ఆమెకు తెలియజేసి అనేక నాటకాలలో కె. విజయలక్ష్మి తో పాటు తనకు కూడా మంచి పాత్రలను ఇచ్చి ప్రోత్సహించిన వాడు వెంకటేశ్వరరావు విజయనగరం వెళితే వారి ఇంట్లోనే మకాం. వీరందరూ కూడా ఆకాశవాణిలో ఎన్నికైన నటీనటులే నేను విశాఖపట్నంలో పని చేస్తున్న సమయంలో రాజ్యలక్ష్మి విజయలక్ష్మి ర.స.న లో వారి అభిప్రాయాలను అనుభూతులను తెలియజేస్తూ మమ్మల్ని కన్న బిడ్డల్లా ముద్దు ముద్దు మాటల్లో ఎన్ని లొసగులు ఉంటాయో వాటిని గమనించి మమ్మల్ని తీర్చిదిద్దినది వారే ఈరోజు మీ అందరి ముందు మేము ధైర్యంగా వచ్చి ఈ పాత్రలలో జీవిస్తున్నాం అంటే దానికి ఆద్యుడు గురువుగారు పితృ సమానులు కుప్పిలి వెంకటేశ్వరరావు గారు వారి కరుణ లేకపోయినట్లయితే ఆకాశవాణి ప్రాంగణాన్ని చూసే అవకాశమే వచ్చి ఉండేది కాదు అని వారిద్దరూ గురువు గారిపై ఉన్న అభిమానాన్ని ప్రేమను గురుభక్తిని చాటారు.

నండూరి ఆకాశవాణి కొచ్చిన తర్వాత మా గురువు గారు నండూరి సుబ్బారావు గారితో పరిచయం ఏర్పడి ఏదైనా మంచి నాటకం వచ్చినప్పుడు నండూరి సండూరి ఇద్దరిని కలిపి పిలిచేవారు బందా గారు అలాగే కబీర్ దాసు గారు మేము వేదికపై నాటకాలు వేసుకున్న సమయంలో కొన్ని నాటకాలకు వారు దర్శకత్వ బాధ్యత వహించి ఈ దృశ్యాన్ని గురువుగారు ఎలా చెప్పేవారు అని ఆ పద్ధతిలో మమ్మల్ని నటింప చేసేవారు. జి.ఎస్.ఆర్. మూర్తి గారు కూడా ఆకాశవాణి కళాకారుడై ఓ రోజు సాధన చేస్తున్న సమయంలో "ఆనంద్ గారు! మీరు చేస్తున్న పద్ధతి చాలా బాగుంది. అయితే ఎలా ఉంది సరిగా చూస్తే మీ వృత్తి ధర్మం ఈ పాత్రలో కనిపిస్తుంది. దానిని సరి చేసుకున్నట్లయితే మిమ్మల్ని మించిన నటులు రేడియోలో మరొకరు ఉండరు'' అని సలహా ఇచ్చాడు కూడా. దానితో నా పద్ధతి చాలా వరకు మార్చుకున్నాను. అది మూర్తిగారి చలువ.

శివరామరెడ్డిగారు ఒక నాటకాన్ని తయారు చేసుకుని దాని కోసం ఒక సంస్థను స్థాపించి దానిలో తానే ప్రధాన పాత్ర నిర్వహిస్తూ దర్శకత్వ బాధ్యత కూడా స్వీకరించాలని ఆలోచనలో ఉండి గురువుగారికి ఆ విషయం తెలియజేస్తే ఆయన ఎంతో ఆనందించి నగరాలన్నిటినీ నేను పరిపాలిస్తున్నాను. పల్లె ప్రజల నాడి తెలిసిన వాడివి కనుక వారికి కావలసిన నాటకాలను వ్రాయించి వారి భాషలోనే నీ నాటకాన్ని వారికి వినిపించాలి అనే సలహా ఇచ్చి వారి సంస్థను ప్రారంభించిన ఘనుడు. తనతో పాటు నాటక రంగం అభివృద్ధి చెందాలి అన్న అభిప్రాయమే తప్ప తనకే పేరు రావాలి అన్న స్వార్థం ఆయన మనసులో ఉండేది కాదు అన్నది స్పష్టం. వెంకటేశ్వరరావుగారు కనక 'పుష్యరాగం' అన్న నాటకాన్ని ప్రదర్శించడానికి ముందు రేడియోలో నాటకం వేయడానికి వచ్చి వేషాలు వేసి మధ్యలో టీ తాగడానికి వెళ్ళినప్పుడు, "ఆనంద్ గారు! నేను ఒక నాటకాన్ని ప్రదర్శించబోతున్నాను. దానిలో ప్రధాన పాత్ర కథానాయకునిగా మీరు ఉంటే ఆ వేషానికి జీవం వస్తుంది. రమ్మని అడిగినప్పుడు, ఇక్కడ నాకు సమయం ఉండదు కదండీ. అందులో ఇక్కడ కాగితాలు చూసి చదివే అలవాటు. మీ దగ్గర ఆ ఆటలు సాగవు కనుక నేను పనికి రాను, అంటే చివరకు ఆలోచించి ఆయన కబీరుదాసుని ఎన్నుకొని ఆయనతో నాటకం ప్రదర్శించిన రోజు అతని నటన చూసి మా శంకరమంచి సత్యం నాటకశాఖ చూస్తున్నవాడు వెంటనే కబీరుదాస్ ను పిలిచి ఎన్నిక చేయడం విశేషం. చిన్నతనంలో తన స్నేహితులు ఆట పట్టించడం కోసం కుప్పిగంతులు అన్న మాటను ఉపయోగించడం. అతని జీవితంలో ఎంత మార్పును తెచ్చిందో గమనిస్తే, ఆశ్చర్యపోతాం. ఆ పట్టుదలతోనే ఏ పాత్రను తాను వ్రాయించదలచుకున్నాడో దానికి ప్రాణ ప్రతిష్ట చేసే రచయిత దొరికినప్పుడు మాత్రమే ఆ నాటకాన్ని వ్రాయించేవాడు. ఆ నటీనటుల ఎన్నిక పూర్తి అయిన తర్వాత నెల రోజులు వారితో సాధన చేయించి, వారిని ఆ పాత్రలో నిలబెట్టేవాడు. మా నండూరి సుబ్బారావు గారు, శ్రీ శ్రీరామ మోహనరావు గారు ఆయనకి అతి సన్నిహితం. ఉషాబాలా, వాణిబాల లాంటి ఎంతోమంది నటీమణులను వేదికకు పరిచయం చేసిన వెంకటేశ్వరరావు మనసులో నాటకం తప్ప మరొకటి ఏది లేదు అన్న విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంది.

నండూరి సుబ్బారావుగారికి, సి. రామ్మోహన్రావుగారికి, వెంకటేశ్వరరావు చాలా సన్నిహితులు. 'ఏరా బావా !' అనుకునే స్నేహం. అరమరికలు లేకుండా మాట్లాడుకోగలిగినవారు. మేమంతా ఒకసారి రేడియో నాటకం సాధన చేస్తున్న సమయంలో సుబ్బారావు గారు చొరవతో 'ఏరా బావా! నువ్వు మాట్లాడినట్లే అందరూ మాట్లాడాలి అంటే కుదరదు కదా! ఎవరి బాణీ వారికుంటుంది. వారి పద్ధతిని తీర్చిదిద్దాలి తప్ప నిన్నే అతనిలో చూసుకోవడం బావుండలేదు'' అంటే 'నేను కాదు బావా! ఆ పాత్ర అలా పలికితే బాగుంటుంది. అలా కదిలితే జీవం వస్తుంది. అనే అభిప్రాయంతో వాళ్ళకు ఆ పద్ధతిని నేర్పుతున్నాను' అని సమాధానం ఇచ్చారు. ఏదైనా నిర్మొహ మాటంగా చెప్పగలిగిన ధైర్యశాలి. ఏ నాటక సమాజం వారైనా ఒక మంచి నాటకాన్ని రసవత్తరంగా నడిపితే వెళ్ళి ఆ నాటకాన్ని చూసి వారందరినీ అభినందించి, ఏవైనా సలహాలు ఇవ్వదలుచు కుంటే, దర్శకుని పిలిచి, 'మీరు ఇలా చేస్తే బాగుంటుందేమో ఆలోచించండి. నేను చెప్పానని కాకుండా ఆ సందర్భానికి అది కుదురుతుందో లేదో ఆలోచించి నిర్ణయం తీసుకోండి' అని చెప్పి వచ్చేవారు. మద్రాసులో ఒక పర్యాయం, ఆదుర్తి సుబ్బారావుగారు, అక్కినేని నాగేశ్వరరావుగారు అందరినీ కొత్తవారిని పెట్టుకొని సినిమా తీస్తే ఎలా ఉంటుంది. అని ఆలోచించి వారికి సరిపడిన కథను ఎన్నుకొని విమానం ద్వారా ప్రకటనలను ఏర్పాటు చేసేటప్పుడు, వెంకటేశ్వరరావుగారు తన నటీనటులు అందరిని తీసుకొని మద్రాసు వెళ్ళి ఆదుర్తి వారిని కలిసి ఆ సినిమాలో అవకాశాలు పొందాడు.

వెంకటేశ్వరరావుగారికి మంచి వేషం ఇచ్చాడు. ఆదుర్తి గారు "రక్తకన్నీరు'' నాగభూషణంగా పేరు పొందిన నటుడిని వాణిబాల, వెంకటేశ్వరరావులాంటి కొంతమందిని ఎన్నిక చేసుకొని వారందరికీ చిన్న వేషాలైన మంచివి. ప్రాధాన్యత కలిగినవి, ఇచ్చి ప్రోత్సహించారు. రాజబాబు, నాగభూషణం సినీ రంగంలోనే స్థిరపడ్డారు. పొట్టి ప్రసాదు ఆ సినిమాలో చేసిన తర్వాత చాలా వాటిలో కనిపించి వేషాలు తగ్గేసరికి విజయవాడ రాక తప్పలేదు. ఆ సినిమాల ప్రభావం వల్ల గుమ్మడి వెంకటేశ్వరరావుగారు లాంటి మంచి నటుడు, వెంకటేశ్వరరావుకి సన్నిహితులు కావడం ఆనందదాయకం. తన గురించి మాత్రమే కాక తన బృందం మొత్తానికి సంబంధించినవారి క్షేమాన్ని చూసేవాడు వెంకటేశ్వరరావు. అలా అందరి మన్ననలను పొందాడు.

డాక్టర్ రాజారావుగారు వైద్య వృత్తిలో ఉన్నా నాటకాల పై ఉన్న అభిమానంతో మాచినేని వెంకటేశ్వరరావు అలాంటి నటులను ఏర్పాటు చేసుకొని వామపక్ష సిద్ధాంతాలను ప్రచారం చేయడం కోసం ఆ నాటకాలు ఆడుతున్న సమయంలో వెంకటేశ్వరరావుగారికి పద్ధతి నచ్చింది. వారిని మించి మంచి నాటకాలను ప్రదర్శించాలి. 'సిద్ధాంతాలకు సంబంధం లేకుండా సాంఘిక ప్రయోజనం కోసం సమాజానికి కొత్త విషయాన్ని తెలియజేయడం కోసం అన్నీ సాంఘిక నాటకాలనే ఎన్నుకొని, వాటిని ప్రజలకు బోధించాలి' అన్న పట్టుదలతో తనకు కావలసిన అంశాన్ని తీసుకుని రచయితతో ఆత్మీయతను పెంచే నాటకీయతతో ప్రదర్శన ఉండాలన్న కోరికను నెరవేర్చుకోవడం కోసం నాటక రంగానికి వచ్చాడు.

జయశ్రీ, పావలా శ్యామల, సిహెచ్. కృష్ణమూర్తి, జీ.వీ.సుబ్బారావు, సాక్షి రంగారావు, వంకాయల సత్య నారాయణ, మిత్రో, కృష్ణ చైతన్య, కొత్తుర్తి భాస్కరరావు లాంటి వారందరూ వీరి శిక్షణలో వచ్చిన వారే. నేను, నండూరి విఠల్ ఆకాశవాణిలో 'రాగరాగిణి' నాటకం ప్రసారమైనప్పుడు, విని ఆ తెల్లవారి మా కేంద్రానికి వచ్చి, 'సోదరా! రాత్రి మీ నాటకం విన్నాను. తినేశావ్ వేదికపై నేను చేసిన దానికన్నా నీ కంఠంలో ఆ పాత్ర జీవం పోసుకుంది అని చెప్పడానికి ఇప్పుడు వచ్చాను' అన్నారు. వారి సంస్కారానికి నాకు ఆశ్చర్యం వేసింది. ఎవరిలో ఏ కొంచెం ప్రావీణ్యం ఉన్నా వారిని అభినందించే తత్వం వారిది. వారి ముందు నేను ఎంత? ప్రోత్సహించడం కోసం అలా చెప్పారని భావించాను. అలాంటి సహృదయుల స్నేహం కలిసినందుకు నా జీవితం ధన్యం.

"చరితార్థులు'' మా వెంకటేశ్వరరావు.

-ఏ.బి.ఆనంద్, ఆకాశవాణి, విజయవాడ కేంద్రం



'కాళరాత్రి' ప్రదర్శనలో రమణమూర్తి, కె.వెంకటేశ్వరరావుతో చాట్ల



'రాజీవం' నాటికలో శ్రీమతి పిఠాపురం సీత, శ్రీయుతులు కె.వి.ఆర్., రంగారావు

## కీ.శే. కె.వెంకటేశ్వరరావు గారితో నాకున్న అనుబంధం, అనుభవాలు



-శ్రీపాద కుమారశర్మ

నా పరిచయం : నా జన్మస్థలం రాజమహేంద్రవరం. గొప్పగా చెప్పుకోవడం కాదు కానీ, మా కుటుంబాన్ని పృథ్వీరాజ్ కపూర్ కుటుంబంతో పోలుస్తుండేవారు ఆ రోజుల్లో. ఎందుకంటే మా నాన్నగారు స్వర్గీయ శ్రీపాద కృష్ణమూర్తిగారు ప్రవృత్తిరీత్యా గొప్ప పౌరాణిక, సాంఘిక నటులు మరియు నా పెద్దన్న స్వర్గీయ శ్రీపాద పట్టాభిగారు కూడా సాంఘిక నటులు. ఇక నా విషయానికొస్తే నాటకాలలో ఓనమాలు దిద్దుకొని నటుడిగా గుర్తింపు పొందే విషయంలో వారిరువురు నాకు ప్రథమ, ద్వితీయ గురువులు. ఇక నా మూడో గురువు కళాతపస్వి ప్రజా నాట్యమండలి సంస్థాపక సభ్యులు, ప్రముఖ నటులు, దర్శకులు స్వర్గీయ గరికిపాటి రాజారావుగారు. నిజం చెప్పాలంటే నేను వారికి ప్రియశిష్యుడి క్రిందే లెక్క. అంతటి మహానుభావుడితో నేను రెండు నాటకాలలో (పరివర్తన, భయం) నటించడం, వారి దర్శకత్వంలో వారు రాజమండ్రిలో స్థాపించిన 'రాఘవ కళాసమితి' పక్షాన నాటక, నాటికలలో మా పెద్దన్నగారితో పాటు నేనూ నటించడం నా అదృష్టం గాను, నా పూర్వజన్మ సుకృతంగాను భావిస్తాను. నా తమ్ముడు చి॥ జిత్‌మోహన్ మిత్ర కూడా నాటక, సినీ నటుడు, గాయకుడు. రాజమండ్రిలో నేను బి. కాం. డిగ్రీ పూర్తి చేశాక, ఛార్టర్డ్ అకౌంటెంట్ కోర్స్ చదవడానికి 1964 సంవత్సరం నవంబర్లో నిజమాబాద్ వచ్చేయడం, సి. ఏ. పాసైన పిదప ఇక్కడ స్థిరపడి, గత 50 సంవత్సరాల పైబడి వృత్తిపరంగా సీనియర్ మోస్ట్ ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నా, నా ప్రవృత్తియైన నాటకాన్ని, సంగీతాన్ని విడనాడకుండా ఇక్కడ నాటకరంగ వికాసానికి నా శక్తి కొలదీ కృషిచేసి, ఎంతో మంది నటీ నటులను తీర్చిదిద్ది, వివిధ నాటక పోటీలలో పాల్గొని ఎన్నెన్నో విజయాలు సాధించడం ఒక పార్శ్వమైతే ఇక్కడ నెలకొల్పబడిన 'నగర నట సమాఖ్య' మరియు 'శ్రీ శ్రీపాద నాటక కళా పరిషత్' సంస్థల పక్షాన వ్యవస్థాపక అధ్యక్షుని హోదాలో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి నాటక, నాటికల పోటీలు నిర్వహించడం రెండో పార్శ్వం. మళ్ళీ నాటకాలలో సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి 2009 సంవత్సరం నుండి 2015 వరకు జరుపబడిన నంది నాటకోత్సవాలలో (మధ్యలో రెండు నంది పోటీలు వదిలేస్తే) నా సంస్థ పక్షాన నా నిర్దేశకత్వంలో ప్రదర్శింపబడిన నాటికలు బంగారు నంది, వెండి నంది, కాంస్య నందులే గాక ఇతర నాటక పోటీలలో పలు బహుమతులు గెలుపొంది రెండు తెలుగు రాష్ట్రాలలో నాటక పరంగా నిజామాబాద్ పట్టణానికీ, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చానని నేను అనడం కాదుకానీ, నాటక ప్రియులంటూ ఉంటారు.

ఇక ఆ మహానటుడు వెంకటేశ్వరరావుగారితో నాకున్న అనుబంధం, అనుభవాలు : వీరి పేరు (ఇంటి పేరుతో సహా) కుప్పిలి వెంకటేశ్వరరావు అయినా ఆ రోజుల్లో సాంఘిక నాటక రంగ పరంగా 'కె. వెంకటేశ్వరరావు'గా మారుమ్రోగిపోయింది. అటువంటి గొప్ప నటవసంతక పేరు తెలుగు నాటకరంగ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించతగ్గది. వారు విజయవాడలో 'ర. స. న. సమాఖ్య' అనే నాటక సంస్థను స్థాపించి, తద్వారా ఎంతోమంది నటీనటులను తీర్చిదిద్ది, పేరెన్నికగన్న నాటకాలను ప్రొడ్యూస్ చేసి దర్శకత్వం వహించడమే గాక తాను కూడా గొప్పగా నటిస్తూ వివిధ నాటక పరిషత్తు పోటీలలో (ముఖ్యంగా ఆంధ్ర నాటక కళాపరిషత్ నాటకపోటీలలో) పాల్గొని ఉత్తమ నటుడు బహుమతికి చిరునామాగా నిలవడమేగాక, ఎన్నెన్నో బహుమతులు గెలుచుకొని ఆయన సాధించిన విజయాలు అనితరసాధ్యం. ఆయన డైలాగ్ డెలివరీ, డిక్షన్ రంగస్థలంపై ఠీవి, దర్పంతో కూడిన అభినయం చూడముచ్చటగా ఉండడం కారణంగా, వారి నాటకాన్ని తిలకించడానికి నాటక అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చేవారు.

ఆయన నిర్దేశకత్వంలో ప్రదర్శింపబడే నాటకాలలో ఆయనతో పాటు నటించే ఇతర నటీనటులు ఆయన సుశిక్షణలో తర్ఫీదు పొంది అతి తక్కువ వ్యవధిలో నిష్ణాతులుగా ఎదిగిన వారే. వారితో సమఉజ్జీగా నటించే సమకాలికులలో ప్రథములు స్వర్గీయ చాట్ల శ్రీరాములు గారైతే, వారి నటశిష్యగణంలోని ముఖ్యులు, సర్వశ్రీ 'కాబూలీవాలా' ఫేం వెంకటేశ్వరరావు, 'నటనాలయం' ఫేం ఎ. శివరామిరెడ్డి, స్వర్గీయ రాజబాబు (సినీ నటులు) శ్రీమతి వాణీబాల గారు.

వీరుగాక విజయవాడలో ఆయన సుశిక్షణలో ఎదిగిన నటశిఖామణులు ఎందరో ఉన్నారు. తన అసమాన ప్రతిభతో నటించి మెప్పించి ఉత్తమ నటుడిగా బహుమతులు అందుకున్న నాటకాలలో, నాకు తెలుసున్నంతలో ముఖ్యమైనవి - నాబాబు, దొంగవీరడు, రాగరాగిణి, ఆకాశరామన్న (ఈ నాటకంలో చిన్న చిన్న మార్పులు చేసిన కారణంగా ఆకాశరామన్న పేరును మార్చి "ఇన్స్పెక్టర్ జనరల్" టైటిల్ తో ప్రదర్శింపబడిన సందర్భాలున్నాయి) దొంగవీరడు నాటకాన్ని ఆయన గొప్పగా తీర్చిదిద్ది ప్రదర్శింపజేసిన తీరు అనితరసాధ్యం. ఆ నాటకంలో ఆయన నటించి మెప్పించిన పాత్ర 'రామబ్రహ్మం'. పాత్రోచితకు తగ్గ ఆహార్యం, మెచ్చతగ్గ అభినయంతోపాటు, డైలాగ్ డెలివరీ చాలా గొప్పగా ఉండేది. ఫోన్లో సంభాషించేటప్పుడు "అవును రామబ్రహ్మాన్నే మాట్లాడుతున్నాను" అన్న ఉచ్ఛారణ చాలా గంభీరంగా ఉండేది. కాబట్టి "సరిలేరు నీకెవ్వరు నటరాజసుందరా - సరి లేరు నీకెవ్వరూ !" అనే ప్రశంస ఆయనకు అక్షరాలా వర్తిస్తుందన్న విషయం అతిశయోక్తి కాదు.

ఆయన నటనను చూసే భాగ్యం 1957 సంవత్సరంలో కలిగింది. అది ఎలాగంటే ఆ సంవత్సరంలో డాక్టర్ రాజారావుగారి నేతృత్వంలో (ఆయన బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడే వ్యక్తి కాబట్టి) రాజమండ్రి పట్టణంలో "విశాలాంధ్ర సాంస్కృతిక మహాసభలు" స్థానిక వీరేశలింగం హైస్కూలు ప్రాంగణంలో మూడు రోజులు వైభవోపేతంగా నిర్వహించబడ్డాయి. ఆ సందర్భంగా చైనీస్ డెలిగేషన్ కూడా అట్టి సభలో పాల్గొనడం గొప్ప విశేషం. అందులో భాగంగా

ఒకరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అట్టి కార్యక్రమానికి ప్రఖ్యాత హిందీ నటుడు "బాలరాజ్ సహానీ" ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనాటి కార్యక్రమానికి అతిరథ మహారథులైన నాటక కళాకారుల్నీ, తదితర నిష్ణాతుల్నీ రప్పించడం జరిగింది. వారిలో ఆ సంవత్సరంలో నిర్వహింపబడిన ఆంధ్ర నాటక కళాపరిషత్ పోటీలలో వ్యక్తిగత బహుమతులు పొందిన మహనీయులు డా॥ రాజారావుగారు (ఉత్తమ దర్శకుడు) కె. వెంకటేశ్వరరావుగారు (ఉత్తమ నటుడు) శ్రీమతి కొప్పరపు సరోజిని (ఉత్తమ నటి) కర్నాటి లక్ష్మీనరసయ్య (ఉత్తమ సహాయ నటుడు) ప్రభృతులు ఆనాటి కార్యక్రమాలలో పాల్గొనడం కారణంగా ఆనాటి నిర్వాహకులకు ఒక అద్భుతమైన ఆలోచన తట్టింది. అది మెదడుకు పదును పెట్టే ఆశ్చర్యకరమైన ప్రక్రియ. అదేమంటే ఈ పై నలుగురు నిష్ణాతులైన బహుమతి గ్రహీతలను సమావేశపరిచి వారికి ఒక పరీక్ష పెట్టారు. ఆ పరీక్ష వివరాలను నిర్వాహకులు పై నలుగురికి విశదీకరించిన వైనం ఏమంటే "మీకు ఒక గంట సమయం ఇస్తున్నాం. మీరు ఏదో ఒక ఇతివృత్తాన్ని ఎంచుకొని, అందులో నిర్దేశించుకున్న పాత్రలకు అనుగుణంగా మీకు మీరే అలవోకగా తడబడకుండా డైలాగ్స్ చెప్పేలా ఒక నాటికను రూపొందించుకొని, 45 నిమిషాలకు పైబడి గంటకు మించకుండా ఉండే నిడివిగలది సందర్భోచితంగా ప్రదర్శించాలి" అన్న ప్రతిపాదనకు పై నలుగురు వినమ్రంగా స్వీకరించి, వారికి ఇచ్చిన గడువులోనే ఒక గొప్ప ఇతివృత్తాన్ని రూపొందించుకొని, ఆ నాటికను "ఒక్క రూపాయి" అనే పేరును ఖరారు చేసి (ప్రదర్శించబోయే ముందు ముఖ్య అతిథి అయిన బాలరాజ్ సహాని గారికి ఆ నాటిక యొక్క ఇతివృత్తాన్ని క్లుప్తంగా ఇంగ్లీషులో వివరించి చెప్పిన పిదప ఆ నలుగురు నటీనటులు గొప్పగా ఆ నాటికను తీర్చిదిద్ది Extempore గా ఒకరికి మించి మరొకరు పోటీపడి నటిస్తూ ప్రదర్శించిన రీతి వారి నటనా వైదుష్యానికి నిదర్శనం, నిరుపమానం అని చెప్పక తప్పదు. అందులో వెంకటేశ్వరరావు గారి అభినయం సందర్భోచ్చారణలో ఆయనకు ఆయనే సాటి అన్నట్లుగా నటించి మెప్పించారు. అటువంటి గొప్ప ప్రక్రియ నా స్మృతిపథంలో తెలుగు నాటకరంగంలో ఇప్పటివరకు జరగలేదని నా అభిభావన. ఈ ప్రదర్శన చూసిన సహాని గారు ఎంతగా ప్రశంసించారో చెప్పనలవికాదు. ఆ రీతిలో తిలకించిన నాటకాభిమానులు ఆశ్చర్య చకితులైపోయారు. అదీ కె. వి. ఆర్. గారి గొప్ప నటనను చూసిన నా మొదటి అనుభవం.

డా॥ రాజారావుగారు, నా పెద్దన్న పట్టాభిగారు, నాటకపరంగా కె. వి. ఆర్. గారు సమకాలికులు. ఇక నేనంటే కె.వెంకటేశ్వరరావుగారికి ఎనలేని ప్రేమ, అభిమానం. 'ఒరేయ్ తమ్ముడూ' అని ఆప్యాయంగా పిలుస్తుండేవారు.

ఇక వారితో ఉన్న నా రెండో అనుభవం : 1958 సంవత్సరంలో ఆంధ్ర నాటక కళాపరిషత్ వారు మరియు ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘంవారు సంయుక్త ఆధ్వర్యంలో (అనుకుంటా) హైదరాబాద్‌లోని (ఎగ్జిబిషన్ ప్రాంగణంలో అప్పుడు ఎగ్జిబిషన్ జరుగుతున్న సమయం జనవరి నెల అని గుర్తు) నాటక నాటిక పోటీలు అద్భుతంగా నిర్వహించబడ్డాయి. అట్టి నాటక పోటీల విభాగంలో మా 'రాఘవ కళా సమితి', రాజమండ్రి పక్షాన డా॥రాజారావుగారి దర్శకత్వంలో రూపొందించబడిన

"భవబంధాలు'' అనే నాటకం డా॥ కొల్లాపాటివారు రచించినది, ఎంపిక చేయబడ్డ కారణంగా అట్టి పోటీలలో ప్రదర్శించాం. ఆ నాటకంలో మా అన్నగారు, నేను, కాకరాల, నవీనలక్ష్మి తదితరులు, నటించడం జరిగింది. అదొక అద్భుతమైన భారీ నాటకం. అది మూడు తరాలకు సంబంధించిన ముగ్గురు హీరో పాత్రలు, ముగ్గురు హీరోయిన్ పాత్రలతో కూడినది. అందులో నేను మూడో హీరోగా నటించడం జరిగింది. ఆ నాటకాన్ని పృథ్వీరాజ్ కపూర్ గారు కూడా తిలకించి ప్రశంసించారు. (అట్టి నాటక పోటీలలో కె. వెంకటేశ్వరరావుగారి నాటకం లేదు. కారణం తెలియదు కానీ ఆ పోటీలను తిలకించడానికి కె. వెంకటేశ్వరరావుగారు మాత్రం వచ్చారు. మాకందరికీ బస నాంపల్లి స్టేషనుకు అతి దగ్గరలో ఉన్న ముసాఫిర్ఖానా బంగ్లాలో ఏర్పాటు చేశారు. మాకు కేటాయించిన బసకు ఉన్న ప్రక్క గదిలోనే బస చేసిన వెంకటేశ్వరరావు గారు మా నాటక ప్రదర్శనను చూశారు.

మా నాటక ప్రదర్శన అయిన పిదప ఆ రాత్రికి మా బసకు చేరుకున్నాం. ఆ సమయంలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. అదేమంటే ఆ రాత్రి 11 గంటల ప్రాంతంలో వెంకటేశ్వరరావుగారు నన్ను పిలిచి "ఒరేయ్ తమ్ముడూ ! డా॥ గంగాధరరావుగారి నాటకం 'తస్మాత్ జాగ్రత్త' ప్రదర్శన రేపటి ఆఖరిరోజు పోటీలలో ఉంది. వాళ్ళు మనకు కొద్ది దూరంలోనే ఉన్న గదిలో రిహార్సల్స్ చేస్తున్నారు. వెళ్ళి చూసొద్దాం పద" అన్నారు. సరేనని మేము వాళ్ళవద్దకు వెళుతుంటే మధ్యలో "ఒరేయ్ తమ్ముడూ! మనం అక్కడకు వెళ్తే వాళ్ళు ఏమైనా అనుకుంటారేమో?'' అని సంశయిస్తూ "అనుకుంటే అనుకున్నారులే, వెళ్దాం పద. డాక్టరుగారు అలాంటివారు కాదులే'' అన్న పిదప వెళ్ళాం. వెంకటేశ్వరరావుగారిని చూడగానే నాటకం రిహార్సల్స్ చేస్తున్న డాక్టరుగారు ఇతర నటీనటులు కొంచెంసేపు ఆపారు. అంతట వెంకటేశ్వరరావు గారు "నేనూ, మా తమ్ముడు శర్మ మీ రిహార్సల్స్ చూడడానికి వచ్చాం. అనుమతిస్తే చూస్తాం'' అన్నారు. గంగాధరరావుగారు విజ్ఞులు కాబట్టి, "ఏం పర్వాలేదు. మీరు చూడవచ్చు'' అన్నారు. (ఆ నాటకంలోని ముఖ్య పాత్రలలో గంగాధరరావుగారిది విలన్ వేషం, పి. ఎల్. నారాయణగారిది హీరో వేషం) సరే, ఆ నాటకాన్ని మొదటి నుంచి చివరి వరకు నటించి చూపించారు. వారందరూ. "నాటకం బాగానే వచ్చింది కానీ నా అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పాలనుకుంటున్నాను'' అన్నారు కె. వి. ఆర్. గారు. "దానిదేముంది, తప్పక చెప్పాలి'' అన్నారు డాక్టరుగారు. అంతట "చూడండి పోటీ బాగా తీవ్రంగా ఉంది. మీ వేషం బాగానే వస్తోంది. నాటకం వెయిట్ more than average" అని చెబుతూ, "ఏయ్ నారాయణా ఇలా రా !'' అని పిలిచి, నీ వేషం ఏమనుకుంటున్నావు ? Best actor వేషం, బాగానే చేస్తున్నావ్, ఇంకా బాగా చేస్తే గాని ఫలితం రాదు'' అన్నారు కె. వి. ఆర్. గారు. వెనువెంటనే డాక్టరుగారు కె.వి.ఆర్. గారిని ప్రక్కకు పిలిచి 15 నిమిషాలు ఇరువురు మాట్లాడుకుని ఒక అవగాహనకు వచ్చి కె.వి.ఆర్. గారి సలహాతో రాత్రికి రాత్రే ఇరువురు కలిసి నాటక రూపురేఖల్ని మార్చేసి, సీన్ల వారీగా చిన్న చిన్న మార్పులు చేసి, నటీనటులందరిచేత రిహార్సల్స్ చేయించేసి ప్రత్యేకంగా పి. ఎల్. నారాయణగారి వేషానికి మెరుగులు దిద్దారు. ఇంకేముంది పి. ఎల్. నారాయణగారు ఉత్తమ నటుడు బహుమతి

కైవసం చేసుకున్నారు. ఇది కల్పించి చెబుతున్న విషయం కాదు. ఎవరు ఏమనుకున్నా ఇది యదార్థంగా జరిగిన సంఘటన. ఇదీ కె. వి. ఆర్. గారి నిస్వార్థ ప్రోత్సాహానికి, తోడ్పాటుకు, ఉత్తమ వ్యక్తిత్వానికి నిదర్శనం.

మరో సంఘటన : నేను **1960** నుండి **1964** వరకు రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో బి.కాం. డిగ్రీ చదివేటప్పుడు ఆంధ్రా యూనివర్సిటీవారు ప్రతి సంవత్సరం వైజాగ్లో నిర్వహించే అంతర కళాశాలల సాంస్కృతిక కార్యక్రమాల పోటీలలో వరుసగా ఇతర విద్యార్థులతో పాటు నేను కూడా పాల్గొనడం, ఎన్నో బహుమతులు మా కాలేజీకి తీసుకురావడం జరిగింది. **1963** సంవత్సరం అనుకుంటాను. ఆ సంవత్సరం యూనివర్సిటీ వారు వివిధ పోటీలలో భాగంగా కొత్తగా డ్యూయెట్ పోటీలు ప్రవేశపెట్టగా ఆ విభాగ పోటీకి మా కాలేజీ పక్షాన entry పంపారు. డ్యూయెట్ పోటీ అంటే అబ్బాయి, అమ్మాయి కలిసి యుగళ గీతం పాడాలి. అందుకుగాను నన్నూ ఇంకో అమ్మాయిని ఎంపిక చేసి రిహార్సల్స్ చేయించారు. ఆ విభాగ పోటీలలో మా కాలేజీతో పాటు ఏడు కాలేజీలు పాల్గొన్నాయి. పోటీల వరస క్రమంలో మా కాలేజీ పేరు చివర ఉండడం కారణంగా మా డ్యూయెట్ చివరగా పాడటం జరిగింది. అట్టి ప్రదర్శన ఇచ్చేటప్పుడు నేను మా స్నేహితుని వద్ద నుండి సేకరించిన సూట్ వేసుకున్నాను. నాతో పాడిన అమ్మాయిని పట్టుచీర కట్టుకోమని చెప్పగా ఆమె అదే ధరించింది. ఆ ప్రదర్శన జరిగిన అనంతరం స్టేజి వెనుకవైపు మేము సేద తీర్చుకూంటూ, కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో వెనుకనుంచి ఎవరో నా రెండు భుజాలు చరిచి, "మీరెవరో తెలియదుగాని బాగా పాడారు. అభినందించడానికి వచ్చాను" అని అంటూ నన్ను ఎగాదిగా చూశారు. నేనూ వారిని చూశాను. మా ఇరువురి కలయిక ఆశ్చర్యం, అత్యాశ్చర్యం, మహాశ్చర్యం.

ఆయన ఎవరో కాదు. కె.వెంకటేశ్వరరావుగారు. అప్పట్లో ఆయన ఆంధ్రా యూనివర్సిటీలో నాటక విభాగ అధిపతిగా వ్యవహరిస్తున్నట్లు వినికిడి. నన్ను పూర్తిగా పరికించిన వెంటనే "ఓరి భడవా! నువ్వా సూట్ గెటప్‌లో ఉంటే ఎవరో అనుకొని గుర్తుపట్టలేకపోయాను. చాలా బాగా పాడావురా, ముగ్ధుడైపోయాను" అని చెబుతూ నన్ను పక్కకు పిలిచి, "ఉండబట్టలేక చెబుతున్నాను. డ్యూయెట్ పోటీకి నేను ఒక న్యాయనిర్ణేతను. మీ ప్రదర్శన అయిన పిదప నా జడ్జిమెంట్ కాగితాలు ఇచ్చేసిన వెంటనే మీ వద్దకు మనసారా అభినందించడానికి వచ్చాను" అని చెప్పి కాసేపు మాట్లాడి వెళ్ళిపోయారు. ఇక వివిధ పోటీలలో గెలుపొందిన వారి పేర్లు అన్నీ ప్రకటిస్తూ డ్యూయెట్ పోటీకి సంబంధించిన న్యాయనిర్ణయం పెండింగ్ లో పెట్టాం. ఎందుచేత అంటే రాజమండ్రి కాలేజీకి, విజయవాడ కాలేజీకి టై పడింది. డ్యూయెట్ విషయంలో ఆ రెండు కాలేజీలకు సంబంధించిన గాయనీ గాయకులు రేపు వైస్‌ఛాన్సలర్ గారి బంగ్లాకు వచ్చి మళ్ళీ పాడాలి. అక్కడ ఇరువురి డ్యూయెట్స్ రికార్డ్ చేసిన పిదప మరల న్యాయనిర్ణేతలకు వినిపించి, వారి నిర్ణయం మేరకు ఫలితాలు ప్రకటిస్తామంటే, ఆ విధంగా వెళ్ళి మరలా పాడాం. తదుపరి తెలిసిన విషయం ఏమంటే ఇరు కాలేజీల వారినీ సమ విజేతలుగా నిర్ధారించారని.

వారితో మరో అనుభవం : అది 1966 వ సంవత్సరంలో జరిగిన సంఘటన. అదేమంటే మా పెద్దన్నగారు, రావిశాస్త్రిగారు రచించిన "ఆరు సారాకథలు" సంపుటిని ఆధారం చేసుకుని ఒక నాటికను రచించారు. ఆ నాటికను ఆయనే ప్రొడ్యూస్ చేసి దర్శకత్వం వహించి, అందులోని ఒక ముఖ్యమైన మెజిస్ట్రేట్ పాత్రను నాచే వేయించారు. (ఆ నాటికకు ఇంతకు ముందు ప్రశంసలు, బహుమతులు వచ్చాయి) అదే నాటికను ఒక ముఖ్యమైన నాటక పరిషత్ వారు నిర్వహించే నాటికల పోటీలకు ఎంట్రీగా పంపించారు మా అన్నగారు. ఆ సమయంలో నేను నిజామాబాద్‌లో సి. ఎ. చదువుతున్నాను. ఒక వారం పది రోజులు ఉండేలా రాజమండ్రికి నన్ను రప్పించారు. రిహార్సల్స్ చేస్తూ స్క్రూటినీకి రెడీ అయ్యాము. "ఫలానా రోజున స్క్రూటినీ జడ్జి మీ వద్దకు వస్తారు ప్రాథమిక పరిశీలనకు. మీరు ప్రదర్శననివ్వడానికి రెడీగా ఉండి సహకరించండి" అని వర్తమానం వచ్చింది. స్క్రూటినీ రోజున మావద్దకు న్యాయనిర్ణేతగా వచ్చింది ఎవరోకాదు, కె.వి.ఆర్. గారు. సరే వారి ముందు నాటికను ప్రదర్శించాం. అనంతరం వారు నన్ను ప్రత్యేకంగా పక్కకు పిలిచి "తమ్ముడూ! పోటీ తీవ్రంగా ఉంది. మీ అన్న నేను మంచి స్నేహితులం, కానీ స్నేహం స్నేహమే, న్యాయం న్యాయమే, మీ అన్నయ్య పట్టాభిదీ నాదీ ఒకటే సిద్ధాంతం. వాడు కూడా న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తూ న్యాయం వైపే మొగ్గు చూపుతాడన్న విషయం నాకు తెలుసు. నేను మీ వద్దకు ప్రాథమిక పరిశీలనకు వచ్చే ముందు ఏ అపవాదు రాకూడదు అనే సందిగ్ధంతోనే వచ్చాను. కానీ అసలు విషయం ఎటువంటి అరమరికలు లేకుండా చెబుతున్నాను. నీ వేషం మాత్రం చాలా బాగా చేశావ్. ఇంత బాగా చెస్తావని ఊహించలేదు. చూద్దాం" అని చెప్పి మా అన్నగారితో మాట్లాడకుండా వెళ్ళిపోయారు. అంతటి మహానటుడి ముందు, నేనొక చిన్న బచ్చా నటుణ్ణి. ఆయన నా నటనని ప్రశంసించడం నా జీవితంలో మరచిపోలేని సంఘటన. తీరా చూస్తే ఆ నాటిక పోటీకి ఎంపిక కాబడింది.

ఆ మహనీయుని గురించి నేనొకళింపు చేసుకున్న ఇతర విషయాలు :

నిజం చెప్పాలంటే వారు ఆంధ్రా యూనివర్సిటీలోని నాటక విభాగానికి అధిపతిగా ఎంపిక కాబడి వైజాగ్కు షిఫ్ట్ అవడం కారణంగా ఉత్తరాంధ్రకు సంబంధించిన నటీనటులకు గొప్ప వరంగా మారింది. ఆ ప్రాంతంలో ఆయన ప్రమేయం వల్ల నాటకరంగ రూపురేఖలే మారిపోయాయి. ఎంతోమంది కళాకారులు, కళాకారిణులకు వారు సుశిక్షణ గరిపి ఎంతో మంది శిష్యులను తయారు చేసి వారిచే మంచి మంచి నాటక, నాటికలను ప్రదర్శింపచేసి నాటకరంగ వికాసానికి ఆయన చేసిన సంచలనాత్మకమైన కృషి బహుథా ప్రశంసనీయం.

కె. వెంకటేశ్వరరావుగారికి, కన్యాశుల్కం నాటకంలో "గిరీశం" పాత్రన్నా, కీర్తిశేషులు నాటకంలో "మురారి" పాత్రన్నా ఎంత ఇష్టమో చెప్పనలవి కాదు. ఆ రెండు నాటకాల్నీ వారు ఆ ముఖ్యపాత్రలలో ప్రదర్శించారో లేదో తెలియదు కానీ, రేడియోలో ఆయన సారథ్యంలో మాత్రం ఆ రెండు నాటకాలూ బ్రాడ్కాస్ట్ చేయబడినవి. అందులో ఆ రెండు పాత్రలు, కె. వెంకటేశ్వరరావుగారు తన అప్రతిహత గళమాధుర్యంతో డైలాగులు చెప్పిన వైనం, శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేసిందన్న విషయం చేసిందన్న

విషయం తెలుసుకొని ఎంతో సంబరపడ్డాను.

ఇక నాకు తెలిసున్నంతవరకు ఆ మహానటుడు నటించిన సినిమాలు రెండే అనుకుంటాను. అందులో మొదటిది శ్రీ ఆత్రేయగారు రూపొందించిన 'వాగ్దానం' సినిమా. అందులో వెంకటేశ్వరరావుగారు వేసిన వేషం రెండు నిమిషాల నిడివిగలదైనా, తన నటనా చాతుర్యంతో గొప్పగా నటించి తళుక్కున మెరిసారు. ఇక రెండవది 'ఇద్దరు మిత్రులు' సినిమా అనుకుంటాను. అందులో ఆ మహానటుడికి మూగవాని పాత్ర ఇచ్చారు. ఆ పాత్రను ఆయన చాలా గొప్పగా పోషించారు. అంతటి గొప్ప మహానటుణ్ణి గురించి ఎంత చెప్పినా తక్కువే. కన్నెవయసులు చిత్రంలో హీరోయిన్ రోజారమణికి తండ్రి పాత్ర ధరించారు.

ఫలశృతి : తెలుగు నాటకరంగ వికాసానికి అవిరళ కృషి సల్పిన ఆ కళాస్రష్ట కె.వెంకటేశ్వరరావుగారి శతజయంతి ఉత్సవాలు వైభవోపేతంగా జరపబడుతున్నాయన్న విషయం తెలియగానే ఎంతో పారవశ్యానికి గురయ్యాను. నా ఆనందానికి అవధులు లేవు. ఈ సందర్భంగా డా॥ కొల్లి మోహనరావు గారు నాకు ఫోన్ చేసి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఒక సావనీర్ను విడుదల చేయబోతున్నారు. కె. వెంకటేశ్వరరావుగారితో మీకున్న అనుభవాలు, అనుబంధాలు గురించి ఒక వ్యాసం రాసి పంపించండని చెప్పగానే, నాకొక గొప్ప అవకాశం కలిగినట్లుగా సంబరపడి, చంద్రునికొక నూలుపోగు చందాన ఈ వ్యాసం వ్రాయడం జరిగిందని విశదీకరిస్తూ నాకీ సువర్ణావకాశం కల్పించిన మహనీయులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కె. వెంకటేశ్వరరావు గారి శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరగాలని ఆకాంక్షిస్తూ ఆ నటరాజుని మనసారా ప్రార్థిస్తున్నాను.

నిజామాబాద్,
తేది : 04-11-2023

శ్రీపాద కుమారశర్మ
ఛార్టర్డ్ అకౌంటెంట్
సెల్ : 98480 60189



'కొడుకు పుట్టాల' జాతీయ నాటక కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు



## స్ఫూర్తి ప్రదాత...కె.వి.ఆర్



-గోపరాజు సీతారామారావు
నటుడు, రచయిత, చెన్నై.

నమస్కారములు...

వెంకటేశ్వరరావు గారితో నా అనుబంధం విచిత్రమైనది. నేను 1975లో నాటకరంగ ప్రవేశం చేశాను. వారిని, వారి నాటక ప్రదర్శనలు ప్రత్యేకంగా చూసిన బాపతు కాదు.

1978లో నేను, 'మాట తప్పకు', 'కాలం వెనక్కి తిరిగింది', వగైరా పరిషత్తుల్లో ప్రదర్శించినప్పుడు నా డైలాగు మాడ్యులేషను వెంకటేశ్వరరావు గారిని అనుకరిస్తున్నట్టు ఉంది అనేవారు. 1981లో చెన్నైలో 'సప్తపది' సినిమా కోసం వారి ఆఫీసుకి వెళ్ళి 'దేవుడితో ఇంటర్వ్యూ' ఏకపాత్ర ప్రదర్శించగా అది చూసి ఓ పెద్దాయన "ఏమయ్యా ... మీ నాటకాలు వేసేవాళ్ళందరికీ ఆ కె. వెంకటేశ్వరరావు పూనేస్తాడేమిటయ్యా మీ అందరూ ఆయనలాగే మాట్లాడతారు" అన్నారు. అది పొగడ్తగానే భావించాను. అవును మరి ... ఆయన నటనా వైదుష్యం గురించి తెలియని, చూడని...నా బోటి భావితర రంగస్థల నటుల్ని సైతం తన ప్రతిభాపాటవాలతో ఎంతగానో ప్రభావితం చేసిన ప్రజ్ఞాశాలి వారు. అందుకు నేనే ఒక ఉదాహరణ.

తర్వాత కాలంలో నాకు సాక్షి రంగారావుగారితో పరిచయం బాగా పెరిగింది. ముఖ్యంగా నేను వ్రాసిన రేడియో నాటికలు వారిని బాగా ఆకట్టుకున్నాయి. ఇద్దరం కలసి నటించేవాళ్ళం.

2005లో ... సడనుగా ఓరోజున సాక్షిగారు, చెన్నైలో ... "మనం 'కన్యాశుల్కం' నాటకం వెయ్యాలి. మీరు రామప్పపంతులు"... అంతే అన్నారు. ఏమిటంత అర్జంటు ... అని అడగ్గా ... సాక్షిగారు, ' మా గురువుగారికి నివాళి' అంటూ దివంగత వెంకటేశ్వరరావుగారి గురించి, వారితో తనకున్న అనుబంధం గురించి వివరంగా చెప్పారు. ఆయన్ని సాక్షిగారు ఎంతగా ఆరాధిస్తారో నాకు అర్థమైంది. సాక్షిగారి నోట దివంగత వెంకటేశ్వరరావుగారు నాటకరంగానికి చేసిన ఎనలేని సేవల్ని విన్న అదృష్టవంతుణ్ణి నేను.

సాక్షిగారు మొక్కవోని దీక్షతో, "కె.వి.అర్. కళాంజలి" చెన్నైలో గురువుగారి పేరున బేనరుతో నాటక ప్రదర్శనకి... నటీనటులకి జ్ఞాపికలతో సహా సర్వం సిద్ధం చేశారు. మరో వారంరోజుల్లో ప్రదర్శన జరగవలసి ఉండగా... సాక్షిగారు అనారోగ్య కారణాలతో పరమపదించారు. దురదృష్టం

అయితేనేమి... గురువుగారికి నివాళులు అర్పించాలన్న సాక్షి గారి కోరిక మేరకు దివంగత వెంకటేశ్వరరావుగారి చిత్రంతో కూడిన జ్ఞాపిక నా దగ్గర ఉన్నది. పూజగదిలో ఉంచి నిత్యం వారిని స్మరిస్తూ ఉన్నాను.

ధన్యవాదములు ...

గోపరాజు సీతారామారావు



## కళావేదిక రారాజు-కె.వి.ఆర్

-తులసి బాలకృష్ణ

ఇప్పుడయితే పరిషత్ నాటక పోటీలు ముగిసి, ఫలితాలు ప్రకటన జరిగిన కొద్ది గంటలలోనే ఉత్తమ ప్రదర్శన, నటన, మొదలైన బహుమతులు అందుకున్న అందర్నీ మరచిపోతున్నారు గానీ ఒకనాడు అయిదారు దశాబ్దాల క్రితమయితే ... కొన్ని సంవత్సరాల పాటు ఆనాటి ప్రదర్శన గురించి, అందులో రాణించిన కళాకారుల గురించీ చెప్పుకునేవారు(ట)

అటువంటి కళాకారులలో కేవీఆర్ అని సంక్షిప్తంగా పిలవబడే 'కళా రారాజు' అయిన కుప్పిలి వెంకటేశ్వరరావుగారు శిఖరాగ్రాన నిలుస్తారు. ఆ రోజుల్లో తెలుగు చలన చిత్ర రంగంలో హీరోలుగా ఎన్టీఆర్, ఏఎన్నార్ లు ఎంతటి గ్లామర్ ని సంపాదించుకున్నారో ... ఔత్సాహిక రంగస్థలం మీద శ్రీ వెంకటేశ్వరరావు అంతటి గ్లామర్‌నీ సంపాదించుకున్నారు.

గత శతాబ్దపు అరవయ్యవ దశకం ప్రారంభంలో కాకినాడలో యంగ్మెన్స్ హాపీ క్లబ్ వారు పరిషత్ నిర్వహించినప్పుడు ... కాలేజీ నాటకాల్లో రావు గోపాలరావు దర్శకత్వంలో నటించే మా అన్నయ్యతో బాటు పది సంవత్సరాల ప్రాయంలో వున్న నేను నా జీవితంలో మొట్టమొదటసారిగా ఓ పరిషత్ నాటకాలు చూడడానికి వెళ్ళినప్పుడు ప్రేక్షకులు అనేకులు "ఈరోజు కె. వెంకటేశ్వరరావు నాటకం వుంది'' అంటూ విశేషంగా మాట్లాడుకోవడం, ఆయన ప్రదర్శన "ఫణి" నాటకం, "రాజీవం'' నాటికలను రెప్ప వాల్చుకోకుండా చూస్తూ "ఓహో'' అంటూ శిరఃకంపం చేస్తూ తరచు చప్పట్లతో తమ హర్షాతిరేకాన్ని తెలియజేయడం 'ఓ ఔత్సాహిక నాటకాల నటుడికి ఇంతమంది అభిమానులా ?!!' అని ఆ పిన్నవయసులో నాకు మతిపోయి, నాటకాల పట్ల మనసు పడేసుకోవడం జరిగింది.

ఆ రెండు ప్రదర్శనలలోనూ కూడా గంగా ప్రవాహంలా సాగిన ఆయన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులందర్నీ మంత్రముగ్ధుల్ని చేసి వదిలింది. 'తలెత్తుకు నటించాడు ఆయన. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకి హైదరాబాద్ లో ఆయనకి సన్మానం జరిగినప్పుడు బాగా దగ్గరగా చూశాను ఆయన్ని. వేద మంత్రాలతో, పూర్ణ కుంభంతో ఆహ్వానిస్తూంటే 'తలెత్తుకునే' వేదిక మీదకి వచ్చాడాయన. వినయాన్ని 'నటించని' ఆయనకి ఆ అర్హత ఉందనే అందరూ అంగీకరించి హర్షధ్వానాలు చేశారు.

పరిషత్ పోటీలకి ఆయన ద్వారానే అంతటి గ్లామర్ అబ్బింది అని చెప్పడానికి నేను వెనకాడను.

ఈనాటికీ పరిషత్ పోటీలలో నాటకాలు ప్రదర్శించాలని కుతూహలపడే అనేకమందికి ఆ గ్లామరే ప్రేరణ. ఆయనకి ప్రత్యక్ష శిష్యులు ఎందరున్నారో పరోక్ష శిష్యగణం కూడా కనీసం పది రెట్లు వుంది అంటారు. సినిమాలలో వేసింది బహు తక్కువ అయినా, రేడియో నాటక నాటికలలో కూడా తన ప్రత్యేక ప్రతిభని చూపిన మహానటుడు ఆయన.

నాటకకళే ఊపిరిగాను, నిద్రాహారాలుగాను జీవించి, అతి పిన్న వయసులోనే కన్ను మూసిన వెంకటేశ్వరరావు గారు కళలకు, కళాకారులకు, కళాహృదయులకూ గోల్డెన్ పిరియడ్ అనదగ్గ 1950-70 ల మధ్య నటిస్తూ, దర్శకత్వం వహించే అవకాశం లభించడం కూడా ఆయన పట్టుదలకి పసిడిని అద్దింది.

ఆ మహాదర్శకుడి దర్శకత్వంలో ఓ చిన్న పాత్రలోనయినా నటించే అవకాశం లభించనందుకు బాధపడే వారిలో ఒకడిగా చింతిస్తూ స్వర్గస్థుడై యాభయి సంవత్సరాలయినా ఇంకా అంతటి అభిమానాన్నీ పొందుతూన్న ఆ మహాకళాకారుడి శత జయంతి సందర్భంగా ... 'మీరు మళ్ళీ పుట్టాలి మహానుభావా' అని కోరుతూ ... హృదయ పూర్వక నివాళులు అర్పిస్తున్నాను.

నమస్తే ...

**తులసి బాలకృష్ణ**



## చిర యశస్వి-నటరాజు కె.వి.



-బి.వి.అప్పారావు

పుట్టి పెరిగిన వాతావరణంలో ఒకనాడు వెల్లివిరిసిన నాటకరంగ వైభవం వలన, నాకు పద్య, సాంఘిక నాటకాలు రెండూ ఎంతో ఇష్టంతో పెరిగాను. అలాంటి నేను, రంగస్థలంపై కళాప్రపూర్ణ పీసపాటి నరసింహమూర్తి, నటరాజ్ కె. వెంకటేశ్వరరావు గార్లను చూడలేకపోవడం నా దురదృష్టంగా భావిస్తాను. అయితే దానికి అసలు కారణం, నేను వయసురీత్యా చిన్నవాడిని కావడం ప్రధానమైనది.

కె. వెంకటేశ్వరరావుగారు మరణించిన **(1973)** రెండేళ్ళ తర్వాత నేను రంగస్థల ప్రవేశం చేశాను. అయితే బాల్యంనుండీ నాకున్న నాటకాభిమానం వలన వారిద్దరి ప్రతిభాపాటవాల గురించి కొన్ని అంశాలు తెలుసుకోగలిగాను.

ముఖ్యంగా కె. వెంకటేశ్వరరావుగారి శిష్యులు కొత్తూర్తి భాస్కరరావు, రుద్రరాజు కుమరరాజా, పిళ్ళా అప్పలనాయుడు, ఎస్. కె. మిశ్రో, వంటి ఆత్మీయుల అనుబంధం వలన అనేక సంఘటనలు నా జ్ఞాపకాలలో నిక్షిప్తమై వున్నాయి.

కె. వెంకటేశ్వరరావుగారి నట, దర్శక ప్రతిభ చాలా పెద్ద కాన్వాస్‌పై చిత్రించవలసినది. బహుశా అందుకే, ఆయన తర్వాత కాలంలో ఎందరో ఆయన నటవారసులు, నటన, దర్శకత్వంలో ఆయనంతటి పేరుప్రతిష్టలు (ఉదా : చాట్ల శ్రీరాములు, దేవదాస్ కనకాల, కొత్తుర్తి భాస్కరరావు, రుద్రరాజు కుమారరాజా, ఎస్. కె. మిశ్రో, వంటి వారు) ఎవరూ ఆయన సమగ్ర నాటక ప్రస్థానాన్ని అక్షరబద్ధం చేయలేదని నా అభిప్రాయం.

కానీ, తాను మరణించినా, ఔత్సాహిక నాటకరంగంలో ఆయన ప్రాసంగికత ఈనాటికీ మిగిలి వుంది. ఆయనకు నాటకం పట్ల వున్న కమిట్మెంట్, నటీ నటుల పట్ల వున్న ప్రత్యేక అనురాగం ఆయనను చిరంజీవిని చేశాయి.

దాదాపు రెండు వందల నాటిక, నాటకాలలో నిబద్ధతతో నటించిన ఉత్తమ నటుడు కరి పద్మనాభాచార్యులు, అతని వాయిస్ నాటకానికి పనికి రాదని నిష్కర్షగా చెప్పేసారట. కానీ చిత్రంగా, మరో నాటకంలో అదే పద్మనాభాచార్యులు కె. వి. ఆర్. నటనకు ముగ్ధుడై, ఏకంగా ఆయన ఇంటికే వెళ్ళిపోయి క్షమాపణలు చెప్పారట. అంతే కాదు, 'బావ' అని వరస కలిపి (కె. వెంకటేశ్వరరావు గారి

శిష్యులతో ఎక్కువ మందిని ఆయన 'బావ' అనే పిలిచేవారట) ఒప్పించి, తన దర్శకత్వంలో 'కనకపుష్యరాగం' లో నటింపజేసిన నిష్కామ నటకర్మయోగి ఆయన. ఆ తర్వాత పద్మనాభాచార్యులు, కె. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులైపోయారు. "బావ' గారి భౌతికకాయన్ని మోస్తూ, ఆయన అంత్యక్రియలలో పాల్గొని, ఆయన ఋణం కొంత తీర్చుకున్నానని" ఓ సందర్భంలో కన్నీళ్ళ పర్యంతమయ్యారు.

అంతకన్నా ఓ గురువుకు కావలసిన 'గురుదక్షిణ' ఏముంటుంది?

ఎన్నో నాటకసంస్థలు ప్రారంభించి, ఉన్నతంగా తీర్చిదిద్దారు. వాటిలో చివరిది "బహురూప నట సమాఖ్య'' **(1971)** ఆ నాటి ఆయన శిష్యులు ప్రధానంగా ఎస్. కె. మిశ్రో ఈనాటికీ నాటక కార్యక్రమాలలో పాల్గొనడం కె. వెంకటేశ్వరరావుగారి సత్సంకల్పానికీ, చిత్తశుద్ధికీ, నాటకంపై ఆయన మమకారానికీ నిదర్శనంగా నిలిచి వుంది.

చివరిగా, ఆయన కుమారుడు, సాధారణ తండ్రీ కొడుకుల అభిరుచులకు భిన్నంగా, తండ్రి స్ఫూర్తితో కె. వి. ఎన్. డి. ప్రసాద్ నాటకరంగంలో రాణించడం అరుదైన చరిత్ర. తండ్రికి నాటకరంగ వారసుడు కావడం, వెంకటేశ్వరరావుగారికి నటరాజు ప్రసాదించిన వరమనే చెప్పాలి.

ఆ మహానటరాజమూర్తికి శతజయంతి వేళ నా నిండు నివాళులర్పిస్తున్నాను.

**-బి.వి.అప్పారావు**
విశాఖపట్నం
**9347039294**





## అభినందన మందారాలు

-డి.విరజానంద్, బెంగుళూరు
-జి.హరగోపాల్, హైదరాబాద్

తెలుగు ఆధునిక నాటకానికి నూరేళ్ళ చరిత్ర ఉందనుకుంటే, సమకాలీన సమస్యలపై శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావుగారి కృషి అభినందనీయం. జనంకోసం ప్రజా నాట్యమండలి, యువత నిమిత్తం కాలేజీ రంగస్థలాలూ సేవలు అందించాయి. నటనకు విశ్వవిద్యాలయాలు శిక్షణా కేంద్రాలు అందించాయి. కళాశాలల్లో నాటిక, నాటక పోటీలు నిర్వహిస్తూ, ఆంధ్ర రాష్ట్రంలో నటులు, దర్శకులు, రచయితలుగా తయారుచేసి, రంగస్థలంలో శహభాష్ అనిపించుకొనేలా చేసాయి. వారిలో కొందరు సినీ హీరోలుగా, దర్శకులుగా, రచయితలుగా రాణించారు.

Sir C. R. రెడ్డి కాలేజీ, ఏలూరు - హిందూ కాలేజి, గుంటూరు -ఎ.ఎన్.ఆర్. కాలేజి, గుడివాడ - డి.ఎన్.ఆర్. కాలేజీ, భీమవరం- నెల్లూరు - తిరుపతి - బళ్ళారి - ఇలా చెప్పుకుంటూ పోతే చాలా కళాశాలలు నాటక, నాటిక పోటీలు, నాటకవారోత్సవాలు జరుపుకోవడానికి శ్రీ కె.వి.ఆర్. గారి ప్రోత్సాహం చాలా, చాలా ఉందనే చెప్పాలి.

ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టేజి డైరెక్టర్‌గా శ్రీ వెంకటేశ్వరరావుగారి పాత్ర అభినందనీయం. "ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థలంపై ప్రతీపాత్ర డైలాగు, కదలిక, అభినయం స్వయంగా చేసి చూపించి విశిష్ట శిక్షణ ఇచ్చేవారు. ఉత్తరాంధ్ర తెలుగు భాషకి, యాసకి వట్టాభిషేకం చేసి...కొడుకుపుట్టాల, పావలా, ఆగండి కొంచెం ఆలోచించండి లాంటి రచనలతో యావత్ భారతానికి తెలుగు రంగస్థల ఘనతను చాటి చెప్పిన ప్రయోక్త శ్రీ వెంకటేశ్వరరావుగారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టేజి మీద L.K.N. నాటక పరిషత్ రాజమండ్రిలో తొలి మదర్ టీమ్ ప్రదర్శనలు చూసిన అదృష్టవంతులం మేము విరజానంద్ & హరగోపాల్. నిజయితీగా చెప్పాలంటే కె.వి.ఆర్. గారి ఏకలవ్య శిష్యులం.

రంగస్థలం మీద మూమెంటు, యాక్షన్, డైలాగ్, డిక్షన్, మాడ్యులేషన్లకు శ్రీ కుప్పిలి వెంకటేశ్వర రావు గారు తనదైన స్టైల్‌లో నిఘంటువును రాశారు. ప్రతి రచయిత ఒక పరిశోధకుడు - ప్రతి నటుడు ఒక అభినయమూర్తి - ప్రయోక్త అతి స్వతంత్రుడు - అని నిర్వచించిన మహనీయుడు మన వెంకటేశ్వరరావు గారు. సినీ రంగంలో కూడా వారి ప్రతిభను ఒక ప్రత్యేక శైలిగా నిరూపించారు. శతజయంతి వేడుకల సందర్భంగా ఈ అభినందనమాలికను సేకరించి ప్రచురిస్తున్న డా॥ కె. మోహనరావుగారికి ధన్యవాదములు, సహకళాకారులకి శుభాకాంక్షలు.

## జ్ఞాపకమ్



-డా॥ పాతూరి సుబ్రహ్మణ్య కవి

శ్రవణ దృశ్య రూపకము నాటకము. దశవిధ రూపకములలో ప్రధానమైన నాటకమునందు లోకవృత్తాంతము యితివృత్తముగా తీసికొనబడుతుంది. కనుక, నటీ నటులు పాత్రారోహణము గావించుకొని, సమిష్టిగా ప్రదర్శన చేయ సంకల్పించుకొనుటయే, నాటకములోని ప్రధానాంశము. రసభావ ప్రదర్శన జరిగితే, యథార్థమైన ప్రేక్షకాదరణ పొందగలిగిన అభినయమౌతుంది.

ప్రదర్శింపబడే నాటకము లేక నాటిక (తక్కువ నిడివి గలది) లో కథా వృక్షము దృఢముగా స్థాపింపబడుటకు బీజము ఉత్తమమైనది కావలయును. భారతీయ, పాశ్చాత్య నాటకములలో ఈ లక్షణము సమర్ధవంతముగా పోషింప బడినదగుట విజ్ఞులకు తెలిసినదే. వస్తువు కల్పితమైనదే అయిన, ప్రేక్షకుల విశ్వాసము పొందగలిగినదైతే, ప్రదర్శనోద్దేశ్యము సఫలీకృతమైనట్లే. దాని కొఱకు, సజీవమైన పాత్రను సృష్టించవలసియుంటుంది. మాలిన్యములనబడు శృతి మించిన హాస్యము, దుఃఖముల ప్రక్షాళనము జరిగితే, ప్రదర్శనా వస్తువు జనరంజకమౌతుందని ప్రాచీన కాలము నుండి నేటి వరకు యెల్లరకు తెలిసిన సత్యము.

తెలుఁగు నాటకములలో ఇతివృత్తము, పాత్ర చిత్రీకరణము, సంభాషణములు కుపయుక్తమైన భాష పాత్రానుసరణమై యుండుట, వానికి తగిన శబ్దము ప్రధానములు. సాంఘిక నాటకములలో జనజీవనము, జీవితములతో సంబంధితమైన సమస్యల పరిష్కారమే రచయితలు వ్యక్త పరుస్తారు. ఆ ప్రయత్నానికి సజీవరూపమిచ్చేవారు దర్శకులు, నటీనటులు. వారిలో కీర్తి గడించిన వారు కుప్పిలి వెంకటేశ్వరరావుగారు.

మహానటులు, దర్శకులుగా ప్రఖ్యాతి జెందిన నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావుగారు, ఎందరో శిష్యులను తీర్చిదిద్దిన కళోపాసకులు. 1961 లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ (ఆంధ్ర విశ్వవిద్యాలయం) లో దర్శకత్వ నిర్వహణకై, రంగస్థల విభాగములో చేరిన దాదిగ, వారి రంగస్థల జీవితం, ఎప్పటికప్పుడు క్రొత్తదనాన్ని సంతరించుకున్నదని నాటకరంగ ప్రియులకు, రచయితలకు, సహచరులకు, శిష్యులైనవారికి తేటతెల్లము.

నేను చూసిన 'వాగ్దానము' చిత్రములో నాయకుని తండ్రి పాత్ర, నన్నా చిన్న వయసులోనే ప్రేరణ చేసింది. మా తండ్రిగారైన నటరాజు పాతూరి రామకృష్ణమూర్తిగారు (ఆంధ్ర నాటక కళాపరిషత్

దుర్యోధన ప్రథమ బహుమతి గ్రహీత, తెనాలి) ప్రఖ్యాత పౌరాణిక నటులు, వారి నుండి నటనాభినివేశం ఏర్పడిన నాకు చిన్నతనము నుండి నిశిత దృష్టితో నాటకములు, నాటికలు చూసే భాగ్యము కలిగినది. ఆ చిత్రములో తండ్రి పాత్ర పోషించినది, కుప్పిలి వెంకటేశ్వరరావుగారని నాడు నాకు తెలియదు. మనిషి తెలియకున్న, ఆ పాత్ర నాలో చెరగని ముద్ర వేసింది. అతిశయోక్తి అనుకోకపోతే, సందర్భం వచ్చినప్పుడల్లా, నేటికీ, ఆ పాత్రను నా అనుచరులతో గుర్తుచేసుకుంటూ ఉంటాను.

ఈమధ్య మిశ్రో గారితో ముచ్చటించడం జరిగింది. సాంఘిక నాటక పరిణామం గురించి, వారు శ్రీ కుప్పిలి శిష్యులని తెలిసిన తరువాత ఎంతో సంతోషం కలిగింది. సమాజంపై అవగాహన సంపూర్ణంగా కలిగిన కీ॥ శే॥ కుప్పిలి వెంకటేశ్వరరావుగారు, వారి నటించిన పాత్రలలో, దర్శకత్వం వహించిన నాటకాలు, నాటికలలో ఎప్పటికీ చిరంజీవులే.

క. మానవ జీవితములఁ గని
మానితముగ నిల్పి రంగ మార్తాండులనన్
కానిది లేదని పించగ
ఆ నటులు చిరముగ నొందు యశమీ వసుధన్

కళాభివందనమ్

**పాతూరి**

అధ్యాపకులు, నాటకకర్త, దర్శకులు, గుణనిర్ణేత,
నటరాజు పాతూరి నాటక సాహితీ కళాసమితి వ్యవస్థాపకులు,
తెనాలి












శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు గారి హావభావాలు










శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు గారి హావభావాలు






కుటుంబ సభ్యులతో శ్రీ కుప్పిలి వెంకటేశ్వరరావు




నందనం
సంవత్సర






































SUPER SOUND




















# నాటక, కళ రంగాలకు

# పూర్వ వైభవం



- ఏయూ కళా ప్రాంగణాల ఆధునీకరణ
- 24న ఓపెన్ ఆడిటోరియం పునఃప్రారంభం
- దర్శకులు కుప్పిలి వెంకటేశ్వరరావును స్మరిస్తూ నాటక ప్రదర్శన మంచి పరిణామం
- కుప్పిలి శత జయంతి ఉత్సవంలో ఏయూ వీసీ ప్రసాద రెడ్డి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్, నవంబర్ 21 : నాటక, కళ రంగాలకు పూర్వ వైభవం రానుందని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశాలకు తగిన ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో ఏయూలోని కళా ప్రాంగణాలను ఆధునీకరించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. తెలుగు నాటక రంగ ప్రయోక్త, సుప్రసిద్ధ దర్శకులు కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని ఆంధ్ర విశ్వ కళాపరిషత్, రైటర్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మద్దిలపాలెంలోని కళాభారతిలో 'కొడుకు పుట్టాల' నాటక ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ రచయిత గణేష్ పాత్రో రాసిన నాటిక అద్యంతం ప్రేక్షకులను మిగతా 2లో...



# నాటక, కళ రంగాలకు

# పూర్వ వైభవం

(మొదటి పేజీ తరువాయి)

అలరించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంలో నటన కళా రంగాలకు సంబంధించిన సబ్జెక్టులను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. నాటక, కళ రంగాలకు పూర్వ వైభవం రానుందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచన మేరకు పూర్వ కళా రంగాల ప్రాంగణాలను ఆధునీకరణ చేయ నున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఏయూలోని ఓపెన్ ఆడిటోరియంను రీ-మోడల్ చేసి, ఈనెల 24న సినీ హీరో నాగార్జున, నటి అమల దంపతులతో ప్రారంభిం





చనున్నట్లు తెలిపారు. ఏయూకు వెంకటేశ్వరరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. అధ్యక్షత వహించిన మాజీ మంత్రి, రచయిత దాడి వీరభద్రరావు మాట్లాడుతూ తెలుగు నాటక రంగంలో కుప్పిలి వెంకటేశ్వరరావు చేసిన కృషి అజరామం అన్నారు. 12 సంవత్సరాలు ఏయూ థియేటర్ ఆర్ట్స్ శాఖాధిపతిగా, డైరెక్టర్‌గా కుప్పిలి వ్యవహరించారన్నారు. సుమారు 70, 80 నాటకాలకు వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించి ప్రదర్శింప చేశారని తెలిపారు. అప్పట్లో కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో కుప్పిలి నాటకాలకు వేలాదిమంది ప్రేక్షకులు వచ్చే వారని గుర్తు చేశారు. వెంకటేశ్వర శత జయంతి రోజున ఈ నాటక ప్రదర్శన చేద్దామని వీసీని సంప్రదించడంతో అంగీకరించారని ఆనందం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించిన నాటకాన్ని ప్రదర్శించాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కోరడం జరిగిందన్నారు. జనాభా పెరుగుదలను నియంత్రించాలనే సామాజిక సందేశం నాటకంలో ఉందన్నారు. నాటకాలను ఎప్పటికప్పుడు ప్రోత్సహించే రైటర్స్ అకాడమీ తరఫున రమణమూర్తి నాటికను ప్రదర్శింప జేయడం అభినందనీయమన్నారు.

ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు ప్రసంగిస్తూ ఏయూలోని థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ ఒకప్పుడు కళాకారులతో కిటకిట లాడేదని, ప్రతినెలా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో నాలుగైదు కార్యక్రమాలు జరిగేవని గుర్తు చేశారు. మరల దానికి పూర్వం వైభవం తేవడానికి వీసీ ప్రసాద్ రెడ్డి చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. కళకు కళాకారులకు మరణం లేదని, అందుకు నాటకానికి విచ్చేసిన ప్రేక్షకులే నిదర్శనం అన్నారు. రైటర్స్ అకాడమీ అధినేత వీవీ రమణమూర్తి మాట్లాడుతూ మొదటి కార్తీక సోమవారం రోజున వెంకటేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని, నాటక ప్రదర్శన ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. దాదాపు 40 ఏళ్ళ క్రితం ప్రదర్శించిన నాటకాన్ని, కేవలం 15 రోజుల్లో శిక్షణ తీసుకొని కళాకారులు నాటకాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఏయూ భాగస్వామ్యంతో తొలిసారిగా నాటక ప్రదర్శన జరగడం ఆనందంగా ఉందన్నారు. నాటక ప్రదర్శన తిలకించడానికి విచ్చేసిన డాక్టర్ ఆదమ్స్, గణేష్ పాత్రో భార్య లక్ష్మీ కుమారి, మేకప్ ఆర్టిస్ట్ కె.చిరంజీవి, నాటక రంగ దర్శకులు చలసాని కృష్ణ ప్రసాద్‌లకు రమణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. కుప్పిలి వెంకటేశ్వరరావు కుమారుడు ప్రసాద్ మాట్లాడుతూ.. నాన్న 49 ఏళ్ళు మాత్రమే జీవించారని, కాని 50 ఏళ్ల తర్వాత, ఆయన దర్శకత్వం వహించిన నాటికను గుర్తు చేస్తూ ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా రంగస్థలం నటులు డాక్టర్ ఆదమ్స్, ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ కె.చిరంజీవి, నాటక రంగ దర్శకులు చలసాని కృష్ణప్రసాద్, కేవీ మెమోరియల్ ఆర్ట్స్ అధ్యక్షులు టి.శివప్రసాద్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అదేవిధంగా ఆర్ట్స్ కళా ప్రిన్సిపాల్ నరసింహారావు, వీసీ ప్రసాద రెడ్డిలకు చిరు సత్కారం చేశారు.

THE HANS INDIA

# Birth centenary of 'Nataraja' Venkateswara Rao grandly celebrated

HVRS PRASAD
VIJAYAWADA

DRUSYA Vedika Samskrutika Seva Samstha celebrated the 100th birth anniversary of 'Nataraja' K Venkateswara Rao at Velidandla Hanumantharaya Grandhalayam hall on Sunday.

On the occasion, a meeting was organised with actor-director S K Misro, writer-actor Y S Krishneswara Rao and actor-director MC Das. Speaking on this occasion, Das said that Venkateswara Rao was master for dialogue diction and drama designing. He also said that he had acted in many dramas and all the characters acted by him were well appreciated by the critics and public as well.

Y S Krishneswara Rao said, "Venkateswara Rao's career serves as a guide for future generation artistes." He said that lives of such personalities, their acting style and experiences should be documented.



Souvenir being released on the occasion of the 100th birth anniversary celebration of 'Nataraja' K Venkateswara Rao

Misro, a direct disciple of Venkateswara Rao, shared his experiences and feelings about Venkateswara Rao. Misro said that Venkateswara Rao's approach to mould an artiste was very peculiar. He said he had always enjoyed working with Venkateswara Rao.

The meeting was presided over by Dontala Prakash, vice-president of Drusya Vedika. He said that Drusya Vedika will celebrate the centenary of Venkateswara Rao from November 2023 to November 2024 and all the programmes will be dedicated to him.

On this occasion, a classical dance programme was showcased by the students of Ghantasala Pavankumar. They performed Ganesha Stuthi, Annamacharya Kriti and Balakanaka Mani Chela. These dance items were performed by Tanmayi, Kavya, Meghana, Tanuja, Bhuvana, Hema, Yoshita, Mounisha, Lohita, Varshita, Getrasya and Chetana and they received appreciation from the audience.

A playlet titled 'Jarugutunna Katha' was staged by Aravinda Arts, Tadepalli. This was penned by Akella and directed by Gangotri Sayi. This was well received by the people present at the auditorium as this was connected to the present society. This drama was supported with music by K Satyanarayana Murthy, make-up by Seshagiri and technical assistance by Madhu. This programme was organised by Padmasree, Borra Naren, Kathi Syam Prasad and E Ramesh.

28/11/2023 VIJAYAWADA Pg 03

# రంగస్థల ప్రతిభా యశస్వి!

**నా**టక రంగంలో మూడు దశాబ్దాల పాటు ఒక సంచలన చరిత్ర సృష్టించిన గొప్ప నటుడు, దర్శకులు, వక్త నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు. 1923 నవంబరు 20వ తేదిన పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లులో ఆయన జన్మించారు. కళాశాల విద్యార్థిగానే నట ప్రవేశం చేశారు. 'ఆంధ్ర ప్రజానాట్య మండలి' విధా నాలన ఆపోశన పట్టిన కె. వెంకటేశ్వరరావు ఆ ఒరవడినే కొనసాగారు. ఆయన నటించే సన్నివేశంలో ఉన్న తోటి నటులు ఆయన నటనలో లీనమైపోయిన విధానానికి అబ్బురపడుతూ తమ డైలాగులు మరచిపోయి తడబడిన సందర్భాలెన్నో ఉన్నాయని శిష్యులంటారు. ఆయన మూడు దశాబ్దాల నాటక రంగ చరిత్రను పెద్ద కాన్వాస్‌పై చిత్రించాల్సి వుంది. చాట్ల శ్రీరాములు, దేవదాస్ కనకాల, గొల్లపూడి, కొత్తుర్తి భాస్కరరావు, రుద్రరాజ్ కుమార్ రాజా, గణేష్‌పాత్రో, ఎస్.కె. మిశ్రో, సి.ఎ. శివ రామిరెడ్డి వంటి ఎందరో ఆయన శిష్యులు ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకొన్నారు.



నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు

మచిలీపట్నంలో 1955లో 'ఆంధ్రనాటక కళాపరిషత్' ఆధ్వర్యంలో నాటిక పోటీలు జరిగాయి. ఆత్రేయ రచించిన 'నా బాబు' నాటికలో నటనకు గాను 'ఉత్తమ నటుడు' బహుమతి గెలుచుకోవడంతో, ఆయన విజయపరంపర మొదలైంది. 1958లో ఆత్రేయ సాన్నిహిత్యం వలన, ఆయన నిర్మించిన 'వాగ్దానం' చిత్రానికి సహాయ దర్శకునిగా పనిచేయడమే కాక, ఒక పాత్రలో నటించారు. మళ్ళీ 1961లో 'ఇద్దరు మిత్రులు' చిత్రంలో నటించారు. కానీ, విషాదం ఏమిటంటే, వెంకటేశ్వరరావు 'స్వరపేటికకు' అసూయ, ఆందోళన చెందిన ఒక నటుడి ఒత్తిడి మేరకు వెంకటేశ్వరరావు పాత్రను 'మూగవాణ్ణి' చేసేశారు. ఆనాటి ఆ దుర్మార్గం నేపథ్యం బాగా తెలిసినవారు ఆ సంఘటన గురించి చెబుతారు. ఆ తర్వాత 1972లో 'కన్నెవయసు' చిత్రంలో అద్భుతంగా నటించారు. విజయవాడలో 'ర.స.న. సమాఖ్య' స్థాపించడం ద్వారా ఎందరినో గొప్ప నటులుగా తీర్చిదిద్దారు. అలాగే, న్యూఢిల్లీలో నటశిక్షణ కోసం వెళ్ళిన ఆయన అక్కడ 'దక్షిణ భారత నటీనట సమాఖ్య' స్థాపించారు.

వెంకటేశ్వరరావు నట, దర్శక వైదుష్యానికి ఒక 'అకడమిక్ స్టేటస్' కల్పించినవారు డా॥ కె.వి. గోపాలస్వామి. ఆంధ్రవిశ్వ విద్యాలయం 'థియేటర్ ఆర్ట్స్' విభాగంలో స్టేజి డైరెక్టరుగా ఆయన్ని నియమించింది వారే. దాంతో, ఎందరో ఔత్సాహికులను, నటన, దర్శకత్వంలో తీర్చిదిద్దిన అధ్యాపకునిగా ఆయన నాటక రంగ చరిత్రలో నిలిచిపోయారు. ఎన్నో నాటక సంస్థలు ప్రారంభించి, ఉన్నతంగా తీర్చిదిద్దారు. వాటిలో చివరిది 'బహురూప నటసమాఖ్య' (1971). ప్రముఖ నాటక రచయిత మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్రరావు, 'నటరాజ కె.వెంకటేశ్వరరావు నటీ, నటసమాఖ్య' పేరుతో నాటక సంస్థను నెలకొల్పారు. ఆ సమాజం ద్వారా తాను రచించిన సంచలన నాటక, నాటికలు, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించి, కేవీ ఆశీస్సులందుకున్నారు.

1979లో విశాఖవాసి, స్వర్గీయ బి.ఎస్. చలం (నటుడు, నాటక పోషకులు) 'నటరాజ కె.వెంకటేశ్వరరావు స్మారక నాటక కళా పరిషత్' స్థాపించారు. నటుడు, దర్శకులు పి. శివప్రసాద్ 'కె.వి. మెమోరియల్ ఆర్ట్స్' సంస్థను నెలకొల్పారు. ఇంతటి ఘనత వహించిన ఆ నటరాజ మూర్తికి తెలుగు నాటకరంగం నిండు నివాళులర్పిస్తోంది.

– బి.వి. అప్పారావు : 93470 39294

(రంగస్థల దిగ్గజం కుప్పిలి వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా)

# స్ఫూర్తి ప్రదాత.. కుప్పిలి వెంకటేశ్వరరావు



'జరుగుతున్న కథ' నాటకంలో ఓ సన్నివేశం

గాంధీనగర్: నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్స వాలను పురస్కరించుకొని ఆదివారం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నటుడు, దర్శకుడు ఎస్. కె. మిశ్రో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వెంకటేశ్వరరావు సంభాషణలతీరు, స్పష్టత అనిర్వచనీయమన్నారు. డాక్టర్ ఎం. సి. దాస్, వై. ఎస్. కృష్ణేశ్వరరావులు మాట్లాడుతూ.. ఎంతో మంది కళాకారులకు స్ఫూర్తినిద్వారని కొనియాడారు. ఏడాది పాటు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని కార్యక్రమాలను వెంకటేశ్వరరావుకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన పిల్లలు.. చదువులు, ఉద్యోగాల పేరుతో దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఉద్యోగ జీవితంలో సంపాదించిన డబ్బును.. పిల్లలు తమ అవసరాల కోసం తీసుకుంటూ.. వారికి ఆర్థిక భరోసా లేకుండా చేస్తున్న వైనంపై ప్రదర్శించిన 'జరుగుతున్న కథ' నాటకం సభికులను ఆలోచింపజేసింది. ఇందులో గంగోత్రి, సాయి, ద్రాక్షారామ సరోజ, వసంత యామిని, బండారు నాగరాణి, వి. వి. స్వామి, పి. రంగనాయకులు.. వారి వారి పాత్రల్లో రక్తికట్టించారు. తాడేపల్లి అరవింద ఆర్ట్స్ సమర్పణలో వల్లూరు శివప్రసాద్ రచనలో.. గంగోత్రి సాయి దర్శకత్వంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. కె. సత్యనారాయణమూర్తి సంగీతం సమకూర్చారు. మాజేటి సురేంద్రనాథ్ సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నరేన్, పద్మశ్రీ, రమేష్, కత్తి శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఆంధ్ర విశ్వకళాపరిషత్

మరియు

Writers Academy

సంయుక్త ఆధ్వర్యంలో



తెలుగు నాటకరంగ ప్రయోక్త, సుప్రసిద్ధ దర్శకులు

ఆంధ్రవిశ్వకళాపరిషత్ రంగస్థల విభాగ తొలి స్టేజ్ డైరెక్టర్

కీ॥శే॥ **కుప్పిలి వెంకటేశ్వరరావు** గారి

# శత జయంతి వేడుకలు

నవంబర్ 20, 2023
సోమవారం
సాయంత్రం 6.00 గం.లకు
వేదిక: కళాభారతి, ఆడిటోరియం,
మద్దిలపాలెం, విశాఖపట్నం.

సాంఘిక నాటకరంగ ప్రముఖులు

స్వర్గీయ కె.వెంకటేశ్వరరావుగారి
శతజయంతి సందర్భంగా

ఆకాశవాణి విజయవాడ కేంద్రం సమర్పణలో

# మహా నటుడు

డాక్యుమెంటరీ రూపకం

రచన: సాయి పద్మశేఖర్

రూపకల్పన,నిర్వహణ
డాక్టర్ బి జయప్రకాష్

ఈనెల 20వతేదీ సోమవారం ఉదయం10:03కు,
22వతేదీ బుధవారం రాత్రి 9:30కు
ఉభయ తెలుగు రాష్ట్రాల ఆకాశవాణి కేంద్రాలనుండి ప్రసారం

* 'NEWS ON AIR APP'ద్వారా
మీ మొబైల్లోనే ఈకార్యక్రమం వినవచ్చు

9849430393

# ప్రవాస భారత తెలుగు తల్లిదండ్రుల సంక్షేమ సంస్థ

## NRI TELUGU PARENTS WELFARE TRUST, A.P

(A No Frofit Charitable Trust. No. 114/2005)

చైర్మన్ : ఆకురాతి మురళీకృష్ణ, 93913 25046

### ట్రస్టు సభ్యత్వం : కార్యక్రమాల ముఖ్య వివరాలు

2004, 2005లో జరిగిన అమెరికాలోని తెలుగువారి సంస్థలు "ఈటా, తానా సమావేశాల్లో జరిగిన చర్చల పరిశీలనాంతరం ఎన్నారై తల్లిదండ్రులకు ఓ సంస్థ కావాల్సిన అవసరాన్ని గుర్తించి ట్రస్టును 2005లో రిజిస్టర్ చేయడం జరిగింది. ఎన్నారై తల్లిదండ్రులు తముకోసం తామే ఏర్పాటు చేసుకున్న ఛారిటబుల్ సంస్థ NRITPWT. 2012 జనవరి 11వ ప్రవాస భారతీయుల దినోత్సవం (NRI Day) సందర్భంగా హైదరాబాద్‌లోని డా॥ ఎ.ఎస్.రావు నగర్‌లోని ఎన్నారై పేరెంట్స్ సమావేశంతో కార్యక్రమాలు ప్రారంభించింది. మన రాష్ట్రంలోని అన్ని జిల్లాలు అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో యీ ట్రస్ట్ కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

1. ప్రవేశం: రూ.100/- ప్రవేశ రుసుం చెల్లిం చిన ఎన్నారై తల్లిదండ్రులందరూ ఎన్నారై పేరెంట్స్ కుటుంబ సభ్యులు (NFM) ఔతారు. ఈ కుటుంబ సభ్యుల నుంచి ఏర్పడే రాష్ట్ర కమిటీ ట్రస్టు బోర్డు సభ్యులతో సమావేశమై సాధారణ/ జీవిత / శాశ్వత సభ్యత్వం నియమాలు నిర్ణ యిస్తుంది.

2. లక్ష్యాలు

ఎ. స్వీయ సంక్షేమం :

1) ట్రస్టు సభ్యులందరు ఒకే కుటుంబ సభ్యులు. తమ సొంత కష్టాలను ట్రస్టు ఏర్పాటు చేసుకునే స్థానిక కమిటీ సభ్యులతో సంప్రదిస్తే, అవసర చర్యలు తీసుకుంటారు.

2) ఒంటరితనం ఫీలయ్యే సభ్యులకు అండగా నిలబడి ధైర్యం కలిగిస్తారు. ఒంటరిగా వున్న సభ్యులు కోరుకున్నచో ఒకే యింట్లో వసతి కల్పించి ఏసీ సౌకర్యంతో సహా భోజన, మెడికల్, టి.వి. వినోద సౌకర్యాలతో షేరింగ్ పద్ధతిపై సుఖ జీవనానికి ఏర్పాటు చేయబడును. విదేశాల్లోని పిల్లలను కంప్యూటర్ ద్వారా చూసు కుంటూ మాట్లాడుకునే ఏర్పాట్లు కల్పించ బడతాయి. అవసరాన్నిబట్టి ప్రతి జిల్లాలోను వెటరన్స్ ప్యారడైజ్ (ఎన్నారై పేరెంట్స్ హాస్టల్) నిర్వహించడానికి ట్రస్టు సిద్ధంగా వుంది. (అవసరమైనచో మరణానంతరం గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించబడతాయి)

3) సభ్యులకు వినోద, విహారయాత్రలు వారి కోరికపై ట్రస్టు నిర్వహిస్తుంది.

4) ప్రమాదాలు జరిగి, దుర్ఘటనలో చనిపోయిన ఎన్నారైల భౌతికకాయాలు స్వదేశం చేర్చడానికి ట్రస్టు తగిన కృషి చేస్తుంది.

5) సంస్థ సభ్యుల విదేశీయానానికి సంబంధించిన పాస్‌పోర్టు, వీసా, ప్రయాణ సన్నాహాలకు కౌన్సిలింగ్ సహాయం ఇవ్వబడుతుంది.

6) విదేశీ రాకపోకల సందర్భంగా సభ్యు లకు, ఎన్నారైలకు హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో రెస్ట్‌హౌస్, టాక్సీ సౌకర్యాలు ఏర్పాటు చేయబడతాయి.

7) విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్ళే విద్యార్థుల భద్రతకోసం కేంద్ర రాష్ట్రప్రభుత్వాలతో (విదేశీ ప్రభుత్వాలతో సహా) ట్రస్ట్ చర్చించి తగిన చర్యలు తీసుకుంటుంది. విదేశీ విద్యాలయాల వాస్తవ పరి

స్థితులను సేకరించి కోరుకున్న విద్యార్థులకు సమాచారం అందిస్తుంది.

బి. ఎన్నారైల సంక్షేమం : ఎన్నారైలందరూ యీ సంస్థ కుటుంబ సభ్యుల సంతతి, కాబట్టి ఎన్నారైలు స్వదేశంలో తమ పిల్లలకు విద్యాసంస్థల్లో సీట్లు, వివాహ సంబంధాలు, ప్రాపర్టీ కొనుగోలు మొదలైన విషయాల్లో దళారీల దోపిడీల నుంచి కాపాడే చర్యలు ట్రస్టు తీసుకుంటుంది. వారు స్వదేశం వచ్చినప్పుడు కావలసిన వసతి, రవాణా సౌకర్యాలు ముందుగా తెలియబరచినచో ట్రస్టు ఏర్పాట్లు చేస్తుంది.

సి. సమాజసేవ : ఎన్నారైల విద్యాభ్యాసానికి వారి తల్లిదండ్రులుగా మనం చేసిన ఖర్చు కన్నా నాలు గైదు రెట్లు ప్రభుత్వానికి ఖర్చవుతుంది. ఆ విధంగా మనం సమాజానికి రుణపడివున్నాం. కావున యీ సమాజానికి మనం తిరిగి చెల్లించాల్సిన (Pay Back to Society) అవసరం వుంది. అవినీతి, అక్రమార్జన, అశ్లీలం, మద్య పానం, మూఢాచారాలకు వ్యతిరేకంగానూ, రాజ్యాంగ పరిరక్షణ. సామ్రాజ్య వాదానికి వ్యతిరేక స్వదేశ ఉద్యమాలు మొ॥గు విషయాల్లో రాజకీయ పార్టీలతో సంబంధంలేని ప్రజా సంఘాలకు ఈ ట్రస్టు మద్దతునిస్తుంది. పద్మశ్రీ నాజర్ కళాక్షేతం (కల్చరల్ ట్రస్టు) ఆధ్వర్యంలో సాహిత్య, సాంస్కృతిక, క్రీడా రంగాలలో కార్యక్రమాలు. నిర్వహిస్తుంది.. వీధి బాలలు, అనాథ మహిళలు, వృద్ధుల సంరక్షణకు పునరావాసానికి తగిన చర్యలు చేపడుతుంది.

అసలైన లౌకిక విధానానికి అనుగుణంగా ఏ విధమైన మతపరమైన కార్యక్రమాలు ట్రస్టు నిర్వహించదు. "శాస్త్రీయ, నైతిక విలువలు గల నాగరిక సమసమాజ నిర్మాణానికి చేయూతనిద్దాం.

డి. మాతృభాషాభివృద్ధి : మాతృభాష మృతభాష కాకుండా దాని పరిరక్షణకు ట్రస్టు కృషి చేస్తుంది.

3. ఆదర్శాలు: "మహాత్మా జోతిబాపూలే సత్య శోధక్ సమాజ్ ద్వారా అనవసర ప్రచారం, ఆర్భాటాలకు, దుబారా ఖర్చులకు దూరంగా పాదుపాటించిన విధానం, గాడ్గే బాబా ఆచరించిన సేవా భావం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నేతాజీ, భగత్‌సింగ్, మ్యాడం కామా వంటి దేశభక్తుల త్యాగ నిరతి, త్రిపురనేని రామస్వామి చౌదరి భావజాలం, అవినీతి వ్యతిరేక విధానాలు ఈ ట్రస్టుకు ఆదర్శాలు.

4. మాసపత్రిక : వివిధ జిల్లాలలో జరుగుతున్న ట్రస్టు కార్యక్రమాల సమాచారంతో ఎన్నారై కుటుంబం మాసపత్రిక వెలువరించబడుతుంది. కుటుంబ సభ్యులందరి వివరాలతో ప్రతి సంవత్సరం డైరీ, కాలెండరు. సావెనీర్లు ప్రచురించ బడతాయి.

5. గమనిక : ఒక సంస్థ మనుగడ తన ఆదర్శం, స్వచ్ఛత, త్యాగనిరతి, సేవాభావాలు, ఆచరణ, పారదర్శకతలపై ఆధారపడి వుంటాయి. ఈ ట్రస్టు వాటిని పాటిస్తుంది. మీ అభిప్రాయాలు మొహమాట పడకుండా ఈ-మెయిల్ ద్వారా ఎప్పటికప్పుడు తెలియబరచవచ్చును.

6. సభ్యత్వం :

ఎ. సాధారణ సభ్యులు: సంవత్సరానికి రూ. 1200/- లు చెల్లించినవారు సాధారణ సభ్యులు, వీరు ప్రతి సంవత్సరం వార్షిక సభ్యత్వ రుసుం చెల్లించవలసివుంటుంది.

బి) కార్యవర్గ సభ్యులు:

1) ఎన్నారై పేరెంట్స్‌ను కులమతాలు ప్రాంతీయతల పరిగణలతో నిమిత్తం లేకుండా కనీసం 10 మందిని సభ్యులుగా చేర్పించినవారు, ఏ రాజకీయ పార్టీలోనూ క్రియాశీల సభ్యత్వం లేనివారు, నియోజకవర్గ / నగర కమిటీలో కార్యవర్గ సభ్యులు.

2) కనీసం 20 మంది సభ్యులను చేర్పించిన వారు. జిల్లా / నగర కమిటీ కార్యవర్గ సభ్యులు...

3) కనీసం 30 మంది సభ్యులను చేర్పిం చిన వారు జోనల్ కమిటీ కార్యవర్గసభ్యులు.

4) కనీసం 40 మంది సభ్యులను చేర్పిం చిన వారు ప్రాంతీయ కమిటీ కార్యవర్గసభ్యులు.

5) కనీసం 50 మంది సభ్యులను చేర్పిం చిన వారు రాష్ట్ర కమిటీ కార్యవర్గసభ్యులు.

## ఆంధ్ర విశ్వకళాపరిషత్

మరియు

రైటర్స్ అకాడమి
Writers Academy

సంయుక్త ఆధ్వర్యంలో



తెలుగు నాటకరంగ ప్రయోక్త, సుప్రసిద్ధ దర్శకులు
ఆంధ్రవిశ్వకళాపరిషత్ రంగస్థల విభాగ తొలి స్టేజీ డైరెక్టర్

కీ॥శే॥ **కుప్పిలి వెంకటేశ్వరరావు** గారి

# శత జయంతి వేడుకలు

నవంబర్ 20. 2023
సోమవారం
సాయంత్రం 6.00 గం.లకు
వేదిక: కళాభారతి, ఆడిటోరియం.
మద్దిలపాలెం, విశాఖపట్నం.


నందనం అకాడమీ తిరుపతి వారి
ఆహ్వానం
నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు శతజయంతి
సంవత్సర ప్రారంభ సూచకంగా
ఆత్మీయ సంస్మరణ మరియు స్మారకసంచిక ఆవిష్కరణ.
వేదిక : గేట్ కళాశాల సమావేశ మందిరం.
తేది : 20-11-2023, సమయం: మధ్యాహ్నం 2.గంలకు
తిరుపతి నాటకరంగ మిత్రులకు
ఇదే మా సాదర ఆహ్వానం



**<u>నందనం అకాడమీ తిరుపతి</u>**

**<u>ఆహ్వానం</u>**

నటరాజా కుప్పిలి వెంకటేశ్వరరావు శతజయంతి సంవత్సర ప్రారంభ సూచకంగా ఆత్మీయ సంస్మరణ మరియు స్మారక సంచిక ఆవిష్కరణ.

స్వాగతం : డాక్టర్ పత్తిపాటి వివేక్

ప్రార్థన : జి.కే.సుందరం

అధ్యక్షులు: శ్రీ యం.రమేష్
ప్రిన్సిపాల్ గేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాల తిరుపతి

ఆవిష్కర్త: ఆచార్య మధురాంతకం నరేంద్ర.

**ప్రధాన వక్తలు**

డాక్టర్ కొల్లి మోహన్ రావు
(అంశం:విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాత) ఏలూరు

శ్రీ ఆకుల మల్లేశ్వరరావు తిరుపతి
(అంశం:జీవితం-వ్యక్తిత్వం)

శ్రీ వెంపటి రాధాకృష్ణ
(అంశం: నాటక రంగ నిబద్ధత)హైదరాబాద్

**<u>స్పందనలు :</u>**

వందన సమర్పణ: శ్రీ నక్కా రాజేంద్ర ప్రసాద్

వేదిక: గేట్ కళాశాల సమావేశ మందిరం
తేదీ సమయం:20.11.23 మ.2గం.లకు.

**తిరుపతి నాటకరంగ మిత్రులకు ఇదే మా సాదర ఆహ్వానం**

## 10-06-2024 తేదీన పొన్నూరు లో జరిగిన
## 'నటరాజు' కీ|| శే|| కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతి
## ఉత్సవ సంస్మరణ సంచిక ఆవిష్కరణ సభాకార్యక్రమం
## చిత్రమాలిక














డా: నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదిక








డా॥ సన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదిక






డా॥ సన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదిక




2024 జూన్ 8, 9, 10
డా॥ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్




డా॥ సన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదిక
జిల్లా పరిషత్ హైస్కూల్ - నిడుబ్రోలు.



# అనుబంధం


పలికెడిది నటరాజు చరిత్ర ... బి. హెచ్. రామమూర్తి

నటనకు రారాజు 'నటరాజు' ... డా॥ కె. జి. వేణు

"పలికెడిది నటరాజు చరిత"

"పలికించెడివాడు నటరాజు"



బి హెచ్ రామమూర్తి
విశాఖపట్నం
93472 69632

బి హెచ్ రామమూర్తి

ప్రేరణ :- నాటకరంగ వార్తలను ఏరోజుకారోజు నాటక మిత్రులకు, నాటక శ్రేయోభిలాషులకు, ఎప్పటికప్పుడు అందించగలుగుతున్న ఏకైక సంస్థ "రంగ మిత్ర" ఎందరో మహనీయులు ఆ సంస్థకు అండదండలున్నా కర్త+కర్మ+క్రియా తానేగా నడుపుతున్న రంగమిత్ర రథసారధి "శ్రీ కొల్లి మోహన్ రావు గారు"

మోహన్ రావు గారు "నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతి సంచిక " 97 పేజీల pdf ని పంపించారు ... ఏమి అదృష్టం ? ఆ సత్పురుషుడి సంచికలో నాకూ కొన్ని పేజీలా ! తప్పక వ్రాయాలి ... ఎందుకంటే 97 పేజీలలో మూడే పేజీలు మిగిలాయి ... ఆ మూడు పేజీలు పూర్తయితే శతజయంతికి శత పేజీల వ్యాసాలు అంకితమవుతాయి ... కానీ ఏం రాయాలి ? ఏం వ్రాయగలను ... అమ్మ శారదమ్మ వ్యాసం ... కొడుకు కె. వి. ఎన్. డి. వ్యాసం ... అల్లుడు గణేష్ పాత్రో వ్యాసం .... ఇక "బహురూప" పేరు మీద ఒక సంచికనే తీసుకు వచ్చిన మిశ్రో గారి వ్యాసం ... మాస్టర్ గారితో కొన్ని వందల ప్రదర్శన చేసిన అమ్మ విజయలక్ష్మి వ్యాసం ... ఆయనతో థియేటర్లో చేరి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చిన శిష్యుల వ్యాసాలు ... ఇక ఫ్రీ లాన్స్ జర్నలిస్టు శ్రీ బీవీ అప్పారావు గారు వయస్సులో చిన్నవారైనా విషయ సేకరణలో ఘనాపాటి ... వెరసి నేనేమి రాస్తాను ? ... అయినా రాస్తాను ... కారణం నా చేత వ్రాయిస్తున్నది ఆ పరమశివుడే ... నేను నిమిత్తమాత్రుడను ...

శ్రీ గణపతిరాజు అచ్యుతరామరాజు గారికి సన్మానం :- ఒక రోజు నేను ఉదయాన్నే మా గురువుగారు కే. యస్. గారి ఇంటికి వెళ్ళాను. కె. ఎస్. గారంటే కె. సత్యనారాయణ గారు ... సిటీ హైస్కూల్లో మాస్టారు ... నటరాజు కె. వెంకటేశ్వరరావు గారి కన్యాశుల్కంలో "అగ్ని హోత్రావధానులు" పాత్ర వేసిన వారు ... ఈయన పాత్ర చూసి జె. వి. సోమయాజులు, రమణమూర్తి, వీరిని తమ కన్యాశుల్కం నాటకంలో "అగ్ని హోత్రావధానులు" వేయమని

ఆహ్వానించారు. అప్పటి నుండి శ్రీ కె. ఎస్. గారు మరణించే వరకు ఆ పాత్రను వేశారు ... నేను ఉండేది బీచ్ ఒడ్డున ఉన్న అగ్రహారంలో ... కె. ఎస్. మాస్టర్ ఉండేది ... అక్కడికి దగ్గరగా టెక్కలి మందు షాప్ కి ఎదురుగా ... ఆ ముందు రోజే టౌన్ హాల్లో నాటకం జరిగింది ... "బొబ్బిలి యుద్ధం" నాటకం లో ఓ సన్నివేశం ... కె. యస్. మాస్టర్ దానికి దర్శకులు నిర్వాహకులు ... కె. ఎస్. గారు హైదర్ జంగు పాత్రలో, శ్రీ పీసపాటి గారు విజయనగరం మహారాజుగా, నేనొక ముఖ్య పాత్రలో, అప్పటికి కళ్యాణి కళా సమితి ద్వారా చాలా ప్రదర్శనలు ఇచ్చాము ...

అయితే శ్రీ గణపతి రాజు అచ్యుత రామ రాజు గారి శిష్యగణం, కొందరు రాజకీయ మిత్రులు, కొందరు బంధువులు, ఆయనకు 60 ఏళ్ళు వచ్చిన సందర్భంగా ఘనంగా సత్కరించాలని, కాలికి గండపెండేరాన్ని తొడగాలని నిర్ణయించారు, రాజు గారి కాలికి తొడిగే సమఉజ్జీ ఎవరు ? అని ఆలోచిస్తుండగా, పీసపాటి వారు ఆలోచనలోకి వచ్చారు. రాజుగారు పీసపాటి గారు ... సహమిత్రులు కాబట్టి సన్మాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు ... అచ్యుతరామరాజు గారికి ఎందుకో వేషం వెయ్యాలని కుతూహల పడ్డారు. అందులో కె. యస్. మాస్టర్  వేసే 'హైదర్ జంగ్'  వేషం తాను వేసి "బొబ్బిలి యుద్ధం" నాటకంలో ఒక సన్నివేశం ప్రదర్శించారు. విజయనగర రహస్యాలను, బొబ్బిలికి చేరవేసే  ఓ గూఢచారి పాత్ర నాది. స్త్రీ వేషంలో బుట్టలో కొన్ని సామాన్లు, అందులో ఒక రొట్టె, రొట్టెలో విజయనగరానికి సంబంధించిన విషయాల చీటీ ... దాన్ని పట్టుకుని బయటపెట్టే సన్నివేశం ... రాజుగారికి తగినన్ని రిహార్సల్స్ లేక కొంచెం ఇబ్బంది పడ్డారు .. తక్కిన నటుల సహకారంతో సన్నివేశం అతి బలవంతంగా ముందుకు నడిచింది.

ఆ విషయాలు మననం చేసుకుంటుంటే ... మోటార్ సైకిల్ మీద 'జయ్' మంటూ వచ్చారు కె. వెంకటేశ్వరరావు గారు ... మా ఇద్దరిని చూస్తూ .. నాకు ఇన్విటేషన్ ఇచ్చారు .. మహనీయుడు అచ్యుతరామరాజు గారు అంటే నాకు చాలా గౌరవం .. నేను  ముందే ఊహించాను .. ఆయనకు నిన్న ఒకే వేదిక మీద  సన్మానం ... అవమానం రెండు జరిగాయి అన్నారు నిష్కర్షగా ... ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడడం శ్రీ వెంకటేశ్వరరావు గారి నైజం ...

శ్రీ వెంకటేశ్వరరావు గారి ప్రదర్శనలో ఏదైనా చేయాలనుకున్నాను. నాకు అదృష్టం లేదు. అయినా ఒకటే తృప్తి మిశ్రో గారి దర్శకత్వంలో చేస్తున్నాను అని .. మిశ్రో వేరు, వెంకటేశ్వరరావు వేరు కావచ్చు ... కానీ వారి  ఆత్మలు ఒకటే ...

దీనికి చక్కని ఉదాహరణ ... కె. వెంకటేశ్వరరావు గారి 10 నెలల కొడుకు చనిపోయాడు ... కుర్రాడి మృత కళేబరం ముందు, అందరూ కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నారు ... ముందేం జరగాలో చూడవలసిన తరుణం .. వెంకటేశ్వరరావు గారు

దిగ్గున లేచి ... ఓ అరగంటలో వస్తాను శారదా అంటూ సరాసరి (విజయవాడ) ఆకాశవాణి కేంద్రానికి చేరుకున్నారు.

"నా బాబు" నాటిక లైవ్ ప్రదర్శన జరగవలసి ఉంది. అప్పటికి Pre-Recording సదుపాయాలు లేవు ... నా బాబు నాటికలో కొడుకు చనిపోయే సన్నివేశం ... ఇక్కడ ఏడవవలసిందంతా అక్కడ ఏడ్చి ... ఇంటికి వచ్చారు ...

ఇలాంటి సన్నివేశమే ...

అది ఆచార్య ఆత్రేయ గారి "ఈనాడు" నాటక ప్రదర్శన ... అందులో ఒక పాత్రధారి శ్రీ మిశ్రో ... మిశ్రో గారి కుమారుడు ఉదయం చనిపోయాడు అన్న వార్త ... నాటకాన్ని వాస్తవంగా ఆపాలి ... కానీ అక్కడి కార్యక్రమాలు పూర్తి చేసుకుని మిశ్రో గారు నాటకానికి వచ్చారు ... తన హాస్య పాత్రను అద్భుతంగా పండించారు ...

ఈ నాటకంలో శ్యామల కథానాయికి ... తన బిడ్డతో సహా రంగస్థలం మీదకు వచ్చి ... "నా ఇంటి వారే నాకు శత్రువులుగా మారుతున్నారు ... నా ప్రాణాలైనా తీసుకోండి ... నా బిడ్డను కాపాడండి" అంటూ శరణు కోరుతూ గుండెలు చూపిస్తుంది ... ఆ దృశ్యం చూసిన ప్రేక్షకులు రెచ్చిపోయారు ... ఒకటే ఈలలు ... నటరాజు లేచాడు ... "తన హావభావాలలో ... మీరు చూస్తున్నది ఆమెలో శృంగారాన్ని ... అది మేము చేసుకున్న దురదృష్టం ... ఇంతవరకు ఈ నాటకం వెనుక ఎంత కష్టం దాగి ఉందో మీకు ఎవ్వరికీ తెలియదు ... ఇందులో ఇంతవరకు హాస్యాన్ని ప్రదర్శించిన శ్రీ మిశ్రో గారి కుమారుడు ఉదయం మరణించాడు ... కొడుకు కార్యక్రమాన్ని ఇంటిలో త్వరగా ముగించుకుని వచ్చి ఈనాడు ఈ నాటకం చేస్తున్నాడు ... అందుకు ఆ మహానటుడి కి పాదాభివందనాలు" ... అంటూ తన ఆర్ద్రత చాటుకున్నారు ... అందుకే వారి దేహాలు వేరైనా ఆత్మ ఒకటే ...

శ్రీ కె. వెంకటేశ్వరరావు గారి నాటకాలు, నాటికలు, రచయితలు :- శ్రీ గణేష్ పాత్రో గారిని వెలుగులోకి తెచ్చిన నాటిక "కొడుకు పుట్టాల" 14 భాషలలో అనువదింపబడి యావద్భారత్ కీర్తిని సంపాదించి పెట్టిన దృశ్య కావ్యం ... విశాఖపట్నం మాండలీకంలో ఉండటం ఈ రచనలో ఉన్న ప్రత్యేకత. గంగులు, ఫకీర్, సింహాద్రి, శరభయ్య, కొర్లమ్మ ఇవన్నీ సజీవ పాత్రలే ... శరభయ్య పాత్రధారి శ్రీ కె. వెంకటేశ్వరరావు గారు, తన నట విశ్వరూపంతో పాత్రలతో పాటు ప్రేక్షకుల్ని కూడా తనలో మమేకం చేసుకుని నడిపించేవారు, ఇదే వెంకటేశ్వరరావు గారి నట జీవితంలో నటించిన చివరి నాటిక.

గొల్లపూడి మారుతీ రావు గారివి, శ్రీ కె. వెంకటేశ్వరరావు గారివి, విభిన్న ఆలోచనలు, అయినా భిన్నత్వంలో ఏకత్వంలో ఎన్నో నాటక నాటికలు కలిపి వ్రాశారు ... అందులో "రాగరాగిణి" గొల్లపూడి గారి అద్భుత రచన ... "యూజీనీ ఒనీల్" వ్రాసిన "బియాండ్ ది

హెురైజాన్" అనే నాటకం దీనికి ఆధారం ... ఎక్కడా స్ఫురణకు రాదు ... శ్రీ కె. వెంకటేశ్వరరావు గారి దర్శకత్వంలో అద్భుతంగా ప్రదర్శింపబడింది ... కె. వెంకటేశ్వరరావు గారి తర్వాత ఈ నాటకాన్ని ఎవరూ ప్రదర్శించలేదు.

ఓ దశాబ్ద కాలం పాటు భమిడిపాటి రాధాకృష్ణ గారు రచించిన "కీర్తిశేషులు" శ్రీ వెంకటేశ్వర రావు గారికి అపారమైన కీర్తిని ఆర్జించి పెట్టింది ...

నాటక కళ కోసం చదువు చట్టు బండలు చేసుకుని కళా ప్రపంచాన్ని నమ్ముకుని దగా పడిన ఓ మహానటుడు (మురారి),

తన సాహిత్య సృష్టిని మెచ్చి ప్రజలు తమపై అమృత వర్షం కురిపిస్తారని అమాయకంగా ఆశలు పెంచుకున్న ఓ మహాకవి (వాణీనాధం) ... ఇవి ప్రధాన పాత్రలు ... దీని దర్శకత్వంతో పాటు మురారి పాత్రను ధరించి వెంకటేశ్వరరావు గారు నిజంగా కీర్తిశేషులు అయ్యారు ...

ప్రఖ్య శ్రీ రామమూర్తి గారు తెలుగులో మొదటిసారిగా అపరాధ పరిశోధక నాటక రచనకు శ్రీకారం చుట్టారు ... 'ఫ్రెడరిక్ నాట్' "డయల్ M ఫర్ మర్డర్" నాటకానికి అనుసరణ "ఫణి". శ్రీ కె. వెంకటేశ్వరరావు గారు తన ర. స. న. సమాఖ్య ద్వారా అద్భుతంగా ప్రదర్శించారు.

రష్యన్ నాటక కర్త " నికొలోయ్ గొగోల్" అనే ఆయన అప్పటి సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, అవినీతి, లంచగొండితనం ఎలా జరుగుతోంది ... ప్రజాధనాన్ని అధికారులు ఎలా చాకచక్యంగా కైవసం చేసుకుంటున్నారు ... ఇతివృత్తాన్ని తీసుకొని శ్రీ బెల్లంకొండ రామదాసు గారు "ఆకాశరామన్న" పేరుతో నాటకం రాశారు. శ్రీ కె. వెంకటేశ్వరరావు గారు అద్భుతంగా ఈ నాటకాన్ని ప్రదర్శించారు.

రాష్ట్రేతర ప్రాంతమైన జంషెడ్పూర్ లో 1988 నుంచి అనేక నాటకాలు ప్రదర్శిస్తున్నారు ఆర్. వి. చలం గారు ... ఆయన పూర్తి పేరు రావి వెంకటాచలం ... వీరి కుటుంబం అంతా నటులే ... ఎన్నో పరిషత్తులలో తన నాటక నాటిక లు ప్రదర్శించారు ... అన్నీ వీరి కుటుంబంతోనే ... శ్రీ కె. వెంకటేశ్వరరావు గారికి రావి వెంకటాచలం గారితో నాటకం వేయాలి అన్నది ఆలోచన ...

జంషెడ్పూర్ వెళ్ళారు వెంకటేశ్వరరావు గారు ... రావి వెంకటాచలం గారితో "మాట తప్పకు" ... రిహార్సల్స్ ప్రారంభించారు ... ప్రదర్శన కూడా ఇచ్చారు ... అయితే రావి వెంకటాచలం గారిలో ఒక అనుమానం ఉండేది ...

కె. వెంకటేశ్వరరావు గారు మద్యం సేవిస్తారని ... కానీ అది అపభ్రంశ ... ఆ మహానటుడు నియమ నిష్ఠలతో నాటకం చేసి ... తన వేషంతో జంషెడ్పూర్ ప్రేక్షకుల్ని ఉత్రూత

లూగించిన మహానటుడు ...

ఇలా చెప్పుకుంటూపోతే పేజీలు చాలవు ... లెక్కలేనన్ని ప్రశంసలు, లెక్కలేనన్ని బహుమతులు, వందలాది తనను మించిన శిష్యులు.

1948లో ఆల్ ఇండియా రేడియో విజయవాడ కేంద్రం ప్రారంభమైంది. నాటక కళాకారులను కూడా ఆస్థాన విద్వాంసులుగా నియమించారు ... అలా నియమించబడ్డ కళాకారులు శ్రీ బందా కనక లింగేశ్వర రావు గారు, శ్రీ కె. వెంకటేశ్వర రావు గారు ముఖ్యులు. మామూలుగా నాటక-నాటికలను ఎన్ని ప్రదర్శనలు ఇచ్చారో ... అంతకన్నా ఎక్కువ రేడియో నాటక-నాటికలలో పాల్గొన్నారు ...

1973లో ఆయన నటించిన "కన్నె వయసు" సినిమాకు, డబ్బింగ్ చెప్పారు ... ఆయన ఆ సినిమాలో తన విశ్వరూపాన్ని చూపించారు..

విశాఖపట్నం పోర్టు జింఖానా క్లబ్బులో విశాఖ జూనియర్ ఛాంబర్ వారి ఆధ్వర్యంలో నాటిక పోటీలు జరుగుతున్నాయి ... ఆరోజు "కొడుకు పుట్టాల "నాటిక ... కె. వెంకటేశ్వరరావు గారు వేషం వేస్తానని ... ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని తెలుసుకున్న ... నటులు, మిత్రులు, శిష్యులు, వద్దని అభ్యంతరం పెట్టారు. వంకాయల సత్యనారాయణ బలవంతంగా ఆయన్ని ఆసుపత్రిలో చేర్చాడు..

25-5-1973 జింఖానా క్లబ్ లో నాటికి పోటీ జరుగుతోంది ... వెంకటేశ్వరరావు గారు రంగస్థలం మీద వేయాల్సిన పాత్ర నాటకంలో నిష్క్రమించింది ...

అలాగే అదే సమయానికి వెంకటేశ్వరరావు గారు ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు

డాక్టర్ ఆడమ్స్ గారు ఈ వార్తను రంగస్థలానికి చేర్చారు ... వెంటనే నాటిక పోటీలు సంతాప సూచకంగా ఆపి వేశారు ...

26-5-1973 ఆయన పట్ల గౌరవ సూచకంగా ... ఆంధ్ర యూనివర్సిటీ కళాశాలలు మూసివేశారు ... ఈ వార్త అటు ఆకాశవాణిలో, ఇటు వివిధ దినపత్రికల్లో ప్రధానాంశంగా వచ్చింది ... కొన్ని పత్రికలు సంపాదకీయం కూడా వ్రాశాయి ...

రాష్ట్ర ప్రభుత్వ సంగీత, నాటక, లలిత కళల అకాడమీలు ... తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసేయి. "కన్నె వయసు" సినిమా హాలులో శ్రీ కె. వెంకటేశ్వర రావు గారి ఫోటో పెట్టి పూలమాలలు అలంకరించి జ్యోతి వెలిగించి నివాళులర్పించారు ... అందరూ అభిమానులు ఆరోజు "కన్నె వయసు" సినిమా చూసి అతని నటనకు జోహార్లు అర్పించారు.

అతని "భౌతికకాయం" మన ముందు లేకపోయినా ... అతని "కీర్తికాయం" ఆచంద్రార్కం శాశ్వతంగా ఉంటుంది ... జోహార్ వెంకటేశ్వరరావు గారు ! జోహార్, జోహార్ !

బి హెచ్ రామమూర్తి

# నటనకు రారాజు 'నటరాజు'
# కుప్పిలి వెంకటేశ్వరరావు



-డా॥ కె.జి. వేణు

ఆ పేరు స్మరిస్తే చాలు ఇప్పటికీ నాటకరంగం పులకరించి పోతుంది. దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగు నాటక రంగంలో ఒక ప్రభంజనంలా వెలిగి, వందల సంఖ్యలో నటీనటుల్ని తయారుచేసి, జీవితమే నాటకంగా, నాటకమే జీవితంగా సాగించిన నటచక్రవర్తి, స్వర్గీయ కుప్పిలి వెంకటేశ్వరరావుగారు 20, నవంబరు 1923న పశ్చిమగోదావరి జిల్లా, దాగల్లు గ్రామంలోని రైల్వే స్టేషన్లో యార్డులో పడివున్న ఒక పనికిరాని రైలు పెట్టెలో జన్మించారు.

శ్రీమతి సీతయ్యమ్మ, శ్రీ కుప్పిలి ప్రకాశరావులు జన్మ ఇచ్చిన తల్లిదండ్రులు.. 'ఆస్మా' వ్యాధి వారిని ఆక్రమించుకొని, ఆశ్రయించుకొని జీవితాంతము బాధించింది. అనారోగ్యంతో మాటలు సరిగా రాకుండానే బాల్యం గడిచిపోయింది. మాటలు పలకడం నేర్చే సరికి ఎనిమిదవ యేడు రానే వచ్చింది.

తండ్రి రైల్వేలో చిరు ఉద్యోగి.. హైస్కూలు చదువులు పూర్తిచేసి కుటుంబ ఆర్థిక పరిస్థితుల వలన రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజిలో ఇంటర్మీడియట్ పూర్తి చేయలేకపోయారు. 1945లో దక్షిణ రైల్వేలో 'శ్రీకాళహస్తి' స్టేషనులో చిన్న ఉద్యోగంలో చేరారు. అదే సంవత్సరం లోనే వెంకటేశ్వరరావు గారికి శారదమ్మతో గారితో వివాహం జరిగింది. 1946లో బెజవాడ రైల్వే డివిజన్ ఆఫీసుకు బదిలీ అయి 1960 వరకు అక్కడే ఉండిపోయారు. మదరాసులో ఉన్నప్పుడు ప్రఖ్యాత దర్శక, నిర్మాతలు బి.ఎన్. రెడ్డి మరియు చక్రపాణి గారల అభిమానం పొందివున్నారు. బి.ఎన్. రెడ్డి గారే కె.వి.గోపాల స్వామినాయుడు గారికి, యూనివర్శిటీ డిపార్టుమెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కు వెంకటేశ్వరరావు గారిని స్టేజీ డైరెక్టరుగా తీసుకోమని సూచించారు.

ఆ విధంగా 1961లో విశాఖపట్టణం ఆంధ్ర విశ్వవిద్యాలయం 'థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ కు' ప్రప్రథమ స్టడీ డైరెక్టరుగా నియామకం జరిగింది.

"నాటకం నా ఊపిరి, జీవితం తదుపరి" అన్న వెంకటేశ్వరరావు గారి ఊపిరిని సగం, చిన్నతనం నుండి బాధిస్తున్న 'ఆస్త్మా' పంచుకుంది.మిగిలిన ఆ సగం ఊపిరితో,అంతకు రెట్టింపయిన పట్టుదలతో,తనను క్రిందికి లాగే రోగాన్ని, తాను క్రిందపడితే తెగ సంతోషించే మనుషుల్ని తోసుకుంటూ,దూసుకుంటూ పరుగులమీద వెళ్లి, తెలుగు నాటకం మీద వినూత్న జ్యోతులు వెలిగించారు.. 'నటరాజు' అని ప్రజావాహిని చేత మనసారా పిలిపించుకొన్నారు.

వెంకటేశ్వరరావు గారికి 'నటన' అన్నది ఆయన రక్తంలోనే వుంది.చిన్నతనంలో పది, పదకొండు సంవత్సరాల వయసు లో బిచ్చగాని హావభావాలను అనుకరిస్తూ ఇంటిల్లపాదిని ఆకర్షించే వారు.వెంకటేశ్వరరావు గారిని నటుడిగా గుర్తించి రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్ గా పనిచేసిన శ్రీ పింగళి వెంకటరామయ్య గారు 1945 లో ఆయన రాసిన 'కరణీకం'లో పాపయ్యశాస్త్రి పాత్ర ఇచ్చి ప్రోత్సాహించారు.వేసిన మొట్టమొదటి నాటకంలోనేఉత్తమ నటనకు వెంకటేశ్వరరావుగారు ప్రథమ బహుమతి అందుకొన్నారు.

1948లో విజయవాడలో రైల్వే ఉద్యోగంలో స్థిరపడ్డాక మనసా, వాచా నాటకరంగానికి అంకితమైపోయారు. ఎన్నో నాటికలు, నాటకాలు ప్రదర్శించారు. మరెన్నో బహుమతులు, బిరుదులను అందుకొన్నారు. వాటితో తృప్తి పడక దర్శకత్వం వహించి, నాటకాలను మథించి, నటనలో ప్రదర్శనలో అపూర్వమైన నూతన పోకడలు సృష్టించారు. నాటకాన్ని కట్టుదిట్టంగా రిహార్సల్ చేయడం.. ధరిచే పాత్రను పూర్తిగా అర్థం చేసుకొని, ఆ పాత్రను ఆత్మ విమర్శ దృష్టితో పరిశీలించడం, అనుకొని సమయానికి నాటకం ప్రారంభంచేయటం... అన్నిటి కంటే ముందు క్రమశిక్షణకు మొదటి స్థానాన్ని కల్పించటం.. ఇవన్నీ వెంకటేశ్వర రావు గారిని శిఖరాగ్ర స్థాయికి చేర్చాయి.

నవ్య కళామండలి' నాటక సమాజాన్ని 1948లో ప్రారంభించి, శ్రీ ముద్దుకృష్ణ రచించిన 'టీ కప్పులో తుఫాను' నాటికను అనేకమార్లు ప్రదర్శించారు. అందులో నాయికపాత్ర ధరించిన శ్రీమతి నిర్మల,ఆ తరువాత సుప్రసిద్ధ సినీ నటిగా పేరు తెచ్చుకున్నారు. 1951లో విజయవాడలో ర.స.న. సమాఖ్య (రసజ్ఞుల, సహృదయుల, నటీనటుల సమాఖ్య)ను స్థాపించి, దేశమంతా తిరుగుతూ, ప్రదర్శనలు ఇస్తూ, సాంఘిక నాటకానికి ఒక ప్రతిపత్తిని, గౌరవాన్ని చేకూర్చారు. ఆ తరువాత ర.స.న. సమాఖ్య శాఖలు కాకినాడ (1959), మద్రాసు (1960), విశాఖపట్టణం (1961) వరకు విస్తరించాయి.

నాటకంలో 'రామ బ్రహ్మం' పాత్ర కోసమే పుట్టారా! అనిపించే వెంకటేశ్వరరావు గారు 'కప్పలు' నాటకంలో విశ్వాసపాత్రమైన నౌకరు కోసం వేసి... అంత చిన్న పాత్రను ధరించి కూడా 'ఉత్తమ నటుడు' బహుమతి గెల్చుకున్నారు. సాధారణంగా అని నాటకాలలోనూ డైలాగును ఆయుధంగా చేసుకొనే వెంకటేశ్వరరావు గారు, శ్రీ గొల్లపూడి మారుతీరావు గారి చేత వ్రాయించుకొన్న 'రాగరాగిణి' నాటకంలో 'రఘు' పాత్ర ద్వారా మౌనంతో, చూపులతో, భావ వ్యక్తీకరణం ఎలా ఎన్నో డైలాగుల పెట్టుగా చేయవచ్చునో చేసి చూపించారు.

నాటక రంగానికి క్రొత్త క్రొత్తస్థిరీకరణలు తీసుకురావడం ధ్యేయంగా ఆయన తన నాటకాలను తయారు చేసేవారు. 'బొత్తం మనిషి' - మాటలు లేని నాటిక, కన్యాశుల్కం - 2 1/2 గంటలకు కుదించి సమర్పించిన నాటకం, మహానటుడు - ఆత్మాశ్రయ నాటక ప్రదర్శన... ఈ విధంగా రంగస్థలం... ఒక ప్రయోగశాలగా మారిపోయింది ఆయనకు.

నాటక రంగం పట్ల ఆయనకున్న అంకితభావం అచంచలమైనది. అతని పది నెలల కొడుకు (ప్రథమ సంతానం) చనిపోతే... ఇంటిల్లిపాది రోదిస్తున్న సమయంలో అరగంటలో వస్తానని ఆకాశవాణి (విజయవాడ) కేంద్రం చేరుకొని శ్రీ కొర్రపాటి గంగాధర రావు రచన 'నా బాబు' నాటిక లైవ్ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఆ నాటికలో ఆయన ధరించిన పాత్ర కొడుకు చనిపోతాడు. ఇంకొకమారు శ్రీ రాఘవ రాసిన 'కనక పుష్యరాగం' నాటక ప్రదర్శనకు న్యూఢిల్లీ బయలు దేరుతున్న సమయంలో, తాను ఎంతో అభిమానించే తన సోదరి మరణవార్త వస్తుంది. దుఃఖాన్ని కొన్ని క్షణాలు దిగమ్రింగుకొని రైలెక్కి న్యూఢిల్లీ చేరి నాటకాన్ని అద్భుతమైన రీతిలో ప్రదర్శింపచేశారు.

1958లో దక్షిణ భారత నటీనట సమాఖ్య స్థాపించి దాని అభివృద్ధికై నిరంతరం పనిచేయటం, భారత రాజధాని న్యూఢిల్లీలో భారీ ఎత్తున బాధ్యతాయుత ప్రదర్శనలివ్వటం వెంకటేశ్వరరావు కృషిని జాతీయ స్థాయిలో అందరూ గుర్తించేటట్లు చేసింది. న్యూఢిల్లీలో ర.స.న. సమాఖ్య తరుపున 'ఆకాశరామన్న, పెళ్ళిచూపులు, గుడ్డిలోకం, వెంకన్న కాపురం, రాగరాగిణి, కప్పలు, దొంగవీరుడు, కనకపుష్యరాగం, త్రివేణి, అసురసంధ్య మొదలగు నాటిక, నాటకాలను ప్రదర్శించారు.

నాటక పరిషత్ లో న్యాయ నిర్ణేతగా అతని ఖ్యాతి ఎప్పటికీ చెక్కుచెదరనది. నటీనటుల ప్రావీణ్యానికే మొదటి మార్కుయివ్వడంలో ఆయనెప్పుడూ రాజీపడలేదు. ఆశ్రితజన పక్షపాతం అనేవి అతనికి యేకోశాన లేవు. అత్యుత్తమ గుణ నిర్ణేతగా నాటకరంగ చరిత్రలో ఆ స్థానం ప్రత్యేకమైనది.

వెంకటేశ్వరరావు గారు పాల్గొన్న అసంఖ్యాక రేడియో నాటిక, నాటకాలు ఆకాశవాణి విజయవాడ, విశాఖపట్టణం కేంద్రాలు సమర్పించాయి. ఆకాశవాణిలో ఆయన పాల్గొన్న ముఖ్యమైన నాటకాలు 'మూడంతస్తుల మేడ, కీర్తిశేషులు, ఆఖరు ప్రేమలేఖ, కన్యాశుల్కం, రాగరాగిణి, నా బాబు,ఓ సీత కథ, తామరపూవు కానుక' మొదలైనవి.

చిత్ర సీమ కూడా ఆ మహానటుడిని సాదరంగా ఆహ్వానించింది. ఆయన నటించిన తొలి చిత్రం

'ఇధ్ధరు మిత్రులు'. 1960-61లో ఆత్రేయ దర్శక, నిర్మాతగా వ్యవహరించిన 'వాగ్దానం ' సినిమాలో హీరో తండ్రిగా నటించడమే కాక,

ఆ చిత్రానికి సహాయ దర్శకులుగా కూడా పనిచేశారు. ఆయన నటించి చివరి చిత్రం 'కన్నె వయసు'. ఆయన శిష్యరికం చేసి చలన చిత్రసీమకు పరిచయం అయినవారు పొట్టి ప్రసాద్ సి. హెచ్. క్రిష్ణమూర్తి, దాట్ల శ్రీరాములు, జి.వి. సుబ్బారావు, సాక్షి రంగారావు, కృష్ణచైతన్య, మిశ్రో, ధం. తంబు, వంకాయల,జయశ్రీ శ్రీమతి వాణీబాల, కె.విజయలక్ష్మి, పావలా శ్యామల మొదలగువారు.

1971లో అతన్ని పరీక్షించిన డాక్టర్లు, నాటకాలు మానేస్తే పదేళ్లు, నాటకాలు వేస్తే రెండేళ్లు బ్రతుకుతావని చెప్పారు. "నాటకాలు వేయకపోతే నేను ఉండి ఏం ప్రయోజనం" అంటూ నాటకాల్ని కొనసాగించారు. మే 12, 1973న సికింద్రాబాద్ లలిత కళా సంస్థ

శ్రీ వెంకటేశ్వరరావు గారికి చారిత్రాత్మకమైన సన్మానం చేసిన తరువాత మూడు రోజులకే నటరాజా, రంగస్థల నటసామ్రాట్, నట చతురానన, రంగభాస్కర బిరుదాంకితుడు,15, మే 1973న తుది శ్వాస వదిలారు. అయినా తెలుగు నాటక రంగం జీవించినంత కాలం 'నటరాజా' వెంకటేశ్వరరావు గారు బ్రతికేవుంటారు.

-డా॥ కె.జి. వేణు

విశాఖపట్నం

చరవాణి : 98480 70094


స్వదేశీ కళలు !
స్వదేశీ క్రీడలు !!
స్వదేశీ సంస్కృతి !!!
పద్మశ్రీ నాజర్ కళాక్షేత్రం
కళ ప్రజల కోసం, ప్రగతి కోసం, సామాజికన్యాయ సాధన కోసం
నైతిక విలువలుగల నవనాగరిక సమసమాజ
నిర్మాణానికి పాటుబడదాం!
సభ్యులుగా చేరండి! ప్రజా కళలను ప్రోత్సహించండి!!
mālā

నాటకం నా ఊపిరి
జీవితం తదుపరి



కె.వి.ఆర్ గారి
అడుగుజాడల్లో...



నాజర్ కళాక్షేత్రం ప్రచురణ